
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

చిక్కులున్నా లెక్కచేయకుండా గగనయాన్ ఉరవడి కొనసాగాలి : శుక్లా
ఆరోగ్య కారణాల వల్ల.. 'వాంగ్‌చుక్ విడుదల' సాధ్యం కాదు
ఒప్పందం కాదు.. అమెరికా దోపిడీ 05

సంపుటి 09, సంచిక: 75 | గురువారం | 12-02-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## గ్రేటర్ హైదరాబాద్ ఇక

# 3 కార్పొరేషన్‌లు

### జిహెచ్‌ఎంసి, సిఎంసి, ఎంఎంసిగా విభజన

- మూడు కార్పొరేషన్‌లలో ఏక కాలంలో.. ప్రారంభమైన ప్రత్యేకాధికారి పాలన
- మూడు కార్పొరేషన్‌లలో ప్రత్యేక కమిషనర్‌గా జయేష్ రంజన్
- జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా ఆర్‌వి కర్ణన్, సిఎంసి కమిషనర్‌గా సృజన, ఎంఎంసి కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగర పాలనలో ఒక నూతన శకం ప్రారంభమైంది. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగరాన్ని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి)ని మూడు కార్పొరేషన్‌లుగా విభజిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అధికార వికేంద్రీకరణ లక్ష్యాలతో ప్రభుత్వం జిహెచ్‌ఎంసిని మూడు వేర్వేరు మున్సిపల్ కార్పొరేషన్‌లుగా విభజిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి)గా నగర పాలన కొనసాగనుంది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన వెంటనే మూడు కార్పొరేషన్‌లలో ప్రత్యేక కమిషనర్‌గా తరువాయి 2లో

**జిహెచ్‌ఎంసి :** శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు ఈ కార్పొరేషన్ పరిధిలో ఉంటాయి. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం, శాసనసభ, శాసనమండలి, సచివాలయం, సిఎం నివాసం, ఎయిర్‌పోర్ట్ వంటి ప్రధాన పరిపాలన సాగే భవనాలు జిహెచ్‌ఎంసి పరిధిలోనే కొనసాగనున్నాయి. రాజధాని నగర పరిపాలన జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలోనే ఉంటుందని అధికారులు తెలిపారు.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్.. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. సైబర్ టవర్‌తో పాటు ఐటి కారిడార్ ప్రాంతాలు ఈ కార్పొరేషన్ పరిధిలో ఉండనున్నాయి.

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్.. మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్.బి.నగర్ జోన్లు మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో ఉంటాయి. ప్రముఖ శైవ క్షేత్రం కీసర పుణ్యక్షేత్రం ఈ కార్పొరేషన్ పరిధిలోకి వస్తోంది. అయితే మూడు కార్పొరేషన్‌ల చెత్త వ్యర్థాలను డంప్ చేసే జవహర్ నగర్ డంపింగ్ యార్డు మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోకి వస్తోంది.



## బ్యాలెట్ బాక్సుల్లో

# భవితవ్యం

- ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్
- పలుచోట్ల చెదురు మదురు ఘటనలు.. ఉమ్మడి మెదక్‌లో స్వల్ప ఘర్షణలు
- మున్సిపాలిటీల్లో 75.88, కార్పొరేషన్లలో 66.05శాతం ఓటింగ్
- కొడంగల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి, మధిరలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా పలు చోట్లు ఓటేసిన ప్రముఖ నేతలు
- కొత్తగూడెం కార్పొరేషన్‌లోని పలు డివిజన్లలో ఓటింగ్ సరళిని పరిశీలించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని






ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఓటర్లు తమ నిర్ణయాన్ని బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల భవితవ్యం ఈ నెల 13న తేలనుంది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 73.1శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపాల్టీల్లో 75.88శాతం, కార్పొరేషన్లలో 66.05శాతం ఓటింగ్ నమోదైంది. అక్కడక్కడా స్వల్ప ఉద్రిక్తతలు మినహా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. సాయంత్రం 5 గంటల వరకు క్యూలైన్‌లలో ఉన్న వారికి అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా సాగినట్లు అధికారులు తెలిపారు. మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణలు, నినాదాలు, దొంగ ఓట్ల యత్నాలు వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసులు వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి, పోలీసులు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నర్సాపూర్, రామాయంపేట ప్రాంతాల్లో బిఆర్‌ఎస్, బిజెపి, కాంగ్రెస్ తరువాయి 2లో

మున్సిపల్ ఎన్నికలలో
'హస్తం'దే హవా
పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్స్ అంచనా
మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్‌నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ గెలుపు? 03

## పది మంది ఐఎఎస్‌ల బదిలీ

- సింగరేణి సిఎండిగా జ్యోతి బుద్ధప్రకాశ్
- జలమండలి జెఎండిగా మయాంక్ మిట్టల్



బుద్ధప్రకాశ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పది మంది ఐఎఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌సి అభివృద్ధి శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్‌ను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సిసిఎల్ ) చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. పూర్తి అదనపు బాధ్యతల నుంచి డి. కృష్ణ భాస్కర్‌ను తప్పించారు. ఎస్‌సి అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సబ్యసాచి ఘోష్‌కు అదనపు బాధ్యతలను, అలాగే గిరిజన సంక్షేమ శాఖ బాధ్యతలను కూడా ఆయనకే అప్పగించారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న సందిప్ కుమార్ సుల్తానియాకు అదనంగా ప్రణాళిక శాఖ తరువాయి 2లో

## భారతమాతను

# మోదీ సర్కార్ అమ్మేసింది

### హోల్‌సేల్‌గా అమెరికాకు సరెండర్



- భారతదేశ ఇంధన భద్రతను అమెరికా చేతుల్లో పెట్టారు
- యుఎస్-భారత్ మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో దెబ్బతిననున్న రైతుల ప్రయోజనాలు
- ఇకపై భారత్ ఎవరి నుంచి చమురును కొనాలో అమెరికాయే చెబుతుంది
- లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ తీవ్ర మండిపాటు

**న్యూఢిల్లీ :** భారత్ – అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పదం ద్వారా భారతమాతను కేంద్ర ప్రభుత్వం అమ్మేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికా చేతుల్లో పెట్టి, రైతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి సర్కారు హోల్‌సేల్‌గా సరెండర్ అయిపోయిందని ఆయన ఆరోపించారు. బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. భారత్ –అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఏకపక్షంగా ఉందని, దీని వల్ల భారత రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు. ఈ ట్రేడ్ డీల్ అమల్లోకి వస్తే, భారత మార్కెట్‌లోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ప్రవాహం భారీగా పెరుగుతుందని రాహుల్ తెలిపారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ధాటికి భారత రైతులు విలవిలలాడాల్సిన దుస్థితి వస్తుందన్నారు. ఇక భారత దేశ వస్త్ర పరిశ్రమ పని అయిపోయినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికాతో ట్రేడ్ డీల్ ఫలితంగా ఇంధన భద్రతను భారత్ కోల్పోయిందన్నారు. ఇకపై భారత్ ఎవరి నుంచి చమురును కొనాలో అమెరికాయే చెబుతుందని రాహుల్ పేర్కొన్నారు. ట్రేడ్ డీల్‌పై చర్చల సందర్భంగా, భారత్‌ను సరిసమాన భాగస్వామిగా పరిగణించాలని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్‌ను కేంద్ర ప్రభుత్వం కోరి ఉండాల్సిందన్నారు. "మీ ప్రభుత్వం భారతదేశాన్ని అమ్మేసింది. దేశాన్ని అమ్ముతున్నందుకు సిగ్గుగా లేదా ? మీరు భారత మాతను అమ్మేశారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

**ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రభావం మోదీపై పడి ఉండొచ్చు: రాహుల్**

'అంత సాధారణంగా భారత్‌ను ప్రధాని మోదీ అమ్మేస్తారంటే నేను నమ్మను. బహుశా, ఆయనపై ఏదో బయటి ఒత్తిడి ప్రభావం పడి ఉండొచ్చు. ఎప్‌స్టీన్ ఫైల్స్ రిలీజ్ అయ్యాయని తెలిసినప్పటి నుంచి ప్రధాని మోదీ తరువాయి 2లో

# నేడే సార్వత్రిక సమ్మె

- దేశవ్యాప్త నిరసనలకు కార్మికులు, కర్షకులు సిద్ధం
- హక్కుల పరిరక్షణకు ఐక్యపోరు
- మద్దతిచ్చిన వామపక్షాలు, బ్యాంకు ఉద్యోగులు, ప్రజా సంఘాలు




**న్యూఢిల్లీ:** సార్వత్రిక సమ్మెకు సర్వం సిద్ధమైంది. పది కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 24 గంటల పాటు నిరసనలతో దేశం మార్మోగబోతోంది. ధర్నాలు, ప్రదర్శనలతో దేశవ్యాప్త సమ్మె పెద్దఎత్తున జరగబోతోంది. నాలుగు కార్మిక కోడ్‌లు, అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు పోరుబాట పట్టారు. ఐక్యంగా సమ్మెకు సమాయత్తమయ్యారు. పోరాడి సాధించుకున్న తమ హక్కులను కాలరాసేందుకు, వ్యవసాయ రంగానికి హాని కలించేందుకు తీసుకొచ్చే విధానాలను, చట్టాలను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ వాటి రద్దునకు సర్కారుపై ఒత్తిడి పెంచేందుకు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఏకపక్ష నిర్ణయాలతో సర్కారు దూకుడును అడ్డుకుంటామని ప్రకటించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో తరువాయి 12లో



## సర్కారు మెడలు వంచుదాం

### సార్వత్రిక సమ్మె జయప్రదం చేద్దాం: డి.రాజా పిలుపు

కార్మికులకు, రైతులకు, ఉద్యోగులకు వ్యతిరేకమైన విధానాలతో ముందుకెళుతున్న కేంద్ర ప్రభుత్వం మెడలు వంచేలా ఐక్యంగా పోరాటాలు అవసరమని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సూచించారు. చారిత్రక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కుల పరిరక్షణకు ఉక్కు సంకల్పంతో కదం తొక్కాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు, అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా ఈనెల 12న అనగా గురువారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దామంటూ డి.రాజా బుధవారం సామాజిక మాధ్యమం వేదికగా పిలుపునిచ్చారు. ఉద్దేశపూర్వకంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ తరువాయి 12లో

# భారత్@ 91

## దేశంలో ఏటేటా పెరుగుతున్న అవినీతి

### కరప్షన్ పర్సెప్షన్ ఇండెక్స్ –2025 నివేదిక వెల్లడి



**న్యూఢిల్లీ :** దేశంలో ప్రతి ఏటా అవినీతి పెరిగిపోతోంది. 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' అనే సంస్థ వెలువరించిన వార్షిక కరప్షన్ పర్సెప్షన్ ఇండెక్స్ (సీపీఐ)2025 నివేదికలో భారత్ 91వ స్థానంలో నిలిచింది. 182 దేశాలకు ప్రతీఏటా స్కోర్, ర్యాంకులను ఇస్తారు. 100 పాయింట్లకుగానూ ఇచ్చే ఈ స్కోరులో తక్కువ పాయింట్లు సాధించిన దేశాల్లో ఎక్కువ అవినీతి ఉన్నట్టు పరిగణిస్తారు. అలా తాజా నివేదికలో 100 పాయింట్లకు 39 స్కోరుతో భారత్ 91వ స్థానానికి పరిమితమైంది. కాగా , 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పుడు అవినీతి సూచీలో 85వ ర్యాంకులో ఉన్న భారత్ ఇప్పుడు 91వ ర్యాంకుకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.


# బంగ్లాదేశ్ దిశానిర్దేశ ఎన్నికలు నేడే

### 44 శాతం యువతరం ఓటింగే కీలకం



**ఢాకా:** బంగ్లాదేశ్‌కు దిశానిర్దేశం చేసే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతోపాటు రాజ్యాంగంలో మార్పులకు ఉద్దేశించిన "జులై ఛార్టర్"పై ప్రజాభిప్రాయ సేకరణ కూడా నిర్వహిస్తారు. ప్రజా ఓటు ద్వారా రాజ్యాంగంలో చేసే ఈ మార్పులు దేశ ప్రధానమంత్రి చెలాయించే అధికారాలపై పరిమితులు విధించనున్నాయి. అదేవిధంగా ప్రస్తుతం ఒక రబ్బరుస్టాంపుగా ఉన్న బంగ్లాదేశ్ అధ్యక్షుడికి కూడా రాబోయే రాజ్యాంగ మార్పుల ద్వారా కొత్త అధికారాలు దఖలు పడతాయి. పార్లమెంటు "జతియా సంసద్"లో ఉన్న 350 స్థానాలకుగాను నిర్ణీత ప్రకారం 300 నియోజకవర్గాలలో పోలింగ్ జరగాల్సి ఉంది. కానీ షెర్పూర్–3 నియోజకవర్గంలో జమాత్–ఏ–ఇస్లామ్ అభ్యర్థి మరణించడంతో అక్కడి పోలింగ్ వాయిదా వేయడంవల్ల 299 స్థానాలలో మాత్రమే పోలింగ్ జరుగుతుంది. మిగిలిన 50 స్థానాలను మహిళలకోసం రిజర్వు చేశారు. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు బుధవారం ఎన్నికల సామాగ్రిని తరలించేందుకు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు చేసింది.

42,779 కేంద్రాలలో ఉదయం 7.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా 12.77 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉండగా, వీరిలో 6.48 కోట్లమంది పురుషులు, 6.28 కోట్ల మంది స్త్రీలు ఉన్నారు. మత హింస ప్రజ్వరిల్లుతుందని మైనారిటీలు భయాందోళన చెందుతున్న తరుణంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎన్నికలు జరుగుతున్నాయి. షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూలదోసి చరిత్రాత్మకమైన హింసాత్మక తిరుగుబాటు తర్వాత మొదటిసారి అవామీలీగ్ పార్టీని ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించారు. 13వ పార్లమెంటుకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ తరువాయి 12లో



## ఇకపై స్కూళ్లలో

# వందేమాతరం తప్పనిసరి..

### జనగణమన కంటే ముందే పాడాలి.. కేంద్రం ఆదేశాలు

**న్యూఢిల్లీ :** జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించే విషయంలో కేంద్ర హోం శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించాలని అని ఆదేశించింది. జాతీయ గీతం 'జనగణమన' పాడటానికి ముందు తరువాయి 12లో



## కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోపై హత్యాయత్నం

**బోగోటా :** కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో (66)పై హత్యా ప్రయత్నం జరిగింది. తప్పించుకుని సురక్షితంగా తాను బయటపడ్డానని పెట్రో బుధవారం స్వయంగా ప్రకటించారు. 2022 ఆగస్టులో అధికారం చేపట్టినప్పటినుండీ మాదక ద్రవ్యాల ముఠాలు ఆయనను హత్య చేసేందుకు పథకం చేస్తున్నాయి. మంత్రివర్గ సమావేశంలో హత్యాయత్నం గురించి వివరిస్తూ ఆయన చేసిన ప్రసంగాన్ని లైవ్ టెలికాస్ట్ చేశారు. అజర్ న్యూస్ చెప్పిన ఈ సమాచారం ఫ్రాన్స్ పత్రికల ద్వారా ప్రపంచానికి తెలిసింది. కొద్దినెలల్లో కొలంబియాలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగనున్న తరుణంలో ఈ ఘటన జరిగింది. కొలంబియా సైనిక బలగాలకు గుస్తావో పెట్రో రాజ్యాంగబద్ధంగా కమాండర్ ఇన్ చీఫ్‌గా వ్యవరిస్తారు. 2022లో ఆయన అధ్యక్ష బాధ్యతలు తీసుకున్నారు. ఈ ఏడాది మే 31వ తేదీన మళ్ళీ అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. 2016లో శాంతి ఒప్పందం ప్రకారం ఫార్క్ గెరిల్లా ఆర్మీ ఆయుధాలు వదిలిపెడతానని అంగీకరించింది. ఫార్క్‌తోపాటు ఇవాన్ మోర్డిస్క్ వంటి వార్‌లార్డ్స్, మాదక ద్రవ్యాల ముఠాలు ఆయనను హత్య చేసేందుకు కాచుకుని ఉన్నాయి. కొలంబియాలో అనేక సంవత్సరాలుగా ఎంతోమంది వామపక్ష, కమ్యూనిస్టు నాయకులు, అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు సన్నద్ధులైన వామపక్ష నాయకులు ఈ విధంగానే హత్యలకు గురయ్యారు. ఇంతకుముందు 2024లో కూడా ఆయనపై హత్యా ప్రయత్నం జరిగింది. దక్షిణ అమెరికా కొలంబియాలో మొట్టమొదటి వామపక్ష దేశాధ్యక్షుడు గుస్తావో పెట్రో.

హెలికాప్టర్‌లో ప్రయాణం చేస్తూ ఒకచోట దిగేందుకు ప్రయత్నం చేశారు. కానీ ఆయన హెలికాప్టర్ దిగిన వెంటనే కాల్పులు జరిపి హతమార్చేందుకు కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సిద్ధంగా కాచుక్కూర్చున్నారన్న సమాచారంతో ఆకాశంలోనే ఆయన హెలికాప్టర్ పలు గంటలు చక్కెర్లు కొట్టింది. నాలుగు గంటలపాటు తన కుటుంబ సభ్యులతో కలిసి హెలికాప్టర్‌లోనే ఉండిపోయానని, సముద్రంపైనే తన హెలికాప్టర్ చక్కెర్లు కొట్టిందని, ఈ కారణంగా తాను కరీబియన్ తీరంలో నిర్ణీత సమయానికి నేలమీదకు దిగలేకపోయాయని గుస్తావో పెట్రో చెప్పారు.

ఆయన విమానంలో ఉండగా ఈ ప్రయత్నం జరిగింది. కొలంబియా మాదక ద్రవ్యాల రవాణాకు అతిపెద్ద కేంద్రంగా ఉందని, ఈ వ్యవహారాల్లో ఆయనే ప్రధాన నిందితుడుగా ఉన్నాడని అమెరికా ప్రభుత్వం ఏడాదికాలంగా ఆయనకు బెదిరింపులు చేస్తోంది. వెనిజులా అధ్యక్ష దంపతుల కిడ్నాప్ తర్వాత నుండి తమ తదుపరి లక్ష్యం కొలంబియా,క్యూబాలేనని ట్రంప్ చెబుతూ వచ్చారు.

# ఇరాన్ ప్రజలకు మసౌద్ క్షమాపణ



ఆర్థిక సమస్యలు పరిష్కరిస్తామని దేశాధ్యక్షుడు హామీ
భారీ జన సమక్షంలో 47వ ఇస్లామిక్ విప్లవ వేడుకలు

**టెహ్రాన్ :** ఇరాన్ ప్రజలకు ఆ దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ క్షమాపణలు చెప్పారు. కరెన్సీ విలువ దిగజారకుండా తాము కాపాడలేకపోయామన్నారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరిస్తుందని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఆర్థిక సమస్యలు పరిష్కరించడానికి అవసరమైన వనరులను సమీకరిస్తామని, ప్రజల జీవనాధారాన్ని, ఉపాధి అవకాశాలను మెరుగు పచడమే తమ పాలనాయంత్రాంగం ప్రధాన ప్రాధాన్యతాంశంగా తీసుకుని పనిచేస్తుందని ప్రకటించారు. ఇరాన్‌లో ఇస్లామిక్ రివల్యూషన్ విజయం సాధించి 47 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరిగిన వార్షికోత్సవ వేడుకలకు రాజధాని టెహ్రాన్‌లోని ఆజాదీ స్క్వేర్ వద్ద బుధవారం ఉదయం వేలాదిమంది హాజరైన సభలో పెజెష్కియన్ ప్రసంగించారు. ఇరాన్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుంటుందని ప్రకటించారు. ప్రజలకు క్షమాపణ చెప్పారు. గత ఏడాది డిసెంబరు 28 నుండి 18 రోజులపాటు చరిత్రలో లేనివిధంగా దేశంలో కొనసాగిన హింసాత్మక ప్రజా తిరుగుబాటు, ప్రభుత్వ అణచివేత, ఊచకోతల తర్వాత క్రమంగా పరిస్థితులు చక్కబడిన నేపథ్యంలో ఎంతో విజయవంతంగా ఇస్లామిక్ రివల్యూషన్ వార్షికోత్సవ వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఇరాన్ అధికార పత్రిక ఈ వార్త ప్రచురించింది. వేలాదిమంది ప్రజలు ప్రదర్శనలు చేస్తూ ఆజాదీ స్క్వేర్ వద్దకు చేరుకుని బహిరంగసభలో పాల్గొన్నారు. ఇరాన్ దేశాన్ని, ఇస్లామిక్ విప్లవాన్నీ కాపాడుకోవడంకోసం వేలాదిమంది ప్రజలు ఈ విధంగా వీధుల్లోకి తరలిరావడం యావత్ ప్రపంచం ఈనాడు తమ కళ్ళతో తప్పక చూడాలని పెజెష్కియన్ ఈ సందర్భంగా అన్నారు. ఇరాన్ ప్రజలు ఇస్లామిక్ విప్లవాన్ని కాపాడుకోవడానికి, తమ నాయకత్వాన్ని సమర్థించడానికి, వారి విలువలను, గర్వించదగిన భూమిని సంరక్షించుకోవడానికి ప్రజలు లక్షలాదిగా ఈ ప్రాంతానికి తరలి వచ్చిన విషయాన్ని యావత్ ప్రపంచం చూడాలని ఆయన అన్నారు. 1979 నాటి తిరుగుబాటు న్యాయాన్ని స్థాపించి స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడమేనన్నారు. ఇరానియన్లు, ముస్లింలు తమ సొంత బలం, జ్ఞానం, సంస్కృతి, కళలద్వారా దేశాన్ని నిర్మించుకుని, గౌరవం, స్వేచ్ఛను తిరిగి తీసుకురాగలమని నిరూపించడమే దేశం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇస్లామిక్ విప్లవం ప్రారంభమైనప్పటినుండీ దేశంలో విభజన తీసుకువచ్చి కుట్రలు పన్ని దేశాన్ని నాశనం చేయాలని శత్రువులు ప్రయత్నం చేస్తూ వచ్చారన్నారు. ఇస్లామిక్ విప్లవాన్ని తమ ఎదురుగా మోకాళ్ళమీద కూర్చోబెట్టడానికి అమెరికా, యూరప్ దేశాలు చేయవలసిన కుట్రలు, ప్రయత్నాలు అన్నీ చేశాయని, దేశాన్ని ఎనిమిది సంవత్సరాలపాటు యుద్ధం ఊబిలోకి దింపాయని, దేశాన్ని విభజించి ఆక్రమించే ప్రయత్నాల్లో భాగంగా ఇరాక్‌లో సద్దాం హుస్సేన్‌కు మద్దతు ఇచ్చాయని పెజెష్కియన్ విమర్శించారు. కానీ ఇరాన్ దేశ యువకులు మరోవైపు చూపించిన ధైర్యసాహసాల ముందు ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయన్నారు. ఈ వేదికపైనుండే ఇరాన్ కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమర వీరులకు ఆయన నివాళులు అర్పించారు. మేజర్ జనరల్ మహ్మద్ బఘేరీ, మేజర్ జనరల్ హుస్సేన్ సలామీ దగ్గర నుండి క్వాస్సెమ్ సోలైమనీ వరకూ అనేకమంది అమరవీరులకు ఆయన నివాళులు అర్పించారు. ఈ అమరవీరులంతా దేశం నుండి సంపదను కోరుకోలేదని, అధికారాన్ని కోరుకోలేదని, దేశంకోసం, ఇస్లామిక్ విప్లవం కోసం వారు తమ ప్రాణాలు త్యాగం చేశారన్నారు.

మరోవైపు పాశ్చాత్య పత్రికల కథనాలు భిన్నంగా ఉన్నాయి. ఇరాన్‌లో 47వ విప్లవ వార్షికోత్సవాల సందర్భంగా ముందురోజు మంగళవారం రాత్రి ప్రజలు వీధుల్లోకి వచ్చి ఖమేనీని ఉరితీయాలంటూ నినాదాలు చేశారని వార్తలు ప్రచురించాయి. మసీదుల వద్ద ఖమేనీ వ్యతిరేకులు గుమిగూడి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. జెండాలు ఊపుతూ ఖమేని వైదొలగాలని కోరారు.





## కెనడా స్కూలులో కాల్పులు 10 మంది మృతి

భారత్, బ్రిటన్ ప్రధానమంత్రుల సంతాపం

**వాంకోవర్:** పశ్చిమ కెనడాలోని గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరపడంతో పిల్లలు సహా 10మంది మరణించారు. మరో 25మంది గాయపడ్డారు. గుర్తు తెలియని ఒక మహిళ మృతదేహాన్ని కాల్పులకు పాల్పడిన వ్యక్తిగా భావిస్తున్నారు. తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అంచనావేశారు. సమీపంలోనే ఒక ఇంటిలో మరో ఇద్దరు మరణించి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. రాయల్ కెనడియన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి గాలింపు చేపట్టారు. కెనడా ప్రధానమంత్రి కార్నీ తీవ్ర దిగ్భ్రాంతి ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడినవారు ప్రమాదకరస్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కెనడాలో పాఠశాలపై కాల్పులు జరపడం చాలా అరుదైన ఘటన కావడంతో దేశవ్యాప్తంగాతీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. కాల్పులకు పాల్పడిన వ్యక్తి మరణించినప్పటికీ ఆ వివరాలు తెలియరాలేదు. ఉత్తర వాంకోవర్‌కు 1000కి.మీ దూరంలో ఉన్న టంబ్లెర్ రిడ్జ్ పట్టణంలోని సెకండరీ స్కూలులో ఈ ఘటన జరిగింది. ఈ స్కూలులో ఘటనా సమయంలో 175మంది విద్యార్థులు ఉన్నారు. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారని బ్రిటిష్ కొలంబియా ప్రీమియర్ డేవిడ్ ఎబై విలేకరులకు చెప్పారు. కాల్పులకు పాల్పడిన మరణించిన మహిళా షూటర్ పేరును పోలీసులు వెల్లడించలేదు. కెనడాలో గన్ చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. అక్కడ తుపాకులు వాడరు. ఇలాంటి ఘటనలు చాలా అరుదుగా ఉంటాయి. కెనడాలోని ఒక స్కూలులో జరిగిన కాల్పుల్లో పదిమంది విద్యార్థులు, ఇతరులు మరణించిన ఘటనపట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర సంతాపం ప్రకటించారు. ఈ మేరకు కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీకి తన సంతాప సందేశం పంపించారు.బ్రిటిష్ కొలంబియాలోని టంబ్లర్ రిడ్జ్ టౌన్‌లో ఈ కాల్పుల ఘటన సంభవించింది. గాయపడినవారంతా త్వరగా కోలుకోవాలని ఆయన ప్రార్థించారు. ఈ ఘటన విన్న వెంటనే తాను దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. అదేవిధంగా బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్‌మర్ కూడా ఈ ఘటనపట్ల తీవ్ర సంతాపం ప్రకటించారు.

## 17న మేక్రాన్ భారత్ పర్యటన

'ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్' ప్రారంభం



**పారిస్:** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ నెల 17వ తేదీ నుండి మూడు రోజులు భారత్‌లో పర్యటిస్తారు. కృత్రిమ మేధపై జరిగే అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటారు. ఆయన పర్యటన సమయంలోనే రాఫెల్ యుద్ధ విమానాల సరఫరాకు సంబంధించి అతిపెద్ద ఒప్పందం కూడా బహుశా ఆయన సమక్షంలోనే జరిగే అవకాశాలున్నాయి. భారత్‌కు మరోవిడత అత్యంత శక్తిమంతమైన రాఫెల్ విమానాలను సరఫరా చేసేందుకు రూ.3.25 లక్షలకోట్లు విలువైన అతిపెద్ద ఒప్పందం ఖరారు కానున్నది. ఈ పర్యటనలో మేక్రాన్ భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. 17వ తేదీన నేరుగా ఆయన ముంబైకి చేరుకుంటారు. పర్యాటక–సాంస్కృతిక రంగాలతో సహా వివిధ విభాగాలలో భారత్–ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక సహకారం పెంపొందించేందుకు 2026వ సంవత్సరాన్ని ''భారత్–ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్''గా ప్రకటించారు. ముంబైలోనే మోదీతో కలిసి మేక్రాన్ ఈ ఇయర్ ఆఫ్ ఇన్నొవేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అక్కడే ద్వైపాక్షిక సమావేశం నిర్వహిస్తారు. ఇండో–పసిఫిక్ సహకారం, ప్రాంతీయ అంతర్జాతీయ సమస్యలు సహా రెండు దేశాలకు ప్రయోజనం కలిగించే అనేక అంశాలపై వారు చర్చలు జరుపుతారు. తర్వాత 19వ తేదీన ఢిల్లీలో జరిగే అంతర్జాతీయస్థాయి ''ఎ.ఐ ఇంపాక్ట్ సమ్మిట్''లో పాల్గొంటారు.

## ఐఏఎస్‌ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతలను అప్పగించారు. కాగా జిహెచ్‌ఎంసి ని మూడు కార్పొరేషన్లను విభజించిన నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లకు ప్రత్యేక కమిషనర్‌గా జయేశ్ రంజన్‌ను ప్రభుత్వం నియమించింది.

**బదిలీ అయిన ఐఏఎస్ అధికారులు వీరే:** సింగరేణి సిఎండిగా జ్యోతి బుద్ధ ప్రకాశ్, ఎస్‌సి అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్‌కు అదనపు బాధ్యతలు, సెర్ప్ సిఇఒగా ఉన్న దివ్యకు పంచాయతీరాజ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. సెర్ప్ అడిషనల్ సిఇఒగా కాత్యాయని ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా నియమించారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ జెఎండిగా కాత్యాయనీ దేవికి అదనపు బాధ్యతలు, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, మంత్రి శ్రీధర్‌బాబుకు ఓఎస్‌డిగా అదనపు బాధ్యతలను రఘురామ్‌కు అప్పగించారు. జలమండలి జెఎండిగా మయాంక్ మిట్టల్‌ను ప్రభుత్వం నియమించింది.

## 3 కార్పొరేషన్‌లు

(మొదటి పేజీ తరువాయి)

జయేష్ రంజన్ బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంట వెంటనే ముగ్గురు కమిషనర్లు ఆర్.వి.కర్ణన్ (జిహెచ్‌ఎంసి), సృజన (సిఎంసి), వినయ్ కృష్ణారెడ్డి (ఎంఎంసి) కమిషనర్లుగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అలాగే బదిలీ అయిన ఇతర అధికారులు సైతం బాధ్యతలు స్వీకరించారు. దీంతో మూడు కార్పొరేషన్‌లలో ఏక కాలంలో ప్రత్యేకాధికారి పాలన ప్రారంభమైంది. సుదీర్ఘకాలం అనంతరం జిహెచ్‌ఎంసి పరిధిలో ప్రత్యేకాధికారి పాలన మొదలైంది.

**300 డివిజన్లు, 60 సర్కిళ్లు, 12 జోన్లు**

ఇప్పటివరకు 150 డివిజన్‌లతో ఉన్న జిహెచ్‌ఎంసి పరిధి వార్డుల పునర్విభజన ప్రక్రియ అనంతరం 243 డివిజన్‌లకు పెరిగింది. విలీన మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలో 57 కొత్త డివిజన్లు ఏర్పాటవడంతో మొత్తం డివిజన్‌ల సంఖ్య 300కు చేరింది. నగర పాలనను 12 జోన్లు, 60 సర్కిళ్లుగా పునర్వ్యవస్థీకరించారు. జిహెచ్‌ఎంసి చట్టం1955 సెక్షన్ 3(1) ప్రకారం ప్రభుత్వం ఈ విభజన చేపట్టింది. మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ జారీ చేసిన జిఓ ఎంఎస్. నెంబర్ 55 ద్వారా పునర్వ్యవస్థీకరణకు చట్టబద్ధత కల్పించారు. విభజన అనంతరం జిహెచ్‌ఎంసి150, సైబరాబాద్ 76, మల్కాజిగిరి 74 కార్పొరేటర్ వార్డులుగా ఏర్పాటు చేశారు.

**కమిషనర్ల నియామకం**

మూడు కార్పొరేషన్లకు ప్రభుత్వం కమిషనర్లను నియమించింది. అలాగే మూడు కార్పొరేషన్‌లకు ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారిగా జయేష్ రంజన్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సాధారణంగా ఒక్కో కార్పొరేషన్‌కు ఒక్కో ప్రత్యేకాధికారి ఉంటారు. ప్రస్తుతం మూడు కార్పొరేషన్‌లకు ఒకరినే ప్రత్యేక అధికారిగా నియామకం జరపడం గమనార్హం.

**విభజన నేపథ్యం..**

ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని సుమారు 2,060 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టిసియుఆర్/ సియుఆర్ఇ)గా ప్రభుత్వం ప్రకటించింది. 2025లో సమీప మున్సిపాలిటీలు, గ్రామాలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేయడంతో నగర పరిధి విస్తరించింది. పాలక మండళ్ల గడువు ముగియడంతో పాటు పెరిగిన విస్తీర్ణానికి అనుగుణంగా పరిపాలనను వికేంద్రీకరించాలనే ఉద్దేశంతో ఈ పునర్వ్యవస్థీకరణ చేపట్టారు.

**లక్ష్యం వేగవంతమైన పౌర సేవలు**

పెరుగుతున్న జనాభా, విస్తరించిన నగర పరిమాణం నేపథ్యంలో స్థానిక సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడం, బాధ్యతాయుతమైన పరిపాలన అందించడం ఈ విభజన ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది. నూతన కార్పొరేషన్లు వేర్వేరు చట్టబద్ధ సంస్థలుగా పని చేయనున్నాయి. ఎన్నికల అనంతరం ప్రతి కార్పొరేషన్‌కు మేయర్, డిప్యూటీ మేయర్‌లతో కొత్త పాలక వర్గాలు ఏర్పాటు కానున్నాయి. ఇకపై గ్రేటర్ హైదరాబాద్ నగర పాలన మూడు కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో వికేంద్రీకృత వ్యవస్థలో కొనసాగ నుంది.





## పాల్వంచలో ఉద్రిక్తత

### పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన సిపిఐ శ్రేణులు

**ప్రజాపక్షం/ఖమ్మం:** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పాల్వంచలో బుధవారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పాల్వంచ సిఐ సతీష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో సిపిఐ శ్రేణులు నిరసనకు దిగాయి. పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేపట్టాయి. వివరాల్లోకి వెళితే... కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచలో ఓ మహిళను దొంగ ఓటు ఆరోపణతో పోలీసులు స్టేషన్‌కు తరలించారు. గంటల తరబడి నిర్బంధించి ఆమెను వదలకపోవడంతో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా సమాచారం తెలుసుకుని అక్కడకు వెళ్లి మహిళను విడుదల చేయాలని కోరారు. ఆ సమయంలో సిఐ సతీష్ సాబీర్‌పాషా పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీనితో సిపిఐ శ్రేణులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యాయి. స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసుల ప్రవర్తనను నిలదీశారు. అధికార పార్టీ చెబితే ఇష్టానుసారంగా వ్యవహరిస్తారా అని ఆయన ప్రశ్నించారు. సిపిఐ శ్రేణులతో పాటు కూనంనేని పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు తమ వైఖరిని మార్చుకోవాలని అధికార పార్టీ చెప్పింది చేస్తూ ఇతర పార్టీలకు చెందిన వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తారా అని ఆయన నిలదీశారు. సిఐ క్షమాపణ చెప్పేంత వరకు ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు.

## శిక్షణ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

**ముంబై:** సాంకేతిక సమస్యతో ప్రైవేట్ సంస్థకు చెందిన హెలికాప్టర్ పాల్ఘర్ జిల్లాలోని ఓ ప్రైవేట్ స్కూల్ మైదానంలో అత్యవసర ల్యాండింగ్ అయిం ది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాంకేతిక కారణాలతో మహారాష్ట్ర పాల్ఘర్ జిల్లాలోని ఓ ప్రైవేట్ స్కూల్ మైదానంలో శిక్షణకోసం ఉపయోగించే హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్ అయింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు బుధవారం తెలిపారు. ప్రైవేట్ సంస్థకు చెందిన హెలికాప్ట ర్ ముంబైలోని జుహు నుంచి గుజరాత్ రాష్ట్రం సూరత్ వెళ్తుండగా సాంకేతిక సమస్య వచ్చినట్లు అధికారులు తెలిపారు. హెలికాప్టర్‌లో ప్రధాన పైలెట్‌తో పాటు శిక్షణ పైలెట్, టెక్నికల్ ఇంజినీర్, మరొకరు ఉన్నారన్నారు.

## భవితవ్యం

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణలు జరిగినట్లు సమాచారం.

**మందకొడిగా మొదలై పుంజుకున్న పోలింగ్..**

అయితే ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత పుంజుకుంది. పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 60 శాతానికి మించి పోలింగ్ నమోదైనట్లు అధికారులు అంచనావేస్తున్నారు. పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,031 బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేశారు. 8,191 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. బ్యాలెట్ బాక్సుల భద్రపరిచేందుకు 137 స్ట్రాంగ్ రూమ్‌లు సిద్ధం చేశారు. మున్సిపాల్టీలలో 2,582 వార్డులకు కౌన్సిలర్‌ల ఎన్నిక జరిగింది. తొమ్మిది పురపాలికల్లో 12 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మొత్తం 10,719 మంది అభ్యర్థులు మున్సిపాల్టీలలో పోటీలో నిలిచారు. కార్పొరేషన్‌లలో 412 డివిజన్లకు ఎన్నికలు జరగగా, 2,225 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 52 లక్షల 17 వేల 413 మంది ఓటర్లు ఉన్నారు. 60 శాతానికి పైగా పోలింగ్ నమోదైనట్లు అంచనగా ఉంది. మక్తల్ మున్సిపాల్టీలోని 6వ వార్డులో బిజెపి అభ్యర్థి మహదేవప్ప బలవన్మరణానికి పాల్పడటంతో అక్కడ ఎన్నిక నిర్వహించలేదు. ఈ నెల 13న ఉదయం 8 గంటలకు 136 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఫలితాలు వెల్లడైన అనంతరం ఈ నెల 16న మున్సిపాల్టీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆరు రోజులపాటు సాగిన ప్రచారంలో ప్రధాన రాజకీయ పార్టీలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి.

**సిఎం సహా ఓటేసిన ప్రముఖులు**

తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గం కొడంగల్‌లోని జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. ఖమ్మం జిల్లా మధిరలోని 9వ వార్డులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఓటు హక్కు వినియోగించుకున్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటిలోని 3వ వార్డులోని నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో కుటుంబ సమేతంగా మంత్రి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సూర్యాపేటలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఓటు వేశారు. బిఆర్‌ఎస్ నాయకులతో కలిసి పోలింగ్ కేంద్రంలో ఫోటో దిగారు. నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన ఓటు వేశారు. నిజామాబాద్‌లో పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ 50వ డివిజన్ జ్యోతినగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట 9వ వార్డులో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఓటు వేశారు. జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నందికొండ మున్సిపాలిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల 5 వార్డులో మాజీ మంత్రి జానారెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు వేశారు. నల్లగొండ ఎంపి రఘువీర్ రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ఉన్నారు.

## మోదీ సర్కార్ అమ్మేసింది

(మొదటి పేజీ తరువాయి)

కళ్లలో భయం స్పష్టంగా కనిపిస్తోంది. వాటితో ముడిపడిన ఒత్తిడి ప్రభావం ప్రధానిపై పడిందేమో. వాళ్లు ప్రధాని మోదీని ఉక్కిరిబిక్కిరి చేసి ఉండొచ్చు. బెదిరించి ఉండొచ్చు. ఇంకో 30 లక్షలకుపైగా ఎప్‌స్టీన్ ఫైల్స్ తదుపరి విడతల్లో రిలీజ్ కావాల్సి ఉంది. గతంలో భారత వస్తు, ఉత్పత్తులపై అమెరికా 3 శాతం సుంకాన్నే విధించేది. కానీ ఇక నుంచి ఆరు రెట్లు అదనంగా 18 శాతం సుంకాన్ని విధిస్తుందట. ఇక ఇదే సమయంలో అమెరికా సరుకులపై భారత్ విధించే 16 శాతం సుంకాన్ని, సున్నాకు తగ్గిస్తారట. ఎందుకోసం ప్రధాని మోదీ ఇలాంటివన్నీ ఒప్పుకున్నారు? ప్రస్తుతం అమెరికా నుంచి భారత్ ఏటా 46 బిలియన్ డాలర్ల విలువైన వస్తు, ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోంది. దీన్ని ఏకంగా 100 బిలియన్ డాలర్లు దాటిస్తామని ట్రంప్‌కు మోదీ ఎందుకు హామీ ఇచ్చారు?' అని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు.

**మోదీ, దోవల్ చెప్పిన దానికి రివర్స్‌లో ప్రపంచం పోక డ**

''ప్రపంచంలో ఇక యుద్ధాల శకం ముగిసిందని గతంలో ప్రధాని మోదీ, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఎ) అజిత్ దోవల్ చెప్పారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్‌ను గత సంవత్సరమే మనం చూశాం. రష్యా ఉక్రెయిన్ యుద్ధం గత మూడేళ్లుగా జరుగుతోంది. ఇజ్రాయెల్ గాజా సైనిక ఘర్షణను యావత్ ప్రపంచం చూసింది. ఇరాన్ లక్ష్యంగా అమెరికా కుట్రలను ఇప్పుడు చూస్తున్నాం. ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలుచుకొని ప్రపంచ దేశాలపై అమెరికా ఒత్తిడిని పెంచుతోంది. అమెరికా ఆధిపత్యాన్ని, దాని డాలరు పెత్తనాన్ని చైనా, రష్యా లాంటి దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. అంటే మనం ఏకధ్రువ ప్రపంచం నుంచి బహుళ ధ్రువ ప్రపంచం దిశగా పయనిస్తున్నాం' అని రాహుల్ గాంధీ తెలిపారు.

**అమెరికా ఆధిపత్యాన్ని, డాలరు పెత్తనాన్ని సవాల్ చేయాలి**

'భారత ప్రభుత్వ తాజా ఆర్థిక సర్వే నివేదికలో రెండు ముఖ్యమైన పాయింట్లను ప్రస్తావించారు. అవి నాకు నచ్చాయి. ప్రపంచ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని, అమెరికా ఆధిపత్యాన్ని చైనా, రష్యా లాంటి దేశాలు సవాల్ చేస్తున్నాయి అనేది తొలి పాయింట్. ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలిచి దేశాలపై దాడి చేసే పరిస్థితులు ప్రపంచంలో ఏర్పడుతున్నాయి అనేది రెండో పాయింట్. అందుకే అమెరికా ఆధిపత్యాన్ని, డాలరు పెత్తనాన్ని మనం సవాల్ చేయాలి. సింగిల్ సూపర్ పవర్ కాన్సెప్ట్‌ను ఒప్పుకోకూడదు. కానీ ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలిచి భారత్‌పైకి ప్రయోగించే అవకాశాన్ని అమెరికాకు మోదీ సర్కారు ఇచ్చింది. భారత్ ఎవరి నుంచి ముడి చమురును కొనాలి అనేది, మరో దేశం(అమెరికా) వాళ్లు నిర్ణయించాలా? భారత ప్రయోజనాలను దెబ్బతీసే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నందుకు సిగ్గుగా లేదా?' అని రాహుల్ గాంధీ మండిపడ్డారు.

**అనిల్ అంబానీని ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసింది ఎవరు ?**

'జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ పేరు కూడా వచ్చింది. ఇప్పటిదాకా ఆయన్ను ఎందుకు జైలులో పెట్టలేదు? అనిల్ అంబానీని జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసింది ఎవరు? దీనికి కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి సమాధానం చెప్పాలి. ఎప్‌స్టీన్‌కు అనిల్ అంబానీని ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు. ఈ విషయం హర్దీప్ సింగ్ పురికి కూడా తెలు సు. భారతదేశ రక్షణ రంగ బడ్జెట్‌లో కేంద్ర బిందువుగా అదానీ కంపెనీ ఉంది. ఆ కంపెనీ చెప్పినట్టుగానే రక్షణ రంగ బడ్జెట్‌ను కూర్చారు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**డిజిటల్ ట్రేడ్ రూల్స్‌నూ ఫణంగా పెట్టారు**

''భారత్‌ను పాకిస్థాన్‌తో అమెరికా పోల్చి చూడటానికి వీల్లేదు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ తనతో బ్రేక్ ఫాస్ట్ చేయాలని అమెరికా ప్రెసిడెంట్ కోరుకుంటే, అది జరిగిపోయింది. కానీ భారత్ విషయంలో అలా జరగలేదు. మేం మరోలా జవాబు ఇచ్చాం. కానీ ఇప్పుడు అదే అమెరికాతో అన్యాయమైన ట్రేడ్ డీల్‌ను మోదీ ప్రభుత్వం కుదుర్చుకుంది. చివరకు డిజిటల్ ట్రేడ్ రూల్స్‌నూ అమెరికా కోసం ఫణంగా పెట్టేందుకు కేంద్ర సర్కారు రెడీ అయిపోయింది. అమెరికా కంపెనీలు భారత్‌లో డేటా లోకలైజేషన్ చేయాల్సిన అవసరం లేని రూల్‌ను తెచ్చేందుకు ఓకే చెప్పారు. భారత్ నుంచి అమెరికాకు పూర్తి ఉచితంగా డేటా బదిలీకి అనుమతులు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారు.

అమెరికా కంపెనీలపై విధించే డిజిటల్ ట్యాక్స్‌నూ తగ్గించేందుకు అంగీకరించారు. అమెరికా డిజిటల్ కంపెనీలు ఇకపై సోర్స్ కోడ్‌ను భారత సర్కారుకు బహిర్గతపర్చాల్సిన అవసరం లేని రూల్‌ను తెచ్చేందుకూ కేంద్ర ప్రభుత్వం రెడీ అయింది. ఆర్థిక మంత్రి నిర్మల బాగా నవ్వుతున్నారు. ఆమెకు నవ్వడం అంటే ఇష్టం. అమెరికా ప్రభుత్వం సూచించే కంపెనీలకు 20 ఏళ్ల ట్యాక్స్ హాలిడేను ఇచ్చేందుకూ కేంద్రం ఒప్పుకుంది'' అని రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడింది : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అనేక అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడిందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఆరోపించారు. అధికార పక్షం ఎన్నికల్లో ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ప్రలోభాలకు గురిచేసినా మొక్కవోని దీక్షతో వీరోచితంగా పోరాడిన బిఆర్ఎస్ కార్యకర్తలకు పేరుపేరునా హృదయపూర్వక అభినందనలన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకు పురపాలక సమరంలో గులాబీ సైనికులు కనబరిచిన పోరాట స్ఫూర్తి పార్టీకి కొండంత బలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని ఆయన కొనియాడారు. గత రెండేళ్ల పాలనలో ఘోరమైన వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో దౌర్జన్యకాండకు దిగారని కేటీఆర్ విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో ఎదురైన పరాభవం పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే రేవంత్ రెడ్డి అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మండిపడ్డారు. పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపులకు, దాడులకు ముఖ్యమంత్రి త్వరలోనే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల తరుపున బిఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని కెటిఆర్ స్పష్టం చేశారు.

## అధికార పార్టీ అడుగడుగునా అధికార దుర్వినియోగం : హరీష్ రావు

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** ముఖ్యమంత్రి మొదలుకొని మంత్రులు, ఎంఎల్ఎలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడ్డారని మాజీ మంత్రి టి.హరీష్ రావు ఆరోపించారు. నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను బెదిరించడమే గాక, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హీనమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని హరీష్‌రావు పేర్కొన్నారు. చట్టాన్ని సైతం లెక్కచేయకుండా.అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని, ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనన్నారు.కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని ఆయన ధీమా వ్యక్తంచేశారు. అధికార పార్టీ ఆకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇన్‌చార్జ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. బిఆర్ఎస్‌పై విశ్వాసంతో తమ అమూల్యమైన ఓటు వేసిన ప్రతి ఓటరుకు హృదయ పూర్వక ధన్యవాదాలన్నారు.

# సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త పిలుపుతో గురువారం చేపట్టిన సార్వత్రిక సమ్మెకు కార్మిక, కర్షక, ఉద్యోగ వర్గాలు సన్నద్ధమయ్యాయి. కేంద్రం వ్యవహరిస్తున్న తీరుపైన తమ నిరసన గళాన్ని వినిపించేందుకు రాష్ట్రంలోని అన్ని వర్గాలూ సమ్మెలో పాల్గొననున్నాయి. సార్వత్రిక సమ్మెలో భాగంగా భారీ ప్రదర్శనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సమ్మెలో భాగంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆర్‌టిసి కల్యాణ మండపం నుంచి ఇందిరాపార్క్ వరకు భారీ ప్రదర్శన, బహిరంగ సభను నిర్వహించనున్నారు. అలాగే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద ప్రదర్శన చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారు. కేంద్ర కార్మిక సంఘాలకు మద్దతుగా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉద్యోగ ,రైతు, మహిళా, జర్నలిస్టులు, విద్యార్థి, యువజన, వివిధ ప్రజా సంఘాలు సార్వత్రిక సమ్మెకు సంఘీభావం వ్యక్తం చేశాయి. బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన కార్మిక సంఘాలు కూడా సమ్మెకు మద్దతునిచ్చాయి. అనేక పోరాటాల ఫలితంగా సాధించిన కార్మిక చట్టాలను, హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని, కనీస వేతనాల పెంపు, ప్రైవేటీకరణను ఆపివేయాలని, కాంట్రాక్ట్ విధానాల రద్దు చేయాలని, వ్యవసాయ నల్ల చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని, విత్తన , విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని, కనీస మద్దతు ధర చట్టాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఆయా సంఘాల నాయకులు నిరసన గళాన్ని వినిపించనున్నారు.

**కూనంనేని సాంబశివ రావు...**

కేంద్ర కార్మిక సంఘాల పిలుపునిచ్చిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె'కు సిపిఐ సంపూర్ణ మద్దతునిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. గురువారం తలపెట్టిన సమ్మెకు మద్దతుగా రాష్ట్ర వ్యాపితంగా ఊరేగింపులు, ప్రదర్శనలలో సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని, సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. .

ఈ అంశాలన్నింటిపైనా తలపెట్టిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెకు ప్రజలందరూ మద్దతు తెలిపి, జయప్రదం చేయాలని కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

**మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ సమ్మెను విజయంతం చేయాలి : బైరగోని రాజు గౌడ్**



కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల జీవన ఉపాధిని దెబ్బతీస్తుందని, ప్రధానంగా ఓలా ఊబర్ లాంటి కార్పొరేట్ కంపెనీలు విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతున్న వారిపై చెర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనతవైఖరితో హైదరాబాద్ మహానగరంలో కార్పొరేట్ కంపెనీలు క్యాబ్ డ్రైవర్ల పొట్టకొడుతున్నాయని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైటెక్ సిటీ ఐటీ క్యాడర్‌లో వెండర్లు, సబ్ వెండర్లు దోచుకుంటున్నారని, డ్రైవర్లు 10 లక్షలు పెట్టి కార్‌ను కొనుగోలు చేస్తే, గిట్టుబాటు ధర లేదని, ఇఎంఐలను కూడా కట్టే పరిస్థితి లేదన్నారు.

**సార్వత్రిక సమ్మెలో మహిళలు జయప్రదం చేయాలి**



బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కార్మిక, వాణిజ్య, ఆర్థిక విధానాలకు నిరసనగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో మహిళలు, మహిళా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ పి.ప్రేమ్ పావని, తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి పిలుపునిచ్చారు. హైదరాబాద్, హిమాయత్‌నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా, రక్షణ, యూనియన్ హక్కులను దెబ్బతీస్తున్న నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలని, విబి జిరామ్‌జి చట్టాన్ని రద్దు చేసి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొత్త విత్తన, విద్యుత్ సవరణ బిల్లులను వెనిక్కి తీసుకోవాలన్నారు. అంగన్‌వాడి, ఆశ వర్కర్స్ , మధ్యాహ్న భోజన పథకంలో మహిళలు ఎక్కువ పనిచేస్తున్నారని, వారికీ 'సమాన పనికి సమాన వేతనం' ఇవ్వాలని కోరారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా హైదరాబాద్, బాగ్‌లింగంపల్లి నుండి ఇందిరా పార్క్ వరకు జరిగే భారీ కార్మికుల ప్రదర్శనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, నిరసన వ్యక్తం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నండూరి కరుణ కుమారి, మహిళా సమాఖ్య హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పడాల నళిని, శ్రామిక మహిళా ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**సార్వత్రిక సమ్మెలో ఆటో, క్యాబ్, లారీ వాహనాల బంద్ : వెంకటేశం**

సార్వత్రిక సమ్మెలో భాగంగా ఆటో, క్యాబ్, లారీ వాహనాల బంద్‌ను విజయవంతం చేయాలని ఆటో, క్యాబ్, లారీ, సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బి.వెంకటేశం పిలుపునిచ్చారు. 2019 మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని,ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఆటోలకు మీటర్ చార్జీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఓలా, ఊబర్, ర్యాపిడోల ద్వారా అక్రమంగా నడుస్తున్న బైక్‌లను నిషేధించాలని,ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటోలకు ఈ ఛలాన్ల నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు.

**సమ్మెకు 'ఎస్‌టియు' మద్దతు**

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఎస్‌టియు టిఎస్ తమ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు, చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి. సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగానికి బడ్జెట్‌లో అధిక నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేజ్ బోర్డు పునరుద్ధరణ

### ఐజెయు డిమాండ్ : సార్వత్రిక సమ్మెకు మద్దతు

**హైదరాబాద్/చండీగఢ్ :** నాలుగు కార్మిక కోడ్లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, దాని అనుబంధ సంఘాలు గురువారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఐజెయు అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బల్విందర్ సింగ్ జమ్మ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం సహా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడంపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. ఈ చర్య మీడియా సహా అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులకున్న రక్షణను బలహీనపరుస్తుందన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని తక్షణమే తిరిగి అమల్లోకి తేవాలని, మీడియా కార్మికులకు రక్షణ, న్యాయమైన వేతనాలకు హామీనిచ్చేలా వేజ్ బోర్డు వ్యవస్థను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని శ్రీనివాస్ రెడ్డి, బల్విందర్‌సింగ్ జమ్మ డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాయడమే కాకుండా ఉద్యోగ భద్రతకు, సామాజిక భద్రతా ప్రయోజనాలకు కొత్త లేబర్ కోడ్‌లు విఘాతం కలిగిస్తాయన్నారు. కార్మిక చట్టాలను ఏకీకృతం చేసే నెపంతో వర్కింగ్ జర్నలిస్టులు, ఇతర వార్తా పత్రికల ఉద్యోగులు (సేవల షరతులు), ఇతర నిబంధనల చట్టం, వేజ్ బోర్డు వంటివి రద్దు చేయడం ఆక్షేపణీయమన్నారు. సేవల షరతులు, వేతనాలు, జర్నలిస్టులు నాన్ జర్నలిస్టుల వృత్తిపరమైన హక్కుల పరిరక్షణకు ఈ నిబంధనలు కీలకమని ఐజెయు నమ్ముతుందని వెల్లడించారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని తిరిగి అమల్లోకి తేవాలని, మీడియా కార్మికులకు రక్షణ, న్యాయమైన వేతనాలకు హామీనిచ్చేలా వేజ్ బోర్డు వ్యవస్థను పునరుద్ధరించాలని శ్రీనివాస్ రెడ్డి, బల్విందర్ సింగ్ జమ్మ డిమాండ్ చేశారు. దేశ కార్మికవర్గానికి ఐజేయూ ఎల్లప్పుడు వెన్నుదన్నుగా నిలుస్తుందని ప్రకటించారు. కార్మికుల హక్కులను పరిరక్షించడమే కాకుండా ప్రజాస్వామిక సిద్ధాంతాలను కాపాడేలా కార్మిక సంఘాలతో అర్థవంతమైన చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని శ్రీనివాస్‌రెడ్డి, బల్విందర్ సింగ్ జమ్మ కోరారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఐజేయూ అనుబంధ సంఘాలకు పిలుపునిచ్చారు.

**పత్రికా స్వేచ్ఛను హరించొద్దు : 'ది వైర్'పై చర్యలకు ఖండన**

ప్రముఖ వార్తా సంస్థ ది వైర్‌కు చెందిన ఇన్‌స్టాగ్రామ్ పేజిని నిషేధించడాన్ని ఐజెయు ఖండించింది. ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆక్షేపించింది. సామాజిక మాధ్యమాల నుంచి వ్యంగ్య వీడియో తొలగింపును తప్పుపట్టింది. ముందస్తు సమాచారం లేకుండా, మీడియా సంస్థకు సరైన వివరణ ఇవ్వకుండా తీసుకునే ఇలాంటి చర్యలు స్వతంత్ర జర్నలిజంపై పెరుగుతున్న అసహనానికి అద్దంపడుతున్నాయని శ్రీనివాస్‌రెడ్డి, బల్విందర్ సింగ్ జమ్మ వేరొక ప్రకటనలో వ్యాఖ్యానించారు. 'లీగల్ రిక్వెస్ట్' అంటూ పారదర్శకత లేకుండా గందరగోళానికి గురిచేసే చర్యలు తీసుకోవడం జవాబుదారీతనంపై ప్రశ్నలకు తావిస్తుందన్నారు. వ్యంగ్యం, విమర్శలు, వ్యాఖ్యలు పత్రికా స్వేచ్ఛలో భాగమని, రాజ్యాంగం ఇందుకు రక్షణ కల్పించిందని గుర్తుచేశారు. సంబంధిత అధికారులు తక్షణమే ఈ వ్యవహారంలో స్పష్టతివ్వాలని ఐజెయు తరపున శ్రీనివాస్‌రెడ్డి, బల్విందర్ సింగ్ జమ్మ డిమాండ్ చేశారు. పత్రికా స్వేచ్ఛను అణచివేస్తూ, ప్రజాస్వామిక విలువలను కాలరాస్తూ, పారదర్శకత లేని చర్యలు తీసుకోవడాన్ని ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. మీడియా గొంతు నొక్కేందుకు ప్రత్యక్షంగా లేక పరోక్షంగా జరిగే ఏ ప్రయత్నమైనా గానీ ప్రజాస్వామ్యంలో ఆమోదయోగ్యం కాదని శ్రీనివాస్‌రెడ్డి, బల్విందర్ సింగ్ జమ్మ స్పష్టంచేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో 'హస్తం' హవా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో 70 శాతం 'హస్తగతం' కానుందని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్‌పోల్ సర్వే తెలిపింది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్‌పోల్‌ను పీపుల్స్‌పల్స్ బుధవారం సాయంత్రం వెల్లడించింది. మంచిర్యాల, రామగుండం, నల్లగొండ , మహబూబ్‌నగర్ , కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లు కాంగ్రెస్‌కు, కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లు బిజెపికి దక్కే అవకాశాలు ఉన్నట్టు సర్వే తెలిపింది. బిఆర్ఎస్‌కు ఏ ఒక్క స్థానం దక్కే అవకాశాలు లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలలో కాంగ్రెస్‌కు 68 నుంచి 76, బిఆర్ఎస్‌కు 29 నుంచి 36, బిజెపికి 3 నుంచి 5 , ఎంఐఎంకు ఒకటి గెలిచే అవకాశాలు ఉండగా, 8 నుంచి 14 మున్సిపాలిటీలలో గట్టిపోటీ ఉన్నదని ఎగ్జిట్‌పోల్ తెలిపింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కీలక కానుందని తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీల్లో మొత్తం 2582 వార్డులలో కాంగ్రెస్‌కు 1210 నుంచి 1290 వార్డులు( 36 ఓట్ల శాతం), బిఆర్ఎస్‌కు 860 నుంచి 930వార్డులు(29.7 శాతం ఓట్లు), బిజెపికి 250 నుంచి 270 వార్డులు (19.3 శాతం ఓ ట్లు), ఎంఐఎంకు 35 నుంచి 44 వార్డులు( రెండు శాతం ఓట్లు), సిపిఐకి 12 నుంచి 17వార్డులు(రెండు శాతం ఓట్లు), సిపిఐ(ఎం)కు 10 నుంచి 14వార్డులు (1.2 శాతం ఓట్లు), ఇతరులు 90 నుంచి 110 వార్డులు (9.7 శాతం ఓట్లు) వరకు గెలిచే అవకాశాలు ఉన్నాయని పీపుల్స్‌పల్స్ సర్వే ఎగ్జిట్‌పోల్స్ తెలిపింది.

**కార్పొరేషన్ల వారీగా...**

**రామగుండం:** కాంగ్రెస్ 30–34, బిఆర్ఎస్ 16–20,బిజెపి 36, ఇతరులు 47 డివిజన్లు.

**మంచిర్యాల:** కాంగ్రెస్ 39–43, బిఆర్ఎస్ 8–12, బిఆర్ఎస్ 69, ఇతరులు 12.

**కొత్తగూడెం:** కాంగ్రెస్ 28–34, బిఆర్ఎస్ 79, సిపిఐ 14–16, ఇతరులు 24.

**మహబూబ్‌నగర్ :** కాంగ్రెస్ 26–30, బిఆర్ఎస్ 18–22, బిజెపి 68, ఎంఐఎం 24, ఇతరులు 01.

**నల్లగొండ :** కాంగ్రెస్ 21–26,బిబిఆర్ఎస్ 8–12, బిజెపి 610, ఎంఐఎం 24, ఇతరులు 12.

**నిజామాబాద్:** కాంగ్రెస్ 10–16, బిఆర్ఎస్ 24, బిజెపి 26–31, ఎంఐఎం 8–12, ఇతరులు 12.

**కరీంనగర్:** కాంగ్రెస్ 14–16, బిబిఆర్ఎస్ 10–12,బిజెపి 24–29, ఎంఐఎం 69, ఇతరులు 13.



## కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎగిరేది కంకికొడవలే

### 36కి పైగా డివిజన్లలో ఎర్రజెండా రెపరెపలు : కూనంనేని ధీమా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలపక్షాన పోరాడుతున్న సిపిఐ అభ్యర్థుల విజయం ఖాయమని, 36కి పైగా డివిజన్లలో ఎర్రజెండా రెపరెపలాడబోతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం జరిగిన ఎన్నికల సరళిని ఆయన 60 డివిజన్ల వ్యాప్తంగా పర్యటించి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటర్లు ఎంతో చైతన్యవంతంగా పాల్గొన్నారని, సిపిఐ ఎన్నికల గుర్తు కంకికొడవలికి ప్రజల నుండి విశేషస్పందన లభించిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉత్సాహాన్ని చూపుతుంటే సిపిఐ అభ్యర్థుల మెజార్టీ స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

**అధికార పక్షానికి బుద్ధి చెప్పిన ఓటర్లు :** ఎన్నికల సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ ఓటర్లను ప్రభావితం చేయాలని చూశారని కూనంనేని విమర్శించారు. అక్కడక్కడా పోలీసుల తీరు వల్ల చిన్నపాటి అసంతృప్తికర సంఘటనలు ఎదురైనప్పటికీ, ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. అధికార పక్ష ప్రలోబాలను కాదని ప్రజా సమస్యలపై నిలబడే సిపిఐకే ఓటర్లుపట్టం కట్టారని ఆయన విశ్లేషించారు.

**యంత్రాంగానికి అభినందనలు :** ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగాసాగేలా కృషి చేసిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్ రాజ్‌కు కూనంనేని అభినందనలు తెలిపారు. రెండు రోజుల్లో జరగబోయే ఓట్ల లెక్కింపులో ప్రజల తీర్పు స్పష్టంగా వెల్లడవనుందని, కొత్తగూడెం అభివృద్ధిలోసిపిఐ కీలకపాత్ర పోషించబోతోందని ఆయన స్పష్టం చేశారు.

# భారీ భద్రత మధ్య ముగిసిన పోలింగ్

### చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతం

### పోలింగ్ సిబ్బందిపై పిచ్చికుక్కల దాడి

### పోలింగ్ బూత్‌లోకి కత్తితో ప్రవేశించిన మహిళ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటిల్లో భారీ పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ప్రధానంగా ఎక్కడా పెద్ద హింసాత్మక సంఘటనలు జరగకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.నల్గొండ, నిజామాబాద్, మెదక్,నారాయనపేట్, సింగారెడ్డి,జనగామ,మహబూబాబాద్ జిల్లాలలో చోటు చేసున్న గొడవలు పెద్దవి కాకుండా భద్రత బలగాలు చాకచక్యంగా వ్యవహరించడంతో పరిస్థితులు నియంత్రణలో ఉన్నాయి. ములబబాబాద్, నిజామాబాద్, మేదక్ వంటి చోట్ల అక్కడి స్థానిక నేతల మధ్య గొడవలు, చేయి వేసుకున్న ఘటనలు నమోదయ్యాయి.జనగామలో కొంతమంది ఓటర్లు ఓటుకు డబ్బులు ఇవ్వలేదని రోడ్డుపై నిరసనగా ప్రదర్శించారు. పురపాలక ఎన్నికల సందర్భంగా పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో చెదురుమదురు ఘటనల మినహా పురపాలిక పోలింగ్ సజావుగా సాగింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో బోగస్ ఓట్లు వేస్తున్నారని బిఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటుండగా.. మరికొన్ని చోట్ల ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు పంచుతున్నారన్న సమాచారంతో ఇరు పార్టీల కార్యకర్తలు బాహాబాహీకి దిగారు.

**సంగారెడ్డిలో పోలీసులకు, జగ్గారెడ్డి మధ్య ...**

సంగారెడ్డి మున్సిపాలిటీలో పోలీసులకు, జగ్గారెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. 34వ వార్డులో ఆ వార్డు అభ్యర్థి అడ్డుకుని సిఐ కాలర్ పట్టుకోవడంతో గొడవ మొదలైంది. కాంగ్రెస్ శ్రేణులు సిఐ తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జగ్గారెడ్డి పోలింగ్ సెంటర్ వద్దకు చేరుకుని పోలింగ్ ఆపేస్తానంటూ బూత్‌లోకి వెళ్లడానికి ప్రయత్నించారు. పోలీసులతో జగ్గారెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు జగ్గారెడ్డికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి పోలీసులపై ఘాటు వ్యాఖ్యలతో రెచ్చిపోయారు. రిగ్గింగ్ చేస్తున్నారని చెప్పిన మా అభ్యర్థిపై సిఐ శివకుమార్ గల్లా పట్టాడని ఆ సిఐ మొగోడు అయితే ఇక్కడికి రావాలని మండిపడ్డారు. సంగారెడ్డిలో శాంతిభద్రతల సమస్య వస్తే దానికి సిఐ, హోంగార్డే కారణం అని ఆయన ఆరోపించారు.కాంగ్రెస్ అభ్యర్థి గల్లా పట్టుకున్నన్న సిఐని వెంటనే సస్పెండ్ చేయాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిమాండ్ చేశారు.

**సిబ్బందిపై పిచ్చికుక్కల దాడి..**

కరీంనగర్ జిల్లాలో ఎన్నికల సిబ్బంది పై పిచ్చి కుక్కలు దాడి చేశాయి. ఎన్నికల పోలింగ్ కేంద్రం ప్రాంగణంలో ఉన్న ఎన్నికల సిబ్బందిపై దాడి చేసిన రెండు పిచ్చి కుక్కలు అటాక్ చేశాయి. ఈ దాడిలో ముగ్గురు అధికారులు గాయపడ్డారు. గాయపడినవారికి అక్కడే ఉన్న వైద్య శిబిరంలో ప్రాథమిక చికిత్స చేయించి.. వ్యాక్సిన్ ఇప్పించి ఇంటికి పంపించారు.

**పలుచోట్ల స్వల్ప ఘర్షణలు ..**

నర్సాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డులో బిఆర్ఎస్, బిజెపి కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ క్రమంలోనే పరస్పర దాడులకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. రామాయంపేట ఏడో వార్డులో బిజెపి, కాంగ్రెస్ వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది.

**కానిస్టేబుల్‌పై ఎంపి ఆగ్రహం..**

నిజామాబాద్ పరిధిలోని బూత్ నంబర్ 7లో శంకర్ అనే కానిస్టేబుల్, ఒక మున్సిపల్ ఉద్యోగి కలిసి ఓటర్లను కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలంటూ ప్రభావితం చేస్తున్నారని ఎంపి అరవింద్ సమాచారం అందిందని.. దీనిపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఎసిపితో ఎంపి మాట్లాడారు. 'మీ కానిస్టేబుల్ తప్పు చేస్తే, మీరు చేసినట్టే' అని ఎంపి అరవింద్ ఎసిపిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 'మాకు నేర్పించినట్లు కాదు.. మీరే నేర్చుకోండి ముందు' అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

**బూత్‌లోకి కత్తితో..**

ఆదిలాబాద్ పట్టణంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని రాంనగర్లోని పోలింగ్ కేంద్రానికి ఓటు వేయడానికి వచ్చిన ఓ మహిళ తన వెంట కత్తిని తీసుకురావడాన్ని చూసిన తోటి ఓటర్లు, అక్కకోవడంతో సిబ్బంది షాక్‌కు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సదరు మహిళను, ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నారు. ఆమె కత్తిని ఎందుకు తీసుకువచ్చింది అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

**నకిలీ వెండి నాణాల గోల..**

మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో ఎన్నికల వేళ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బిజెపి పార్టీ 5 వ వార్డు అభ్యర్థి మాలతి మాధవరెడ్డి నకిలీ వెండి నాణేలను పంచుతూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారంటూ బిఆర్ఎస్ పార్టీ నాయకుడు దశరథ్ ఆరోపించారు.ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి మాలతి మాధవరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆరోపించారు.

**పరిగిలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల మధ్య ఉద్రిక్తత..**

వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న ఎన్నికల పోలింగ్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పట్టణంలోని 13వ వార్డు 27వ పోలింగ్ కేంద్రం వద్ద అధికార కాంగ్రెస్ , ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. పోలింగ్ సజావుగా సాగుతున్న సమయంలో, కాంగ్రెస్ నాయకులు బోగస్ ఓట్లు వేయిస్తున్నారని బిఆర్ఎస్ శ్రేణులు ఆరోపించాయి. బయటి వ్యక్తులతో దొంగ ఓట్లు వేయించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు. దీనిపై కాంగ్రెస్ వర్గీయులు ధీటుగా స్పందించారు. తాము ఎలాంటి బోగస్ ఓట్లు వేయించడం లేదని, స్థానిక ఓటర్లే తమ వెంట తెచ్చుకున్న ప్రభుత్వ గుర్తింపు కార్డుల ద్వారా నిబంధనల ప్రకారమే ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని వారు వాదించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం పెరిగి తోపులాట వరకు దారితీసింది.

**కర్రలతో దాడి : పలువురికి గాయాలు..**

గాంధీనగర్ 13వ వార్డులో తీన్మార్ మల్లన్న నేతృత్వంలోని టిఆర్‌పి (తెలంగాణ రైట్ పార్టీ) ,కాంగ్రెస్ కార్యకర్తలు భౌతిక దాడులకు దిగారు. పరస్పరం కర్రలతో దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు అకారణంగా తమపై లాఠీచార్జ్ చేశారని ఆరోపిస్తూ బాధితులు సూర్యాపేట జనగామ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీనివల్ల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

**యాదాద్రి భువనగిరి:**

**ఓటుకు నోటు కలకలం..**

భువనగిరి మున్సిపాలిటీలో ఓటర్లకు బహిరంగంగా నగదు పంపిణీ చేస్తున్నారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నగదు పంపిణీని అడ్డుకునే క్రమంలో స్వల్ప ఘర్షణలు జరిగాయి.

**ఇతర ప్రాంతాల్లో ఫిర్యాదుల పర్వం..**

చండూరు, చౌటుప్పల్, తిరుమలగిరి మరియు మోత్కూరు మున్సిపాలిటీల్లోనూ ఉద్రిక్తత నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ బూత్ల వద్ద ప్రచారం చేస్తున్నారంటూ అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదులు చేశారు.

## మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 90 శాతం స్థానాలు కాంగ్రెస్‌వే

### మహేశ్ కుమార్ గౌడ్ ధీమా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 90 శాతం కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను కైవసం చేసుకోబోతోందని టిపిసిసి అధ్యక్షుడు ఎంఎల్‌సి, బి మహేశకుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందనుందన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో అందిస్తున్న ప్రజా పాలన, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యపథకాలకు పట్టణ ఓటర్లు పట్టం కట్టారని తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై రాష్ట్ర ప్రజలు పూర్తిగా సంతృప్తిగా ఉన్నారని ఈ ఫలితాలు స్పష్టం చేయనున్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీల పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణ మాఫీ, రైతు భరోసా ఇందిరమ్మ ఇళ్లు, పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్ తదితర కార్యక్రమాలు ప్రజల మన్ననలను పొందాయని వివరించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుదలపై ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలు ఓటర్లలో సానుకూల భావనను కలిగించాయని చెప్పారు. పార్టీ విజయానికి ఈ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.


GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
NIT No. 09/EE-II/Cir.43/SBZ/GHMC/2025-26, తేది: 10.02.2026
పని పేరు: 10 సంఖ్యలు, జిహెచ్ఎంసి, ఎస్‌బిజెడ్, తార్నాక సర్కిల్-43లోని వార్డు నెం.173లో అడిక్‌మెట్, టిప్పుఖాన్ మజీద్, ఈద్గా కోసం నల్ల మచ్చలను కవర్ చేయడానికి PSCC పోల్‌తో పాటు 1x6+25 AB కేబుల్ స్ట్రింగ్ మరియు అన్ని ఉపకరణాలను అందించడం (రీకాల్). అంచనా మొత్తం / ఇసివి (రూ.లక్షలలో): 1,52,107. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 12.02.2026న మ.2.00గం.ల నుండి 16.02.2026న మ.2.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, జిహెచ్ఎంసి, సికింద్రాబాద్ జోన్, సెల్ నెం. 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 15229-PP/CL/ADVT/1/2025-26, Date: 11-02-2026



## రాష్ట్రంలో మళ్లీ అధికారం చేపట్టబోయేది ముమ్మాటికీ కాంగ్రెస్సే

### కోదాడలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం కోదాడ పట్టణంలోని 14 వార్డు 34వ పోలింగ్ బూత్‌లో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటి, 7 కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం పురపాలక సంఘం ఎన్నికల్లో గేమ్ ఛేంజర్‌గా మారిందన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమిలేదని, అందుకే ప్రజలు విసుగుచెందారని, తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ అధికారం చేపట్టబోయేది ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని అన్నారు. ఆయన వెంట కోదాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, వంగవీటి రామారావు పలువురు ఉన్నారు.

## చిట్యాలలో 87.88 శాతం పోలింగ్




**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటిలో బుధవారం నిర్వహించిన ఎన్నికలు చెదురుమెదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన 24 పోలింగ్ బూత్‌లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణను అధికారులు పూర్తి చేశారు. పట్టణంలోని మొత్తం 12వేల118 ఓట్లకు గాను 10వేల 649 ఓట్లు పోలయ్యాయి. 87.88 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగియడంతో కౌన్సిలర్లుగా పోటీ చేసిన అభ్యర్థులు తమ గెలుపోటములపై అంచనాలు వేసుకుంటున్నారు. అభ్యర్థుల గెలుపుపై పట్టణ ప్రజలలో కూడా ఉత్కంఠ నెలకొని ఉంది. 13న నల్లగొండలో జరిగే కౌంటింగ్‌తో ఉత్కంఠకు తెరపడనుంది.

## హాలియాలో 85.78 శాతం

**ప్రజాపక్షం/హాలియా:** మున్సిపాలిటీ ఎన్నికలు నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిశాయి.బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు కాసింత ఆసక్తి చూపించారు.హాలియాలో మొత్తం 12 కౌన్సిలర్లు ఉండగా అందులో 10వ వార్డు కౌన్సిలర్ ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి విధితమే. మిగిలిన 11వ వార్డులకు ఎన్నికలు నిర్వహించారు.హాలియా మున్సిపాలిటీలో 11 వార్డుల్లో 11696 ఓటర్లు ఉన్నారు.ఇందులో 10,033 ఓట్లు నమోదయ్యాయి. మహిళలు 5949 మంది ఓటర్లు ఉండగా ఇందులో 5,123 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు5746 మంది ఓటర్లు ఉండగా ఇందులో 4909 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.పురుషులలో 85.43శాతం,మహిళల్లో 86.12 శాతం ఓట్లు నమోదయ్యాయి.ఓవరాల్ గా 85.78 శాతం ఓట్లు పోలయ్యాయి.ఇందులో కూడా మహిళలే తమ ఓటు హ క్కును ఎక్కువగా వినియోగించుకోవడం గమనార్హం.

## భువనగిరిలో 82.93 శాతం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మున్సిపాలిటీలోనీ 35 వార్డులలో బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 35 వార్డులకు గాను 43,781 ఓటర్లు ఉండగా 39,664 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ప్రారంభమైన పోలింగ్ మందకోడిగా సాగగా మధ్యాహ్నం వరకు ఎక్కువ శాతం నమోదయింది. ఉదయం 9 గంటలకు 4474 ఓటింగ్ నమోదుకగా 9.35 శాతం, 11 గంటలకు 14876 ఓటు హక్కును వినియోగించుకోగా 31.10 శాతం, మధ్యాహ్నం ఒంటిగంటకు 25,540 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 47.12 శాతం, మూడు గంటలకు 32,498 పోలింగ్ జరగదు 67.94 శాతం, సాయంత్రం 5 గంటలకు 39,664 ఓటరు తమ ఓటు హక్కును వినియోంచుకోగా 82.93 శాతం నమోదైంది.

## నందికొండలో 59.68 శాతం



**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మొదట మందకొడిగా సాగినా 10 గంటల తర్వాత ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలి రావడంతో పోలింగ్ వేగం పెరిగింది.మధ్యాహ్న భోజన విరామం తర్వాత కొంత నెమ్మదించినా,సాయంత్రం వరకు ఓటర్లు తమ ఓటు హక్కునువినియోగించుకోవడంతో పోలింగ్ శాతం క్రమంగా పెరిగింది.అధికారిక గణాంకాల ప్రకారం, నందికొండ మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులు, 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 6,441 మంది పురుషులు,7,079 మంది మహిళలు,ఇతరులు 1 కలిపి మొత్తం 13,521 మంది ఓటర్లు ఉండగా 8,069 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.పోలింగ్ ముగిసే సమయానికి 59.68 శాతం చేరుకుంది. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి,సతీమణితో పాటు,కుమారులు స్థానిక ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి,ఎంపీ రఘువీర్ రెడ్డిల తో కలిసి పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో జరుగుతున్న 6 మున్సిపాలిటీలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ వ్యవస్థను జిల్లా కలెక్టర్ హనుమంతరావు కలెక్టరేట్‌లో ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల నుండి ప్రత్యక్షంగా ప్రసారం అవుతున్న దృశ్యాలను మానిటరింగ్ చేస్తూ పోలింగ్ నిర్వహణను పరిశీలించారు.

# సూర్యాపేట జిల్లాలో 79.90 శాతం

### తిరుమలగిరి మున్సిపాలిటీలో అత్యధికంగా 88.36 శాతంపోలింగ్









**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో బుధవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి కె నరసింహ జిల్లాలోని పలు మున్సిపాలిటీలలోని పోలింగ్ బూత్‌లకు వెళ్ళి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌ల వద్ద గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి సిసి కెమెరాల నిఘాలో ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, వికలాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వీల్‌చైర్లలో తీసుకెళ్ళేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 5 మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 79.90 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ప్రకటించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. తిరుమలగిరి మున్సిపాలిటీలో అత్యధికంగా 88.36 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మొత్తం 15 వార్డులు ఉండగా 15,455 ఓట్లు ఉండగా 13,656 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూర్యాపేట మున్సిపాలిటీలో 79.38 శాతం పోలింగ్ నమోదు కాగా, మొత్తం 48 వార్డుల్లో 1,08,848 ఓటర్లు ఉన్నారు. ఇందులో 86,403 ఓటర్లు తమ ఓటు వేశారు. అలాగే కోదాడ మున్సిపాలిటీలో 77.05 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 32 వార్డులలో 53,056 ఓట్లు ఉండగా 40,881 మంది ఓటర్లు ఓటు వేశారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో 82.88 శాతం పోలింగ్ నమోదు కాగా, మొత్తం 27 వార్డులలో 28,867 ఓట్లు ఉన్నాయి. ఇందులో 23,926 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో 79.38శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 15 వార్డులు ఉండగా 13,746 ఓట్లు ఉండగా ఇందులో 10,893 మంది ఓటర్లు ఓటు వేశారు.

# మిర్యాలగూడలో 77.44శాతం పోలింగ్

### కొన్ని వార్డుల్లో స్వల్ప ఘర్షణలు





మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్, రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌లు పర్యవేక్షణలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం పట్టణంలో జరిగిన మున్సిపల్ ఎన్నికలు మిర్యాలగూడలో కొన్ని చెదురుముదురు సంఘటనలు మినహాయించి ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 7గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సరళి కొంత మందకొండిగా సాగింది. మధ్యాహ్నం తరువాత ఓటర్లు ఒక్కసారిగా క్యూలైన్‌లోకి రావడంతో ఓటింగ్ శాతం పెరిగింది. ఎన్నికల ప్రక్రియను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ పలు వార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మిర్యాలగూడలో 48 వార్డులకు గాను మొత్తం 93,020 మంది ఓటర్లు ఉండగా 72,036 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 77.44శాతం ఓటింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 79.31 శాతం ఓటింగ్ నమోదు కాగా ఈసారి ఓటింగ్ శాతం తరగడం గమనార్హం.

### బిఆర్ఎస్- కాంగ్రెస్ వర్గీయుల మధ్య స్వల్ప ఘర్షణలు

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కొన్ని వార్డుల్లో స్వల్ప ఘర్షణలు జరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 6వ వార్డులో బిఆర్ఎస్ పార్టీకి చెందిన కొంతమంది ఆంధ్ర ఓటర్లను దొంగ ఓట్లు వేయించడానికి వచ్చారని ఆరోపిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. 20వ వార్డులో, 29వ వార్డులో పోలింగ్ ముగిసిన అనంతరం కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగడంతో పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. 32వ వార్డులో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకోగా పోలీసులు లాఠీచార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. 8వ వార్డులో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య స్వల్ప వివాదం చెలరేగడంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే సరిదిద్దారు. 39వ వార్డులో 90 సంవత్సరాల వృద్ధుడు అంబులెన్స్‌లో వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకోవడం గమనార్హం.

### పోలింగ్ అధికారుల రెమ్యునరేషన్ కుదింపుపై ఆందోళన

మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించిన అధికారుల రెమ్యునరేషన్‌ను కుదించడం పట్ల విధులు నిర్వహించిన అధికారులు డీఆర్‌సీ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. తమకు రూ.1300 ఇవ్వాల్సి ఉండగా రూ.1000 ఇవ్వడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. కాగా సూర్యాపేట, భువనగిరి జిల్లాల ప్రభుత్వ నిబంధనలకు మేరకు ఇస్తే తమకు తక్కువ చేసి ఇవ్వడం సబబు కాదని అధికారులతో వాగ్వివాదం చేశారు.

# ప్రశాంతంగా నల్లగొండ కార్పొరేషన్ ఎన్నికలు

### భారీగా ఓటర్లు..మహిళలే ముందంజ





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ బుధవారం పట్టణవ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకొని ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది.నల్లగొండ కార్పొరేషన్ పరిధిలోని 48 వార్డుల్లో ఉన్న 199 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,42,437 మంది ఓటర్లు ఉండగా,వారిలో 1,10,194 మంది (సుమారు 77.3 శాతం)తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఓటు వేసిన వారిలో పురుషులు 52,983,స్త్రీలు 57,165,ట్రాన్స్‌జెండర్లు 65 మంది ఉన్నారు.ఈ ఎన్నికల్లో పురుషుల కంటే 4,182 మంది మహిళలు అధికంగా ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషంగా నిలిచింది.ఈసందర్భంగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి 33వ డివిజన్ మీర్‌బాగ్ కాలనీలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.సీపీఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి గిరిజ దంపతులు బోయవాడ ప్రభుత్వ పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి 34వ డివిజన్ వీటి కాలనీలోని గీతాంజలి కళాశాలలో ఓటు వేశారు. కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులు 132వ బూత్ ప్రగతి జూనియర్ కళాశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కిషన్ రెడ్డి,బిఆర్ఎస్ మేయర్ అభ్యర్థి చకిలం వసంత అనిల్ కుమార్ దంపతులు 48వ వార్డు గీత విజ్ఞాన మందిర్‌లో ఓటు వేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టగా,జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఎన్నికల సరళిని పర్యవేక్షించారు.

# గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరిన ఓటర్లు

### నూతన ఓటర్లకు స్వాగతం పలుకుతూ దివ్యాంగులను వయోవృద్ధుల ఓటర్లను సన్మానించిన జిల్లా కలెక్టర్






**ప్రజాపక్షం/యాదాద్రి :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం 6 మున్సిపాలిటీలలో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో బాగంగా జిల్లా కలెక్టర్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెంలో, భువనగిరి బీచ్ మహల్ లోని జిల్లా పరిషత్ హై స్కూల్లో, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని కొత్త గుండ్లపల్లిలో, ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు విశేష ఉత్సాహంతో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్రాల్లో పచ్చని మొక్కలు, పూల అలంకరణ, కొబ్బరి తోరణాలు, ప్లాస్టిక్ రహిత సామాగ్రి, పర్యావరణహిత అలంకరణతో ఓటర్లకు మైమరిపించే అనుభూతిని కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది విధుల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. శాంతియుతంగా, పారదర్శకంగా , ఎన్నికల నియమావళి ప్రకారం కొనసాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్

### నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లాలోని నల్లగొండ మున్సిపల్ కార్పోరేషన్, ఆరు మున్సిపాలిటీల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో అంతటా ప్రజలు తమ ఓట హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. పటిష్ట బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించామన్నారు. ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా హెల్ప్ డెస్క్, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం గాంధీపార్క్ ప్రాధమికొన్నత పాఠశాలలోని కేంద్రానిన కలెక్టర్ పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, వైద్య శిబిరం నిర్వాహకులతో మాట్లాడి అందించాలని కోరారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్అమిత్, తహసీల్దార్ పి.శ్రీనివాస్, కమీషనర్ జి.శ్రీనివాస్, ఎంపీడీవోలు ఎం.శేషగిరిశర్మ, వంశీధర్‌లు ఉన్నారు.

## ఎన్నికల విధులకు గైర్హాజరు 17మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ

**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లాలో జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అఫీసర్ తో పాటు తతర పోలింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించి అందిరికి పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. అందులో భాగంగా చండూరు మున్సిపాలిటీకి కేటాయించిన 17 మంది అధికారులు ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. ఎలాంటి కారణాలు లేకుండా బుధవారం జరిగిన చండూరు మున్సిపాలిటీ జరుగుతున్న ఎన్నికలకు గైర్హాజరైన 17మంది ఉద్యోగులకు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ నుండి సోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరై సోకాజ్ నోటీసులు జారీ చేసిన వారిలో జి..ఏ కుమార్ టిఎస్ఆర్‌టిసి అధికారి, ఎండి అశ్రాఫ్ జహ ఇరిగేషన్ విభాగం అధికారి, ఎం.ఎ ఫహీప్ జిల్లా మైనార్టీ అధికారి, ఎం. శ్రీదేవి ఉపాధ్యాయురాలు, యాట మధుసుధన్ ఉపాధ్యాయులు, టి.గాయిత్రీ కేజీబివి ఉపాధ్యాయురాలు, పి. ప్రజ్వల కేజిబివి పాధ్యాయురాలు, నాసేమున్నీసా ఉపాధ్యాయురాలు, జి. సంతోషి కుమారి కేజిబివి ఉపాధ్యాయురాలు, జీడిమెట్ల స్వరాజ్యం ఉపాధ్యాయురాలు, బి. లలీత హెచ్ఎం , బత్తుల భాస్కర్ ఉపాధ్యాయుడు, ఎం.లలీత కేజిబివి ఉపాధ్యాయురాలు , ఎస్ పద్మ ఉపాధ్యాయురాలు, ఈ.రమేష్ దేవాదాయ శాఖ అధికారి, కే.కేశలయ్య దేవాదాయ శాఖ అధికారి, పి. ఏడుకొండలు దేవాదాయ శాఖ అధికారి లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ నుండి సోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు.

## చండూరు మున్సిపాలిటీలో 91.52శాతం పోలింగ్ నమోదు

**ప్రజాపక్షం/చండూరు :** మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా బుధవారం జరిగిన చండూరు మున్సిపాలిటీలో 91.52 శాతం పోలింగ్ నమోదు అయ్యినట్లు జిల్లా ఎన్నికల సహాయ అధికారి, చండూరు మున్సిపల్ కమీషనర్ మల్లేశం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన పోలింగ్ లో ఓటు హక్కు కలిగిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపాలిటీలో ఉన్న మొత్తం 11వేల 370 ఓట్లకు గాను 10వేల 406 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపాలిటిలోని జడ్‌పి ఉన్నత పాఠశాల, ఆనంద్ విద్యా మందిర్ హైస్కూల్, తేజా హైస్కూల్, చొక్కారామయ్య హైస్కూల్‌తోపాటు కుడకుడలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. పోలింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని కోరారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా అవాంతరాలు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటిలలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, తహశీల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు.

## దేవరకొండలో 80.26 పోలింగ్

### అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న మహిళా ఓటర్లు

**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా బుధవారం జరిగిన ఎన్నికల్లో దేవరకొండ లోని 20 వార్డుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు గొడవలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది.ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయి.పోలింగ్ జరుగుతున్న సరళిని దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, డిఎస్పి శ్రీనివాసరావు,తహాశిల్దార్ మధుసూదన్ రెడ్డి,సిఐ వెంకటరెడ్డిలు పర్యవేక్షించారు.పటిష్టమైన పోలీసు బందోబస్తును పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారు.పట్టణంలోని 20 వార్డుల్లో మొత్తం ఓటర్లు 23,830 ఉండగా 19,127 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ఇందులో అత్యధికంగా మహిళా ఓటర్లు 9823 కాగా పురుషులు 9303 మంది,ఇతరులు 1 ఓటు హక్కును వినియోగించుకున్నారు.పోలైన ఓట్ల ప్రకారం 20 వార్డుల్లో మొత్తంగా దేవరకొండ మున్సిపాలిటీలో సాయంత్రం పోలింగ్ సమయం ఐదు గంటల వరకు 80.26 పోలింగ్ నమోదైనట్లు దేవరకొండ మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ వెల్లడించారు.పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల్లోని బ్యాలెట్ బాక్సులను కేటాయించిన వాహనాల్లో పోలీస్ భద్రత నడుమ కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు.ఈనెల 13వ, తేదీన ఫలితాలు వెల్లడి కానున్నాయి.




# అవిశ్వాస తీర్మానాన్ని తిరస్కరించే అవకాశం!

## మార్చి 9న అవిశ్వాసంపై చర్చ



**న్యూఢిల్లీ:** ప్రతిపక్ష నాయకుణ్ణి సభలో మాట్లాడనీయకుండా అడ్డుపడిన లోక్‌సభాపతిని తొలగించాలనూ ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ఇచ్చిన లిఖితపూర్వక నోటీసును తప్పుల తడకగా పేర్కొంటూ ఓంబిర్లా తిరస్కరించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఐతే ప్రతిపక్షాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులో తప్పులు ఉన్నందువల్ల వాటిలో దిద్దుబాట్లు చేసి వీలైనంత త్వరగా సభలో చర్చించేందుకు జాబితాల్లో చేర్చాలని అధికారులకు ఆయన సూచన చేశారట! పార్లమెంటరీ వర్గాలు బుధవారం ఈ విషయం వెల్లడించాయి. మార్చి తొమ్మిదో తేదీన అవిశ్వాస తీర్మానం నోటీసుపై చర్చ, తదుపరి ఓటింగ్ జరిగే అవకాశాలు ఉంటాయి. లోక్‌సభ నిబంధనావళిలో 94 సి అధికరణ ప్రకారం స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్‌ను పదవి నుండి తొలగించాల్సి ఉంటుంది. ఐతే ఇదే నిబంధనావళిలోని 96వ అధికరణ ప్రకారం స్పీకర్ తనను తాను రక్షించుకుంటూ వాదనలు వినిపించేందుకు అవకాశం ఉంది. అవిశ్వాస తీర్మానం సమయంలో స్పీకర్‌కు ఓటు వేసే అధికారం ఉంటుంది. ఒకవేళ అధికార–ప్రతిపక్షాల మధ్య సమాన ఓట్లు గనుక వస్తే స్పీకర్‌కు ఓటు వేసే హక్కు ఉండదు. ప్రతిపక్షాలకు చెందిన దాదాపు 118 మంది ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేసి మంగళవారం మధ్యాహ్నం వారంతా లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్‌కు అందజేశారు. ఆ తర్వాత ప్రతిపక్షాలు ఆ నోటీసును ఉపసంహరించుకుని తేదీలను సరిదిద్ది మరో నోటీసును ఆయనకు అందజేశాయి. ''ఈ నోటీసులులో 2025 ఫిబ్రవరిలో జరిగిన ఆనాటి అంశాలను కూడా నాలుగుసార్లు ఉటంకించినందువల్ల, ఆ ప్రాతిపదికపై నిబంధనలకు అనుగుణంగా ఈ నోటీసును లోక్‌సభ స్పీకర్ చర్చకు తీసుకోకుండా తిరస్కరించే అవకాశం ఉందని పార్లమెంటరీ వర్గాలు తెలియజేశాయి. ఆ నోటీసులో కొన్ని లోపాలు ఉన్నందువల్ల వాటిని సరిచేయాలని, ఆ తర్వాతే సభలో చర్చకు వీలుగా జాబితాలో చేర్చాలని స్పీకర్ సిబ్బందికి ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా సకాలంలో చర్యలు తీసుకోవాలని ఓం బిర్లా చెప్పినట్లు కొందరు అధికారులు తెలియజేశారు. ప్రతిపక్షాలు రెండోసారి తేదీని సరిదిద్ది ఇచ్చిన నోటీసును సత్వరం పరిశీలిస్తున్నట్లు వర్గాలు చెప్పాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పదవి నుండి తొలగించాలని ప్రతిపక్షాలు మంగళవారం పట్టుపట్టాయి. ఆయన సభలో పక్షపాత ధోరణి పాటిస్తున్నారని, ప్రతిపక్షాలపట్ల తన చట్టబద్ధ విధులు నిర్వర్తించడంలేదని నోటీసు ఇచ్చిన ఎంపీలందరూ విమర్శించారు. దీంతో ఈ సమస్య పరిష్కారమయ్యేవరకూ ఓం బిర్లా సమావేశాలకు అధ్యక్షత వహించకుండా దూరంగా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్, చీఫ్ విప్ కె.సురేశ్, విప్ మహ్మద్ జావెద్ లతోపాటు సమాజ్‌వాదీపార్టీ, డిఎంకె పార్టీల ఎంపీలు కూడా ఈ నోటీసు ఇచ్చారు. లోక్‌సభ నిబంధనావళిలోని 94 సి అధికరణకు అనుగుణంగా అవిశ్వాస తీర్మానం నోటీసును సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్‌కు వారంతా అందజేశారు. తనకు వ్యతిరేకంగా ప్రతిపాదించిన ఈ అవిశ్వాస తీర్మాన సమస్య పరిష్కారమయ్యే వరకూ సభా కార్యకలాపాలకు అధ్యక్షత వహించి నడిపించకూడదని నిర్ణయించుకుని అత్యున్నతమైన నైతిక ప్రమాణాలను ఓం బిర్లా పాటిస్తున్నారని లోక్‌సభ సచివాలయం అధికారులు తెలియజేశారు. బడ్జెట్‌కు సంబంధించి ఈ విడత సమావేశాలు ముగిసిన తర్వాత విరామం వస్తుంది. విరామం పూర్తయిన తర్వాత రెండో విడత సమావేశాల్లో ఈ నోటీసుపై చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి.

# పెంగ్విన్‌కు ఢిల్లీ పోలీసుల నోటీసులు




**న్యూఢిల్లీ:** భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం రాజకీయంగా తీవ్ర వివాదాస్పదం అవుతోంది. దీనికి సంబంధించి ప్రచురణ సంస్థ పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఇండియాకు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ప్రచురణ సంస్థ యాజమాన్యం విచారణలో భాగం కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇంకా ప్రచురితం కాని ఆ పుస్తకానికి సంబంధించిన పలు ప్రశ్నలు సంధించారు. వాటికి వివరణ అడిగారు. కాగా... ప్రభుత్వ అనుమతి పొందక ముందే 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం బయటకు రావడం వివాదమవుతోంది. ఆ పుస్తకం ప్రచురితం కాలేదని, అది మార్కెట్‌లో అందుబాటులో లేదని పీఆర్‌హెచ్‌ఐ పేర్కొన్న సంగతి తెలిసిందే. అధికారికంగా విడుదల చేసి, రిటైల్ వేదికల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పుస్తకాలనే ప్రచురితమైనవిగా పరిగణిస్తారని వెల్లడించింది. కానీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాత్రం ఆ బుక్‌ను మార్కెట్‌లో అమ్ముతున్నారని చెప్పారు. ఈ వ్యవహారంలో నేరపూరిత కుట్రకు సంబంధించిన సెక్షన్ల కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# చిక్కులున్నా లెక్కచేయకుండా గగనయాన్ ఉరవడి కొనసాగాలి: శుక్లా



**బెంగళూరు:** చిక్కులు, తెలియని సమస్యలు ఎదురైనాగానీ గగనయాన్ ప్రయోగానికి సంబంధించిన సన్నాహాలు, కార్యక్రమాల ఉరవడిని, ఇప్పుడున్న ఉత్సాహాన్ని అనివార్యంగా ముందుకు తీసుకువెళ్ళాలని భారత వ్యోమగామి శుభాంషు శుక్లా అన్నారు. ఇటీవల గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అశోక చక్ర పురస్కారాన్ని స్వీకరించిన గ్రూప్ కెప్టెన్ శుభాంషు శుక్లా బుధవారం బెంగళూరులో పాత్రికేయులతో మాట్లాడుతూ, గగనయాన్ విజయం ద్వారా భారతదేశం కూడా రోదసీ అన్వేషణలో విజయాలు సాధించిన అరుదైన జాబితాలో చేరుతుందని అన్నారు. ప్రపంచంలో ఇప్పటివరకూ మూడు దేశాలు మాత్రమే ఈ విధంగా మానవసహిత కార్యకలాపాలను సొంతంగా నిర్వహించగలిగాయన్నారు. భారతదేశం తలపెట్టిన మొట్టమొదటి మానవసహిత రోదసీ యాత్ర గగనయాన్ కావడంతో ఈ ప్రయోగంపై దేశ ప్రజల్లో భారీ అంచనాలు, ఆశలు ఉన్నాయి. 2027 నాటికి గగన్‌యాన్ ప్రయోగం చేయాలన్నది ఇస్రో సంకల్పం. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2040 నాటికి చంద్రుడి మీదకు యాత్రికులతో వెళ్ళి సురక్షితంగా తిరిగి భూమ్మీదకు రావడాన్ని ఇస్రో ప్రధాన లక్ష్యాలలో ఒకటిగా నిర్దేశించుకుంది. ''గగనయాన్ చాలా సంక్లిష్టమైన సవాళ్ళతో కూడిన సాహసయాత్ర.ఎంత ఆలస్యమైనాగానీ లెక్కచేయకుండా మన ప్రయత్నం మనం చేయాలి, గగన్‌యాన్ దిశగా మన కృషి కొనసాగించాలి, ఇప్పుడున్న ఉత్సాహం తగ్గకుండా ముందుకు తీసుకువెళ్ళాలి, ఈ దిశగా నేను కృషి చేస్తాను, మొదటిరోజున నాకున్న ఉత్సాహాన్ని అదేస్థాయిలో ఇంకా ముందుకు కొనసాగిస్తాను, ఏదో ఒకరోజు మనుషులు రోదసీలోకి అడుగుపెట్టే మొదటిరోజు రావాలి, దానికి చివరిరోజు లేకుండా అలాగే కొనసాగాలి, ఈ యాత్రలో ఉన్న సంక్లిష్టతలను, చిక్కులను నేను అర్థం చేసుకున్నాను, ఈ విధమైన ఎంతో గొప్ప ఆశయ యాత్రలో ఎన్నో సవాళ్ళు కూడా ముడిపడి ఉంటాయి, ఔను, నిశ్చయంగా మనం రోదసీలో మనకు తెలియని ప్రదేశాలకు వెళ్ళాలి, దానిని పూర్తిచేయాలి'' అన్నారు. భారత్–అమెరికా ఉమ్మడి కార్యక్రమం గురించి ప్రస్తావిస్తూ, యాగ్జియం మిషన్ అనేది అంతర్జాతీయ సహకారానికి ఒక పెద్ద ఉదాహరణ అన్నారు. గగనయాన్‌లో వ్యోమగామిగా ఎంపికైన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ నాయర్ మాట్లాడుతూ ఓపికగా ఎదురుచూడాలని, ప్రతీదీ జరుగుతుందని, అన్ని లక్ష్యాలూ నెరవేరతాయని అన్నారు. భారతదేశం గగనయాన్‌లో విజయం సాధిస్తే ప్రపంచంలో ఈ యాత్రలు చేసిన నాలుగోదేశంగా జాబితాలో చేరుతుందని అన్నారు.

# ఆరోగ్య కారణాల వల్ల... 'వాంగ్‌చుక్ విడుదల' సాధ్యం కాదు

## 'సుప్రీంకోర్టు'కు కేంద్రం స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను నిర్బంధించినప్పటి నుంచి ఇప్పటివరకు 24సార్లు వైద్యపరీక్షలు నిర్వహించామని , ఆయన 'ఫిట్', 'హెల్దీ', 'హార్టీ' గా ఉన్నారని, ఇందులో ఆందోళన కలిగించేది ఏదీ లేదని కేంద్రం బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పి.బి.వరాలే ద్విసభ్య ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విషయాన్ని వెల్లడించారు. వాగ్‌చుక్ నిర్బంధ ఉత్తర్వులు జారీచేయబడిన కారణాలు కొనసాగుతున్నాయని, వాంగ్‌చుక్ ఆరోగ్య కారణాల వల్ల ఆయనను విడుదల చేయడం సాధ్యం కాదని సొలిసిటర్ జనరల్ స్పష్టంచేశారు. వాంగ్‌చుక్ విషయంలో మేం ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేమని ఆయన బెంచ్‌కు తెలియజేశారు. విచారణ సందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజన్ తన సమర్పణలో హింసాత్మక నిరసనలలో వాంగ్‌చుక్ రెచ్చగొట్టే వ్యక్తి అని, నేపాల్, అరబ్ వసంతాన్ని ఉదాహరణలుగా చూపిస్తూ యువతను రెచ్చగొడుతుండే వాడని ధర్మాసనానికి వివరించారు. వాంగ్‌చుక్ నేపాల్ హింసాత్మక ఆందోళనను ప్రస్తావించారని, భారతదేశంలో కూడా అదే జరగవచ్చని నటరాజాన్ అన్నారు.'అతను ఎక్కడ అలా అన్నాడు?. యువకులు దానిని తీసుకున్నారని అతను చెబుతున్నాడు. ఆయన స్వయంగా ఆశ్చర్యపోయాడు'. 'ఆ ప్రకటనను ఊహించాల్సి ఉంది'అని అదనపు సొలిసిటర్ జనరల్ నటరాజన్ సమాధానమిచ్చారు. 'దయచేసి తదుపరి విషయానికి రండి. లద్దాఖ్‌లో సాయుధ దళాల మోహరింపు దురదృష్టకరమని ఆయన అంటున్నారు. శాంతియుత పద్ధతులు ప్రభావవంతంగా లేవని యువత అంటున్నారు' అని నటరాజన్ చెప్పారు. 'యువత అంటే అదే అని ఆయన చెబుతున్నారు. పూర్తి వాక్యాన్ని చదవండి. హింసాత్మక పద్ధతి సరైన మార్గం కాదని ఎవరైనా వ్యక్తపరిస్తే అది సరైనది కాదని ఆయన చెబుతున్నారు. అది ఎక్కువగా చదివినట్లు అవుతుంది.' ధర్మాసనం గమనించింది. జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) 1980 కింద వాంగ్‌చుక్‌ను నిర్బంధించడం చట్టవిరుద్ధమని ప్రకటించాలని కోరుతూ వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి అంగ్మో దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. గత ఏడాది సెప్టెంబరు 24న లేహ్‌లో జరిగిన దురదృష్టకర హింసాత్మక సంఘటనలను వాంగ్‌చుక్ చర్యలు లేదా ప్రకటనలకు ఏవిధంగానూ ఆపాదించలేమని ఆంగ్మో అన్నారు. తన సామాజిక మీడియా హ్యాండిల్స్ ద్వారా హింసను వాంగ్‌చుక్ స్వయంగా ఖండించారని, లద్దాఖ్ 'తపస్య', 5 సంవత్సరాల శాంతియుత ప్రయత్నం వైఫల్యానికి దారితీస్తుందని స్పష్టంగా చెప్పారని వెల్లడించారు. ఆంగ్మో మాట్లాడుతూ ఇది తన జీవితంలో అత్యంత విచారకరమైన రోజు అని అన్నారు.

# డిఎంకె, కాంగ్రెస్ మధ్య పొత్తు చెక్కుచెదరలేదు

## రెండు పార్టీల మధ్య చీలికలను ఖండించిన సిఎం స్టాలిన్



**చెన్నై :** డిఎంకె, కాంగ్రెస్ మధ్య పొత్తు చెక్కుచెదరకుండా ఉందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ స్పష్టం చేశారు. రెండు పార్టీల మధ్య చీలికలు ఉన్నాయనే వార్తలను ఆయన తోసిపుచ్చారు. తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడే అవకాశాన్ని కూడా ఆయన తిరస్కరించారు. కాంగ్రెస్ పార్టీకి తలుపులు మూసేశారని, ఆ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొంటుండగా, స్టాలన్ దానిపై స్పష్టత ఇచ్చారు. ఎటువంటి గందరగోళం లేదని డిఎంకె చీఫ్ అన్నారు. ప్రభుత్వంలో అధికారాన్ని పంచుకోవడం తమిళనాడుకు షూట్ కాదని, ఆ విషయం కాంగ్రెస్‌కు కూడా బాగా తెలుసు అని అన్నారు. కొంతమంది కూటమిలో చీలిక తీసుకురావడానికే అధికారాన్ని పంచుకునే అంశాన్ని రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఆ వ్యూహం పనిచేయదని బుధవారం చెన్నైలో జరిగిన ఇండియా టుడే రౌండ్ టేబుల్ సమావేశంలో పేర్కొన్నారు. 'కూటమిలో గందరగోళం ఉందనే పుకార్లు ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చెందుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా, నేను (కాంగ్రెస్ నాయకుడు) రాహుల్ గాంధీని సోదరుడిగా చూస్తాను. ఆయన నన్ను కూడా అలాగే చూస్తాడు' అని స్టాలిన్ అన్నారు. డిఎంకె–కాంగ్రెస్ కూటమి సామరస్యంగా ఉందని, ఇతరులు ఆశించేది (విభజన) జరగదు అని ఆయన అన్నారు. సీట్ల పంపకాల చర్చలపై కాంగ్రెస్ పార్టీ ఆలస్యం వ్యక్తం చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి వ్యాఖ్య ప్రాముఖ్యతను సంతరించుకుంది. మంగళవారం, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఏఐసిసి ఇన్‌చార్జ్ గిరీష్ చోడంకర్ సీట్ల పంపకాల కమిటీని ఏర్పాటు చేయడంలో డిఎంకె జాప్యం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 22 నుండి చర్చలు ప్రారంభించడానికి ఒక ప్యానెల్ ఏర్పాటు చేయనున్నట్లు డిఎంకె ప్రకటించింది. అధికార పంపకాలపై కాంగ్రెస్ ఎంపిలు మాణికం ఠాగూర్, జోతిమణి, మధురై డిఎంకె నాయకుడు జి. దళపతి మధ్య మాటల యుద్ధం తర్వాత డిఎంకె – కాంగ్రెస్ కూటమిపై విస్తృతమైన ఊహాగానాలు చెలరేగాయి. ఈనెల 10న, డిఎంకె మంత్రి ఆర్ఎస్ రాజకన్నప్పన్ మాట్లాడుతూ 'కాంగ్రెస్‌లో ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులు ఇబ్బంది పెడతారు. మనం ఇలా చెబితే, వారు కోపంగా ఉంటారు. వారు కూటమిలో భాగం. వారు కొనసాగాలనుకుంటే, వారు కొనసాగనివ్వండి. వారు కూటమిలో ఉన్నారా లేదా అనేది తలైవర్ (స్టాలిన్) ఇష్టం. ద్రావిడ ఉద్యమాన్ని ఓడించడానికి, ఒకరు ఇంకా పుట్టాలి' అని ఆయన అన్నారు. 'కలైంజర్ (డిఎంకె జాతిపిత ఎం కరుణానిధి) 100–111 సీట్లు గెలిచినప్పుడు కూడా ఆయన ప్రభుత్వంలో వాటా ఇచ్చారా' అని ఆయన అడిగారు.డిఎంకె 150 సీట్లు గెలుచుకునే అవకాశం ఉన్నప్పుడు, (ఒక వాటా) ఎలా ఇవ్వగలమని, వ్యక్తిగత సామర్థ్యంలో దళపతి (ఎం కె స్టాలిన్) మాత్రమే ప్రభుత్వాన్ని నడిపిస్తారన్నారు. ఇదిలా ఉండగా, ఈ ఇంటరాక్టివ్ సెషన్‌లో, తమిళనాడులో రాబోయే ఎన్నికలు డిఎంకె విజయం సాధించడానికి 2021 అసెంబ్లీ ఎన్నికల కంటే కష్టం కాదని స్టాలిన్ అన్నారు. కేంద్రంపై విమర్శలు గుప్పిస్తూ, తమిళనాడులో బిజెపి ఫాసిజం ఎప్పటికీ గెలవదని అన్నారు. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తమిళనాడుకు ఇచ్చింది సున్నా' అని అన్నారు. ఈ ఎన్నికల్లో బిజెపికి వచ్చేది కూడా సున్నా (తమిళనాడు ఎన్నికల్లో సీట్లు) అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని పథకాలను కేంద్రం అనుసరిస్తోందని స్టాలిన్ అన్నారు. 'తోజి' హాస్టళ్ల పథకాన్ని ఎత్తి చూపారు.

# ముంబయి మేయర్‌గా రితూ తావ్డే

## డిప్యూటీ మేయర్‌గా సంజయ్ ఘాడీ ఎన్నిక



**న్యూఢిల్లీ :** ముంబయి మేయర్ పీఠం విషయంలో కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. నగర (బృహన్ ముంబయి కార్పొరేషన్) మేయర్‌గా బిజెపికి చెందిన రితూ తావ్డే, డిప్యూటీ మేయర్‌గా శివసేన (షిండే) వర్గానికి చెందిన సంజయ్ ఘాడీ ఎన్నికయ్యారు. బుధవారం ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే, ఏకగ్రీవంగా ఇద్దరినీ ఎన్నుకున్నారు. దీంతో 25 ఏళ్లపాటు థాక్రే ఆధ్వర్యంలోని శివసేన చేతిలో ఉన్న ముంబయి మేయర్ పదవి ఇప్పుడు బిజెపి పరమైంది. రితూ తావ్డే మూడుసార్లు కార్పొరేటర్‌గా గెలిచారు. ఆమె ఘట్‌కోపర్ (132వ వార్డు) స్థానం నుంచి ఇటీవల గెలిచారు. గతంలో బిఎంసికి చెందిన ఎడ్యుకేషన్ కమిటీ చైర్‌పర్సన్‌గా పని చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. తర్వాత 2012లో బిజెపిలో చేరారు. బిఎంసిలో జరిగిన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికకు మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ లిఎం ఏక్‌నాథ్ షిండే హాజరయ్యారు. రితూ, సంజయ్ ఎన్నికపై వారు హర్షం వ్యక్తం చేశారు. వారి నాయకత్వంలో ముంబయి అభివృద్ధి చెందుతుందని, ప్రతి ముంబైకర్ ఆశల్ని నిజం చేస్తారని ఫడ్నవీస్ అన్నారు. రితూ తావ్డే బిజెపి తరఫున ముంబయికి ఎన్నికైన రెండో మేయర్. చివరగా 1982–83 కాలంలో ప్రభాకర్ పాయ్ మేయర్‌గా పని చేశారు. డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సంజయ్ ఘాడీ 15 నెలలు మాత్రమే ఈ పదవిలో కొనసాగుతారు. ఆ తర్వాత శివసేన (షిండే)కు చెందిన ఇతరులకు అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. సంజయ్ ఘాడీ ఐదో వార్డు అయిన మగథానే నుంచి శివసేన తరఫున 15,000 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అంతకుముందు ఆయన థాక్రే వర్గంలో ఉండేవారు. ఎన్నికలకు ముందు షిండే వర్గంలో చేరి, గెలిచారు.

# ఒప్పందం కాదు.... అమెరికా దోపిడీ

## భారత్-యూఎస్ ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ విమర్శలు




**న్యూఢిల్లీ :** భారత్ – అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఈ ఒప్పందం డీల్ కాదు, దోపిడీ అని పేర్కొంటూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై పదునైన విమర్శలు గుప్పించింది. ఈ ఒప్పందం అమెరికాకు లాభదాయకంగా, భారత్‌కు నష్టం కలిగించేలా ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఇది మన రాజకీయ గౌరవం, ఆర్థిక దౌత్యం వైఫల్యాన్ని ప్రతిబింబిస్తుందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ప్రధాని మోదీని వ్యతిరేకించని స్వతంత్ర విశ్లేషకులు కూడా ఈ ఒప్పందాన్ని లొంగుబాటు, అసమాన ఒప్పందం, అమ్ముడుపోవడం, అవమానకరమైన వెనకడుగు అని విమర్శించారు. ప్రధాని మోదీ, ఆయన అబద్ధాల బృందం ఎంత గొప్పగా చెప్పినా, వాస్తవం మాత్రం ఒక్కటే. అది భారత్ నుంచి అమెరికా ఎక్కువ తీసుకుంటుంది. తక్కువ ఇస్తుంది. 2019 సెప్టెంబర్‌లో ట్రంప్ తరఫున ప్రచారం చేయడం సహా, మోదీ ఆయనను తీవ్రంగా మెప్పించే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం రాలేదు. 2025 ఫిబ్రవరిలో తిరిగి ఎన్నికైన వెంటనే ట్రంప్‌ను మొదట అభినందించిన నాయకుల్లో మోదీ ఒకరు' అని జైరాం రమేశ్ అన్నారు.

### వ్యక్తిగత స్నేహం భారత్‌కు ఉపయోగపడలేదు

అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ తన వ్యక్తిగత స్నేహాన్ని బహిరంగంగా ప్రదర్శించినప్పటికీ భారత్‌కు ఎలాంటి ప్రయోజనం దక్కలేదని జైరాం రమేశ్ అన్నారు. 'ట్రంప్ కూడా మోదీ తనకు మంచి స్నేహితుడు అని చెబుతూనే వచ్చారు. కానీ అదే సమయంలో భారత్‌కు పెద్ద దెబ్బలు వేశారు. ఇది మన రాజకీయ, ఆర్థిక దౌత్యానికి ఘోర వైఫల్యం. ఈ ఒప్పందం నిజానికి డీల్ కాదు, దోపిడీ. మోదీకి వాషింగ్టన్‌లో ఉన్న మంచి స్నేహితుడు భారత్‌ను దోచుకున్నారు. ఆయనే 2025 మే 10న ఆపరేషన్ సిందూర్‌ను ఆపేశానని వందసార్లు పేర్కొన్నారు' అని జైరాం రమేశ్ వ్యాఖ్యలు చేశారు.

## సిఆర్‌పిఎఫ్ క్యాంప్‌పై ఉగ్రదాడి కేసు

# యుపి పిటిషన్ విచారణకు 'సుప్రీం' ఓకే



**న్యూఢిల్లీ :** 2007 రాంపూర్ కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాల (సిఆర్‌పిఎఫ్) శిబిరంపై జరిగిన ఉగ్రవాద దాడి కేసులో నలుగురు నిందితులకు మరణశిక్ష, మరొకరికి జీవిత ఖైదు విధించడాన్ని కొట్టివేస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు బుధవారం అంగీకరించింది. 2007 డిసెంబర్ 31 రాత్రి రాంపూర్‌లోని శిబిరం వద్ద జరిగిన దాడిలో 8 మంది సిఆర్‌పిఎఫ్ సిబ్బంది మరణించగా ఐదుగురు గాయపడ్డారు. న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై నిందితులకు నోటీస్ జారీచేసి, 4 వారాల తర్వాతకు విచారణను వాయిదా వేసింది. ఈ ఐదుగురు నిందితుల తరపున న్యాయవాది ఎం.ఎస్. ఖాన్ హాజరయ్యారు. అక్టోబరు 29న హైకోర్టు ఇచ్చిన తీర్పును ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేసింది. ఈ కేసులో నలుగురికి మరణశిక్ష, ఐదుగురికి మరొకరికి జీవిత ఖైదు విధిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. హత్య, ఇతర తీవ్రమైన అభియోగాలపై మొహమ్మద్ షరీఫ్, సబావుద్దీన్, ఇమ్రాన్ షాజాద్, మొహ్మద్ ఫరూఖ్, జంగ్ బహదూర్ ఖాన్‌లను నిర్దోషులుగా ప్రకటించింది. ప్రధాన నేరానికి నిందితులపై సహేతకమైన సందేహానికి మించి కేసును నిరూపించడంలో ప్రాసిక్యూషన్ ఘోరంగా విఫలం అయింది అని ధర్మాసనం పేర్కొంది. అయితే ట్రయల్ కోర్టు జీవితఖైదు విధించిన జంగ్ బహదూర్‌ఖాన్ సహా ఐదుగురిని హైకోర్టు దోషులుగా విధించింది. ఆయుధాల చట్టం సెక్షన్ 25 (1ఎ) కింద నేరానికి పాల్పడినందుకు వారిని దోషులుగా తేలిన హైకోర్టు వారికి 10 సంవత్సరాల కఠిన కారాగారశిక్ష విధించింది. మరింత శిక్షణ పొందిన పోలీసులతో దర్యాప్తు, ప్రాసిక్యూషన్ నిర్వహించబడి ఉంటే ఈ కేసు వేరే ఫలితాన్ని పొంది ఉండేదని భావిస్తున్నామని కేసు ముగించేటప్పుడు హైకోర్టు పేర్కొంది. దర్యాప్తులో లోపం కేసు మూలాల్లోకి వెళ్లి చివరికి నిందితులను నిర్దోషులుగా విడుదల చేయడంలో ముగిసిందని అసంతృప్తిని వ్యక్తంచేసింది.

# విషం కలిపిన లడ్డూలిచ్చి ముగ్గురి హత్య

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో విషం కలిపిన లడ్డూలు ఇచ్చి ముగ్గురిని హత్య చేసిన బాబాను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ నెల ఎనిమిదో తేదీన పీరాగఢి ఫ్లైఓవర్‌పై పార్క్ చేసిన కారులో ముగ్గురు వ్యక్తులు మరణించినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తొలుత ఆత్మహత్యగా అనుమానించారు. కాగా, మతులను ఢిల్లీలోని నంగ్లీ డెయిరీ ప్రాంతానికి చెందిన్ల రణధీర్ (76), బాప్రోలా ప్రాంతానికి చెందిన శివ నరేష్ (42), జహంగీర్‌పురికి చెందిన లక్ష్మీ (40)గా గుర్తించారు. ఆత్మహత్య చేసుకునే అవకాశాన్ని ముగ్గురి కుటుంబాలు తోసిపుచ్చాయి. దీంతో ఈ కేసుపై దర్యాప్తు చేయగా అసలు విషయం బయటపడింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌కు చెందిన బాబా కమ్రుద్దీన్... ఘజియాబాద్ సమీపంలోని లోని ప్రాంతంలో తాంత్రిక కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. 'ధన్‌వర్ష' పూజల ద్వారా రెండు, మూడు రెట్ల డబ్బు లభిస్తుందని నమ్మిస్తూ కొందరు వ్యక్తులను ఆకట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో రెండు నెలల కిందట బాబా కమ్రుద్దీన్‌ను లక్ష్మీ కలిసింది. ఆ తర్వాత శివ నరేష్, రణధీర్‌ను బాబాకు ఆమె పరిచయం చేసింది. ఈ నెల ఏడో తేదీన ఆ ముగ్గురూ లోని ప్రాంతానికి వెళ్లి బాబా కమ్రుద్దీన్‌ను కలిశారు. 'ధన్‌వర్ష' పూజతో డబ్బును రెండుమూడింతలు చేస్తానని అతడు నమ్మించాడు. రూ.రెండు లక్షల నగదు, మద్యం, కూల్ డ్రింక్ తీసుకురావాలని చెప్పాడు. దీంతో ఎనిమిదో తేదీన ఆ ముగ్గురు మరోసారి కారులో బాబా వద్దకు వెళ్లారు. అయితే 'ధన్‌వర్ష' పూజ తర్వాత వారితో కలిసి కారులో బాబా కమ్రుద్దీన్ ప్రయాణించాడు. విషం కలిపిన లడ్డూలు, మూడు మద్యం బాటిల్స్, కూల్ డ్రింక్స్ బాటిల్స్ వారికి ఇచ్చాడు. ఆ లడ్డూలు తిని, డ్రింక్ తాగిన తర్వాత ఆ ముగ్గురు స్పృహ కోల్పోయారు. కమ్రుద్దీన్ వారి వద్ద ఉన్న రూ.రెండు లక్షలు తీసుకుని కారు దిగి పారిపోయాడు. మతుల కుటుంబాల సమాచారం, సాంకేతిక ఆధారాలతో బాబాను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# చండీగఢ్ స్కూళ్లకు బాంబు బెదిరింపులు




**చండీగఢ్:** బాంబు బెదిరింపు కాల్స్ బాగా పెరిగాయి. చండీగఢ్‌లోని పలు పాఠశాలలలో బాంబులు పెట్టామంటూ బుధవారం ఉదయం బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులను ఖాళీ చేయించారు. చండీగఢ్‌తో పాటు పక్కనే ఉన్న మొహాలీ ప్రాంతంలో పాఠశాలలో బాంబులు పెట్టామని బెదిరింపులు రావడంతో పాఠశాల సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆ సమాచారాన్ని పోలీసులకు అందించారు. కొన్ని పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పాఠశాలలకు సెలవు ప్రకటించారు. దీంతో పోలీసులు పాఠశాలలకు చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్ బందాలతో పాటు జాగిలాలతో గాలింపు చేపట్టారు. ఇటీవల పాఠశాలలకు బాంబు బెదిరింపులు తరచుగా మారాయి. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపుల కలకలం రేగింది. రాజధాని పరిసర ప్రాంతాల్లోని తొమ్మిది స్కూళ్లలో బాంబులు పెట్టామంటూ అఫ్జల్ గురు జ్ఞాపకార్థం ఢిల్లీని ఖాలిస్థాన్‌గా మార్చబోతున్నామంటూ అందులో ఉంది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆ స్కూళ్లను ఖాళీ చేయించారు. జనవరి 29న రాజధానిలో ఐదు విద్యాలయాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అధికారులు తనిఖీ చేయగా అది బెదిరింపు మెయిల్ అని తేలింది. జనవరి 28న ద్వారకా కోర్టు కాంప్లెక్స్‌లోనూ పేలుడు పదార్థాలు పెట్టామంటూ మెయిల్ రాగా పోలీసులు తనిఖీలు చేపట్టగా... అది అబద్ధమని తేలింది. బెదిరింపు కాల్స్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఆరుగురి దుర్మరణం

**జైపూర్ :** రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో మంగళవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందారు. కల్ఖో గ్రామానికి చెందిన ఆరుగురు స్నేహితులు అభనేరి గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై కారులో తిరిగి వస్తుండగా... డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు అదుపుతప్పి డివైడర్‌పై నుంచి ఎగిరిపడి అటుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతులను అంకిత్, సమరు, లోకేష్, నవీన్, దిల్‌ఖుష్, మనీష్‌లుగా గుర్తించారు.

# నూతన అధికారుల బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** నూతనంగా నియమితులైన అధికారులు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. కోర్ అర్బన్ రీజియన్ వరకు జలమండలి పునర్వ్యవస్థీకరణ చేసిన నేపథ్యంలో కొత్త జాయింట్ ఎండీ, ముగ్గురు అధికారులను ఈడీలుగా ప్రభుత్వం నియమించింది. జీహెచ్ఎంసీ తరహాలోనే జలమండలి కొత్త రూపు సంతరించుకుంది. జలమండలిని కొత్తగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరిలుగా మూడు జోన్లు ఏర్పాటు చేశారు. ఓఆర్ఆర్ వరకు వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఈ ప్రాంతంలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, పౌర సేవలను మెరుగుపరచడం లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం జలమండలి ఈడీగా పని చేస్తున్న మయాంక్ మిట్టల్‌ను జాయింట్ ఎండీగా నియమించిన ప్రభుత్వం.. కొత్త విభజన ప్రకారం మల్కాజిగిరి జోన్‌కి పంకజ, హైదరాబాద్ జోన్‌కి స్వామ్రాట్ అశోక్, సైబరాబాద్ జోన్‌కి సంతోష్‌లను నియమిస్తున్నట్లు గురువారం ఉత్వర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జలమండలిలో జాయింట్ ఎండీగా పదోన్నతి పొందిన మయాంక్ మిట్టల్ గురువారం ఖైరతాబాద్లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరితో పాటు ప్రభుత్వం ముగ్గురు ఈడీలు పంకజ, స్వామ్రాట్ అశోక్, సంతోష్ సైతం ఆయా జోన్లలో బాధ్యతలు స్వీకరించారు.ఇదిలాఉండగా నూతన బాధ్యతలు చేపట్టిన అధికారులు జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎండీ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా 'సెయింట్ ఫ్రాన్సిస్'లో మీడియాస్పియర్

**ప్రజాపక్షం/సోమాజిగూడ:** హైదరాబాద్ బేగంపేట్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీ ఫర్ ఉమెన్ మాస్ కమ్యూనికేషన్, జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో ''మీడియాస్ఫియర్ –2026' అంతర్ కళాశాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సారి ''భారత భాషలు''అనే థీమ్‌తో ఉత్సవం జరిగింది. ఈ ఉత్సవ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సినీనటుడు, రచయిత, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ హాజరై, మాట్లాడారు. రానున్న కాలంలో మీడియా నిపుణులుగా విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళా, సినీకృతులను అనేక భాషల్లో చూడాలని, తమ దృష్టిని విస్తరించుకోవాలని సూచించారు.నాలుగో స్థంభం సభ్యులుగా బాధ్యాతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో, భావన్స్, సెయింట్ జోసెఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
గురువారం
12-02-2026
www.prajapaksham.in

# ఎడిట్
PEOPLE'S VIEWS

## బంగ్లాదేశ్‌కు పరీక్షా సమయం

స్వతంత్ర బంగ్లాదేశ్ అనూహ్యమైన పరిణామాల మధ్య తన భవిష్యత్తును పునర్నిర్మించుకోవలసిన స్థితిలో చౌరస్తాలో నిలబడి ఉంది. చరిత్ర నిర్మాతలు ప్రజలే కాబట్టి ఏది సరైన మార్గమో ఎంచుకోవలసిన బాధ్యత, భారం వారిపైనే ఉంది. ఈ రోజు(గురువారం) జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు ఇచ్చే తీర్పు తమ దేశ భవిష్యత్ గమనాన్ని నిర్దేశిస్తుంది. ఈ బెంగాలీ ముస్లిం దేశం ఉదారవాద లౌకిక రాజ్యంగా కొనసాగుతుందా? ఇస్లామిక్ ఛాందసవాదం వైపు మొగ్గుతుందా? లేక మధ్యేమార్గం అనుసరిస్తుందా? పొరుగుదేశమైన భారత్‌తో శాంతి-స్నేహ-సహకార సంబంధాల కొనసాగింపును ఎంచుకుంటుందా? లేక ఐదున్నర దశాబ్దాల క్రితం తమ భాష, సంస్కృతుల అణచివేతను వ్యతిరేకించి పాకిస్తాన్‌పై తిరుగుబాటు చేసి భారతదేశ సహాయ సహకారాలతో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం పొందిందో, ఆ మత ఛాందస, సైనిక నిరంకుశ పాలకులవైపు మొగ్గుతుందా?

ఆనాటి తూర్పు పాకిస్తాన్ బంగ్లాదేశ్‌గా అవతరించిన నాటినుంచి ప్రజాస్వామ్యం, సైనిక నియంతృత్వం మధ్య, మతతత్వవాద-లౌకికవాదం మధ్య సంఘర్షణ జరుగుతూనే వస్తున్నది. అవామీలీగ్ నాయకురాలు హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా 2004 ఆగస్టులో జన్-జడ్ పేరుతో విద్యార్థులు, యువకులు తిరుగుబాటు చేసి హింసాత్మకత్వాలకు పాల్పడటంతో, ప్రధాని హసీనా సైనికాధికారుల సలహాపై రాజీనామా చేసి భారత్‌లో తలదాచుకున్నారు. తర్వాత మహమ్మద్ యూనస్ ముఖ్య సలహాదారుగా ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం ఎట్టకేలకు సార్వత్రిక ఎన్నికలకు ఉత్తర్వు చేసింది. అయితే ఆనాటి అల్లర్లలో పలువురు మృతిచెందిన పోలీసు కాల్పులకు హసీనాను బాధ్యురాలిని చేసి కేసులు మోపి ఆమె పరోక్షంలో ప్రత్యేక కోర్టుల్లో విచారణ జరిపి మరణశిక్ష సహా పలు శిక్షలు విధించారు. అంతేకాదు, ప్రజాస్వామ్య పునరుద్ధరణ పేరుతో ఎన్నికలు జరుపుతూ ఆమె పార్టీ అవామీలీగ్‌ను పాల్గొనే అవకాశం నిరాకరించారు. ఆమె పరిపాలనాకాలంలో మంచిచెడులపై తీర్పు చెప్పే అవకాశం ప్రజలకు ఇవ్వకుండా పాలక ముఠాయే అవామీలీగ్‌ను నిషేధించింది. 25-30శాతం ఓట్ల మద్దతున్నట్లు భావించబడుతున్న ఆ జాతీయోద్యమ పార్టీని నిషేధించి నిర్వహించే ఎన్నికలు నిజమైన ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయా? అంతేగాక జులై చార్టర్‌పై రెఫరెండం అంటూ దానిని ప్రజల ఓటుకు పెట్టారు. కొన్ని రాజ్యాంగ సవరణలు ఆదేశిస్తున్న ఆ చార్టర్‌పై జనాదేశంలేని పాలక ముఠా రెఫరెండం నిర్వహించి, రానున్న ప్రభుత్వం కాళ్లకు ముందే బంధనాలు వేస్తున్నది.

అదలావుంచితే, జన్-జడ్ విధ్వంసాలు అరాచక కృత్యాలుగా రుజువయ్యాయి. సోషల్ మీడియా ద్వారా పాలపొంగులా ఉబికిన ఉద్యమకారులు చుక్కాని లేని నావ అయినారు. వారు ఎన్‌సిపి పేరుతో ఒక రాజకీయ పార్టీగా ఏర్పడినప్పటికీ ఆదరణ కరవైంది. మతఛాందస జమాత్ ఇస్లామీపై యూనస్ ప్రభుత్వం నిషేధం ఎత్తివేయటంతో తొండముదిరి ఊసరవెల్లి అయినట్లు అది ప్రభావవంతంగా ఎదిగింది. అన్ని యూనివర్శిటీ ఎన్నికల్లో దాని అభ్యర్థులు ఎన్‌సిపిని ఓడించారు. ఎన్‌సిపి నాయకులు విధిలేని పరిస్థితుల్లో సార్వత్రిక ఎన్నికలకు జమాత్‌తో అలయెన్స్ పెట్టుకున్నారు. జమాత్ 228 సీట్లకు పోటీచేస్తూ ఎన్‌సిపికి 30 సీట్లు కేటాయించింది. నిబద్ధతగల నాయకత్వం, సిద్ధాంతం, నిర్మాణంలేని గాలివాటు ఆందోళనకారులు ఎక్కడైనా అభివృద్ధి నిరోధకులకు సహాయకారి అవుతారు.

అవామీలీగ్‌తో పోటాపోటీగా ఉండే బిఎన్‌పి నాయకురాలు బేగం ఖలీదా జియా మరణంతో ఆమె కుమారుడు తారిఖ్ రెహ్మాన్ లండన్‌లో ప్రవాస జీవితం నుంచి తిరిగి వచ్చి పార్టీ పగ్గాలు చేబట్టారు. మొత్తం 300 సీట్లలో ఆ పార్టీ 272 పోటీచేస్తూ, 28 సీట్లు కూటమి భాగస్వాములకు ఇచ్చింది. ఎన్నికల క్షేత్రం బిఎన్‌పి-జమాత్ మధ్య ద్విముఖ పోటీగా తయారైంది. ఇప్పుడు అవామీ ఓటర్లు ఏమి చేయాలి? అవామీలీగ్-బిఎన్‌పి ప్రధాన రాజకీయ ప్రత్యర్థులు. అయితే అవామీ స్థానిక నాయకులు ముఖ్యంగా మూడు జిల్లాల్లో బిఎన్‌పి అభ్యర్థులకు ఓటు వేయాలని నిర్ణయించారు. ఇది బిఎన్‌పికి అనుకూలమైన మలుపు తిప్పుతుందని భావించబడుతున్నది. ప్రస్తుతం 60 నియోజకవర్గాలకు పరిమితమైన అవామీ తోడ్పాటు మిగతా జిల్లాలకు విస్తరిస్తుందేమో చూడాలి.

మన ప్రభుత్వానిది గడసామి. నోరుతెరిచి ఎవరినీ బలపరచలేని స్థితి. ఒక్క బిఎన్‌పి మాత్రమే — పోటీలో ఉన్న పార్టీల్లో మన దేశంపట్ల కొంత సానుకూలత ఉన్న పార్టీ. బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా ఉన్న హిందువుల భద్రత పట్ల ఆందోళనతోనే సంబంధాలు చక్కబడవు. అదొక ప్రధాన కర్తవ్యమే. కాని ఇరు దేశాల సంబంధాల్లో ఉన్న చిక్కులన్నిటినీ చాకచక్యంతో పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలి. అందువల్ల ఎన్నికల ఫలితాల కోసం, ఆత్రుత, ఆసక్తితో ఎదురుచూదాం!



### నన్ను మళ్లీ ఇలా అడగకండి

ముఖ్యమంత్రి పదవి కోసం నాకు, డిప్యూటీ సిఎం శివకుమార్‌కు మధ్య పోరు నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విదేశీ పర్యటనలకు ప్లాన్ చేసుకుంటున్నారన్న విషయం నాకు తెలియదు. బహుశా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వారి సొంత డబ్బు వెచ్చించి వ్యక్తిగతంగా విదేశాలకు వెళుతుండొచ్చు. నాయకత్వం అంశంపై నేను, శివకుమార్ ఇద్దరం కూడా కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందే. మీరు (మీడియా) నాయకత్వ మార్పు అంశం తప్ప నన్ను వేరే ఏమీ అడగలేరా? దయచేసి నన్ను మళ్లీ ఇలా అడగకండి.

- కర్ణాటక సిఎం సిద్ధరామయ్య



## స్వయం కృషిని నమ్మిన బహుముఖ ప్రజ్ఞాశాలి అబ్రహాం లింకన్

12 ఫిబ్రవరి 1809 రోజు కెంటకీ ప్రాంతంలో థామస్ లింకన్ నాన్సీ దంపతులకు పేద కుటుంబంలో జన్మించిన అబ్రహాం లింకన్ తన చిన్నతనంలోనే తల్లిని కోల్పోయారు. సవతి తల్లి ప్రేరణతో పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నారు. పాఠశాల విద్య కన్న స్వంతంగా చదువుకొని విజ్ఞానాన్ని సమపార్జించారు. తండ్రి వ్యవసాయ పనుల్లో నిమగ్నం కాగా లింకన్ మాత్రం పుస్తకాలు చదవడం మాత్రమే ఇష్ట పడ్డారు. న్యాయవాది, పరిపాలనాదక్షత కలిగిన మహా నాయకుడు, మేధావి, అద్భుత వక్త, సాధారణ జీవన విధానం గడిపిన వీరుడు లాంటి విలక్షణ లక్షణాలు కలిగి ప్రపంచ చరిత్రలో చెరగని ముద్రను వేయగలిగారు. ఇల్లినాయిస్ రాష్ట్ర శాసనసభసభ్యుడిగా, అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడిగా సేవలు అందించి1860లో అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికైనారు. 1861–1865 మధ్య అమెరికా 16వ అధ్యక్షుడిగా దేశ సమైక్యతను కాపాడటంలో కృతకృత్యులు అయ్యారు. 1863లో బానిసత్వాన్ని రద్దుచేసి చరిత్రలో నిలిచి పోయారు. 1863లో ఎమాన్సిపేషన్ ప్రోక్లమేషన్ ద్వారా బాలికలకు స్వేచ్ఛను ప్రసాదించారు. గెట్టిస్ బర్గ్ ప్రసంగం, తన కుమారుడి ఉపాధ్యాయుడికి లేఖ ద్వారా అత్యంత ప్రసిద్ధి పొందారు. తను చూపిన నిజాయితీ కారణంగా ఆయన హానెస్ట్ ఏబ్‌గా కీర్తించబడ్డారు.

**తన కుమారుడి ఉపాధ్యాయుడికి అబ్రహాం లింకన్ రాసిన లేఖ:**

అబ్రహాం లింకన్ అనగానే అతను తన కుమారుడి ఉపాధ్యాయుడికి రాసిన ప్రఖ్యాత లేఖ గుర్తుకు వస్తుంది. ఈ లేఖ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పౌర సమాజం నేర్చుకోవలసిన అవసరం ఎంతో ఉన్నది. నైతిక విలువలు, నిజాయితీ, సామాజిక స్పృహ లాంటి గుణాల ప్రాధాన్యాన్ని ప్రస్తుతించారు. లేఖ సారాంశాల్లో కొన్ని ముఖ్య వాక్యాలు మనకు నిత్య ప్రేరణగా నిలుస్తున్నాయి. ప్రతి శత్రువుకు ఒక మిత్రుడు ఉంటాడు. ప్రతి స్వార్థ రాజకీయ నాయకుడికి ఎదురుగా అంకితభావం కలిగిన మహోన్నత నాయకుడు కూడా ఉంటాడని పేర్కొన్నారు. ప్రపంచంలో అందరూ న్యాయవంతులు, నిజాయితీ పరులు కాదని పేర్కొన్నారు. ప్రతి ద్రోహి అంతానికి ఒక వీరుడు ఉద్యమిస్తాడని పేర్కొన్నారు. పుస్తకాల విజ్ఞానంతో పాటు ప్రకృతి, పక్షులు, జీవుల గురించి నేర్పాలని సూచించారు. స్వంత ఆలోచనలు నమ్మమని నేర్పాలి. మోసం చేయడం కన్న ఓడిపోవడం మిన్న అని నేర్పమని కోరారు. కష్టాల్లో నవ్వడం, తప్పులను ఎదిరించడం, పుస్తక జ్ఞానంతో పాటు లోక జ్ఞానం నేర్పాలని ఒక తండ్రిగా కోరారు. సున్నితంగా ఉండే వారితో కఠినమైన వారిలో కఠినంగా ఉండడం నేర్పాలని తెలిపారు. అక్రమంగా సంపాదించిన వందల డాలర్ల కన్న న్యాయంగా సంపాదించిన ఒక్క డాలర్ మిన్న అని విద్యార్థులకు నేర్పమని ఉపాధ్యాయులను కోరారు. నాటి అమెరికా అంతర్యుద్ధ సమయంలో అత్యంత కార్యదక్షత ప్రదర్శించిన అబ్రహాం లింకన్ దురదృష్టవశాత్తు అదే సమయంలో 15 ఏప్రిల్ 1865 రోజున తన 56వ ఏట దారుణ హత్యకు గురి అయ్యారు. అమెరికాలో పౌర సమాజ ఐక్యతను సాధించి, బానిసత్వాన్ని రద్దు చేసి, సమానత్వం కోసం ఆరాటపడి, వర్ణ వివక్షను వ్యతిరేకించిన న్యాయవాది అబ్రహాం లింకన్ జీవితం నేటి పౌర సమాజానికి దారి దీపంగా నిలుస్తున్నది.

*(12 ఫిబ్రవరి అబ్రహాం లింకన్ జన్మ దినోత్సవం సందర్భంగా)*


# ధాన్యం పంటకు బోనస్... ఖజానాకు భారమట!

ధాన్య ఉత్పత్తి పెరిగితే దేశానికి భారంగా మారుతుందా? నేరుగా రైతులకే ఎగుమతి అవకాశాలు కల్పిస్తామంటూ కబుర్లు చెప్పిన నరేంద్రమోదీ సర్కార్ అదే చెబుతోంది, రాష్ట్రాలకు లేఖలు రాస్తోంది. అవర్ వరల్డ్ డాటా ప్రకారం మన పక్కనే ఉన్న చైనాలో 2022లో రోజుకు ప్రతి వ్యక్తికి సగటున 3,454 కాలరీల శక్తి నిచ్చే ఆహారాన్ని అందిస్తుండగా నెలకు ఐదు కిలోల ఆహార ధాన్యాలను ఉచితంగా అందిస్తున్న నరేంద్రమోదీ ఏలుబడిలో 2,574 కాలరీలు ఉంది. అయినప్పటికీ ధాన్యం పండించే రైతులకు బోనస్ ఇస్తే ఉత్పత్తి పెరుగుతుందని, అది దేశానికి భారంగా మారుతుందని కేంద్ర ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్ర వైఖరిని ఆదివారం నాడు ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వరి మద్దతు ధరకంటే అదనంగా క్వింటాలుకు కేరళ ప్రభుత్వం రు.631 అందిస్తున్నది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరల కంటే ఎక్కువగా ఇవ్వటాన్ని నిలిపివేయాలని కేంద్ర ఆర్థికశాఖలో ఖర్చుల విభాగ కార్యదర్శి కేరళ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇలా ఇస్తున్న కారణంగా ధాన్య సేకరణ ఖర్చు పెరిగి ప్రభుత్వ ఖజానా మీద వత్తిడిని పెంచుతున్నదని కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన అధికారిక లేఖలో పేర్కొన్నారు. తెలంగాణాలో సన్న రకాలు పండించే వారికి బోనస్ ఇస్తున్న సంగతి తెలిసిందే. కేంద్ర లేఖ ఒక్క కేరళకేనా, అన్ని రాష్ట్రాలకు పంపిందా అన్నది తెలియదు. ఎలాంటి శషభిషలు లేకుండా కార్పొరేట్ కంపెనీలకు వేలాది కోట్ల రూపాయల రుణాలను రద్దు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల ఇలా ఎందుకు వ్యవహరిస్తున్నదని, రైతులకు ఇచ్చే బోనస్‌ను ప్రధాన ఆర్థిక భారంగా ఎందుకు భావిస్తున్నదని పినరయి విజయన్ ప్రశ్నించారు. ఈ లేఖలో వెల్లడించిన అభిప్రాయం వెనుక మనదేశ మార్కెట్‌ను అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు తెరవాలన్న ఆలోచన ఉందా అని కూడా ప్రశ్నించారు. వరి రైతులకు చెల్లించాల్సిన సాయాన్ని సకాలంలో విడుదల చేయటంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వం ఈ లేఖను వెంటనే వెనక్కు తీసుకోవాలని ఎల్‌డిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ టిపి రామకృష్ణన్ డిమాండ్ చేశారు. కేంద్ర వైఖరి ఆహార భద్రత, స్వయం సమృద్ధిని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జనవరి తొమ్మిదవ తేదీన కేంద్ర ప్రభుత్వం రాసిన ఈ లేఖలో గోధుమ, వరి పంటలకు అదనపు ప్రోత్సాహాన్ని నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పప్పు ధాన్యాలు, చమురు గింజలు, చిరుధాన్యాలకు ప్రోత్సాహకాలను అందించాలని పేర్కొన్నారు. కేంద్ర సూచనను తిరస్కరిస్తున్నామని, వరి సాగు విషయంలో రాజీపడేది లేదని వ్యవసాయ శాఖ మంత్రి పి. ప్రసాద్ కేంద్రానికి లేఖ రాశారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగు ప్రోత్సాహకాలను తాము వ్యతిరేకించటం లేదని, వరిని ఫణంగా పెట్టి ఆ పని చేయలేమని, వాటి ఉత్పత్తికి కూడా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు. కేరళ అవసరాలలో కేవలం 21 శాతం మాత్రమే స్థానికంగా బియ్యం ఉత్పత్తి ఉంది, దాన్ని 30శాతానికి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ప్రోత్సాహం అందిస్తున్నది.

కొసమెరుపు ఏమంటే కేంద్రం చర్యతో రైతాంగంలో వ్యక్తమైన వ్యతిరేకతతో రాష్ట్ర బిజెపి బెంబేలెత్తింది. వెంటనే ఆ లేఖను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసినట్లు సోమవారం నాడు వార్త వచ్చింది. అంతవరకైతే అదో దారి, రాష్ట్ర ప్రభుత్వం ధాన్య రైతాంగాన్ని పట్టించుకోవటం లేదని, ముఖ్యంగా ఉత్పాదక ఖర్చు, సేకరణ యంత్రాంగం, మార్కెటింగ్ మద్దతు ఇవ్వటం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా బోనస్ ప్రకటించలేదని కూడా చెప్పారు. కేంద్రం పంపిన లేఖలో పేర్కొన్నట్లు కేరళలో అదనపు ఉత్పత్తిలేదని, కేంద్ర నిల్వలు కూడా అదనంగా లేవని, భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని చెప్పిన అంశాలు కేరళకు వర్తించవని బిజెపి నేత వాపోయారు. ధాన్యం సాగు విస్తీర్ణం తగ్గుతున్నదని, ఇక్కడ ఉన్న ప్రత్యేకతలు, ఆహార భద్రతను పరిగణనలోకి తీసుకోవాలని కూడా పేర్కొన్నారు. ఈ కారణంగానే కేంద్రం ఆర్థికంగా కేరళను ఎన్ని ఇబ్బందులు పెడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వరి సాగును పెంచేందుకు అదనంగా బోనస్ ఇస్తున్నది. దీన్ని సాకుగా చూపి మరిన్ని ఇబ్బందులు పెట్టేందుకే ఆర్థిక శాఖ రాసిన లేఖ అన్నది స్పష్టం. త్వరలో ఎన్నికలు జరగనుండగా ఇలాంటి పనులు చేస్తే వచ్చే ఇబ్బందులను ఊహించి బిజెపి నేత నిర్మలా సీతారామన్‌కు మొరపెట్టుకున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం, బిజెపి కూడా ఇరుకునపడింది. ఇప్పుడు లేఖను వెనక్కు తీసుకున్నా, లేకున్నా బిజెపికే నష్టం.అదొక అసెంబ్లీ ఎన్నికల ప్రచార అస్త్రంగా మారుతుంది.

ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించటం గురించి పరిశీలనకు కేంద్ర ప్రభుత్వం 2022జూలైలో వేసిన కమిటీ ఇంతవరకు ఎలాంటి నివేదిక సమర్పించలేదు, ఏం చేస్తున్నారని కేంద్రం అడగనూ లేదు. రైతుల పట్ల మోదీ ప్రభుత్వ శ్రద్ధకు ఇది చక్కటి తార్కాణం.అమెరికా ఉత్పత్తులకు ఒక్కసారే పూర్తి స్థాయిలో మార్కెట్‌ను తెరిస్తే రైతాంగం నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందన్న భయంతో దశలవారీ చర్యలకు పూనుకున్నట్లు కనిపిస్తోంది. ఎవరినైనా హత్య చేయదలచుకుంటే మెల్లగా పని చేసే విషం ఇవ్వటం తెలిసిందే. అలా ఒక్కొక్కటిగా వెల్లడిస్తే ఈలోగా జనం అలవాటు పడిపోతారన్నది భావన కావచ్చు. మంత్రి పియూష్ గోయల్ స్వయంగా చెప్పినట్లు ఇప్పుడు కుదిరింది ఒక స్వరూప అవగాహన మాత్రమే. ఉదాహరణకు ఇల్లు కట్టేటపుడు ఒక ప్లాన్ గీస్తారు. తరువాత పిల్లర్లు, గోడలు, స్లాబ్ వేస్తారు. ఇంట్లో ఏమేమి ఉండేది తరువాత మాత్రమే బయటివారికి తెలుస్తుంది. అలాంటిదే అమెరికాతో కుదిరిన అవగాహన. తాత్కాలిక ఒప్పందం పేరుతో పశుదాణా అవసరాలకు ఎర్ర జొన్నలు, పలురకాల ధాన్యాలతో చేస్తున్న ఇథనాల్ తయారీలో ఉప ఉత్పత్తిగా తయారయ్యే చెక్కను కూడా కూడా దిగుమతి చేసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి దిగుమతి పన్నులేకుండా అనుమతించింది. ఇప్పటికే పత్తి దిగుమతి పన్ను తగ్గింపుతో క్వింటాలకు వెయ్యి నుంచి రెండువేల వరకు రైతాంగం నష్టపోయింది.ఈ పశుదాణా పేరుతో దిగుమతులు, అందుకోసం మనదేశంలో సాగు చేస్తున్న మొక్కజొన్న, జొన్న, ఇతర పంటల ధరల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. సోయా ఆయిల్ దిగుమతి ఆ పంట పండించే రైతాంగంతో పాటు పామాయిల్, నూనె గింజల సాగుమీద ఎలాంటి ప్రతికూల ప్రభావం పడనుందో అధ్యయనం చేయాల్సి ఉంది. యాపిల్ పండ్ల దిగుమతులు కాశ్మీర్, హిమచల్ ప్రదేశ్ ఇతర ప్రాంతాల్లోని రైతాంగానికి గొడ్డలి పెట్టని యాపిల్ సాగుదార్ల అఖిల భారత సంఘ అధ్యక్షుడు, సిపిఐ(ఎం) నేత మహమ్మద్ యూసుఫ్ తారిగామి పేర్కొన్నారు.



అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం గనుక ఆందోళన చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, దాన్నుంచి విడిపోయిన వారితో సహా అనేక రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. దేశ వ్యవసాయ రంగాన్ని అమెరికన్ కార్పొరేట్లకు పూర్తిగా అప్పగించేశారని పేర్కొన్నాయి. వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై ఎలాంటి పన్నులు ఉండవని, మనం ఎగుమతి చేసే వాటిపై 18శాతం పన్ను విధిస్తామని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా, ఐరోపా యూనియన్ దేశాల ఆర్థిక వ్యవస్థలు గిడసబారిన స్థితిలో ఉన్నందున చేసుకొనే ఒప్పందాలు వాటికి ఉపయోగం తప్ప భారత్‌కు మేలు చేయవని అనేకమంది చేస్తున్న ఆందోళనను కేంద్రం పట్టించుకోవటం లేదు. ఈనెల పన్నెండున లేబర్ కోడ్‌లు, ఇతర కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాపిత సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే, వారికి మద్దతుగా, రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా ఆ రోజున రైతాంగం కూడా పాల్గొనాలని రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. ఆ రోజున ట్రంప్, మోదీ దిష్టి బొమ్మలను దగ్ధం చేయాలని కోరాయి. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర) ఒక ప్రకటన చేస్తూ త్వరలో సమావేశం జరిపి, అమెరికాతో ఒప్పందానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలకు పిలుపునిస్తామని పేర్కొన్నది. ప్రతిపక్షాలు, రైతు సంఘాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వ్యవసాయానికి ఎలాంటి ముప్పు ఉండదని పియూష్ గోయల్ చెప్పుకున్నారు. వాణిజ్య ఒప్పందం గురించి 2025 ఫిబ్రవరి 13న డోనాల్డ్ ట్రంప్ నరేంద్రమోదీ చర్చలకు శ్రీకారం చుట్టారు.

రెండు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక ఒప్పందంలోని అంశాలు ఇలా ఉన్నాయి. అమెరికా పారిశ్రామిక వస్తువులు, పలు ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై పన్నులను భారత్ పూర్తిగా ఎత్తివేయటం లేదా తగ్గించటం చేస్తుం ది. వాటిలో పశుదాణా అవసరాల కోసం డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్(పైన చెప్పుకున్న ఇథనాల్ ఉప ఉత్పత్తులు), ఎర్ర జొన్నలు, ట్రీ నట్స్, తాజా మరియు ప్రోసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, ఆల్కహాల్ మరియు అదనపు ఉత్పత్తులు. దీనికి ప్రతిగా ఏప్రిల్ రెండవ తేదీన జారీ చేసిన ఆదేశాల ప్రకారం భారత ఉత్పత్తులపై 18శాతం పన్నులు విధిస్తారు. వాటిలో వస్త్రాలు, దుస్తులు, తోలు వస్తువులు, చెప్పులు, ప్లాస్టిక్ మరియు రబ్బరు, ఆర్గానిక్ రసాయనాలు, గృహ అలంకరణ వస్తువులు, కళా ఉత్పత్తులు, కొన్ని యంత్రాలు ఉన్నా యి. జనరిక్ ఔషధాలు, వజ్ర వైఢూర్యాలు, విమానాల విడిభాగాల మీద పన్నులను రద్దుచేస్తారు. అమెరికా జాతీయ భద్రతకు ముప్పుగా భావించి గతంలో పన్నులు విధించిన భారత విమానాల విడిభాగాలు, అల్యూమినియం, ఉక్కు, రాగి, వాహన ఉత్పత్తులపై రాయితీలు, కోటాలను అమలు చేస్తారు.

రానున్న ఐదు సంవత్సరాల్లో అమెరికా నుంచి ఇంధన ఉత్పత్తులు, విమానాలు, విమాన విడి భాగాలు, వంట బొగ్గు, విలువైన లోహాలు, సాంకేతిక ఉత్పతులను 500 బిలియన్ డాలర్ల మేర కొనుగోలు చేయాలనుందని భారత్ చెప్పింది. ఈ ఒప్పందంలో భారత్ నుంచి అమెరికా ఏ వస్తువులను, ఎంత మొత్తంలో కొనుగోలు చేసేందు కు అంగీకరించిందీ లేదా వాంఛిస్తున్నదీ వివరాలు లేవు. ఈ కారణంగానే దీన్ని ఖరారుచేసే నాటికి వాటిలో ఎన్ని చేరుస్తారో ఏమిటో జనాల కు అంతుబట్టటం లేదు గనుకనే అనేక అనుమానాలు తలెత్తాయి. ఇది అమెరికాకు అనుకూలంగా ఉందనే అభిప్రాయం రావటానికి అనేక అంశాలు దోహదం చేస్తున్నాయి. మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది, ఒప్పందంపై సంతకాల తరువాత అవి వెల్లడౌతాయి!

**ఎంకెఆర్**

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం : సార్వభౌమత్వ నిర్ణయాలపై నీలినీడలు



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
98493284967

భారత ప్రధాని నరేంద్ర మోడీ,అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య ఇటీవల కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశంలో ఆర్థిక, రాజకీయ, విదేశాంగ విధానాల సార్వభౌమత్వం గురించిన తీవ్ర చర్చలను రేకెత్తిస్తోంది. ఈ ఒప్పందం కేవలం వర్తక, వాణిజ్య, టారిఫ్ శాతాల మాట కాకుండా, భారతదేశం ఎలాంటి షరతులపై ఇతర దేశాలతో చర్చలను నిర్వహిస్తుంది? మన దేశ దీర్ఘకాలిక సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక జాతీయ ప్రయోజనాలను ఎలా నిర్వచిస్తుంది? అనే ప్రాథమిక ప్రశ్నలను ఎత్తి పట్టింది. ప్రధానంగా రెండు వైపులా ప్రతిపక్షాలు, విశ్లేషకులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలో ప్రధాన అంశం... ఈ ఒప్పందంలో స్పష్టమైన పారదర్శకత లేకపోవడం, ఈ విషయాన్ని మరింత సంక్లిష్టతరం చేస్తున్నాయి.

ఒప్పందం యొక్క అంతర్లీన వివరాలు ఇంకా పూర్తిగా బహిర్గతం కాలేదు. అయినప్పటికీ, ఇప్పటికే బహిర్గతమైన సమాచారం ప్రకారం రెండు నాయకుల వ్యాఖ్యల ఆధారంగా, ఇది ఒక సంప్రదాయ వాణిజ్య ఒప్పందం కంటే ఒక ప్రకటన లేదా 'అవగాహనా పత్రం' లాగా కనిపిస్తుంది. ప్రధాన ఆందోళనలలో ఒకటి, భారత ఉత్పత్తులపై (ముఖ్యంగా స్టీల్, అల్యూమినియంపై) అమెరికా విధించిన 18 శాతం టారిఫ్‌ను తొలగించడానికి బదులుగా, దానిని మాత్రమే సవరించడం జరిగిందనే విషయం. మోడీ ప్రభుత్వం వచ్చేసరికి ఈ టారిఫ్ కేవలం 2.93 శాతం మాత్రమే ఉండేది. దీనర్థం, కొత్త ఒప్పందం భారతదేశం ఇప్పటికే ఎదుర్కొంటున్న అన్ని టారిఫ్ అడ్డంకులను తొలగించలేదు. అయితే ఆ వ్యాపార సంబంధాలను ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది.

ఈ సందర్భంలో, బీజేపీ నేతలు ముఖ్యంగా వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంపై టారిఫ్ తక్కువగా ఉందని వాదించడం విడ్డూరంగా ఉంది. విమర్శకుల ప్రకారం, అసంపూర్తిగా ఉంది. ఉదాహరణకు, బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి దేశాలు అమెరికా నుండి ప్రత్యేక రాయితీలు (జీ.ఎస్.పీ) పొందుతున్నాయి, ఇది భారతదేశం కోల్పోయింది. అదనంగా, ఈ దేశాలు తమ ఉత్పత్తులపై టారిఫ్‌ను భరించగలిగినంత మేరకు వాటి సరఫరా శృంఖలాలు అలాగే తయారీ సామర్థ్యాలు బలంగా ఉన్నాయి. ఈ వాదన మన తయారీ మరియు ఎగుమతి సామర్థ్యం యొక్క అంతర్లీన బలహీనతలను అలాగే పోటీని పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమవుతుంది.

ఈ ఒప్పందంతో పాటు వచ్చిన అత్యంత తీవ్రమైన ఆరోపణ సార్వభౌమ నిర్ణయం తీసుకునే సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ,లేదా వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన లేదా సంయుక్త ప్రకటనకు బదులు నేరుగా భారత వర్తక, వాణిజ్య, రక్షణ విదేశాంగ విషయంలో జోక్యం చేసుకుని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనలు వెలువడుతున్నాయి. భారత ట్రేడ్ పాలసీలో నిర్ణయం తీసుకోవలసింది ఎవరు? ట్రంప్ ఏకపక్షంగా మన దేశ దీర్ఘకాలిక ప్రయోజనాలకు నష్టం జరిగే ప్రకటనలు ఎందుకు చేస్తున్నారు? దానికి మన ప్రధాన మంత్రి ఎందుకు ధీటుగా సమాధానం ఇవ్వలేకపోతున్నారు?

భారత ప్రధానమంత్రి మోదీకి బదులు 'భారత్ రష్యా నుండి చమురు దిగుమతులు చేసుకోకుండా నిర్ణయించుకుంది' అని సూటిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏలా బహిరంగ ప్రకటన చేస్తారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ విషయంలో భారత్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు 'మాకు ఎలాంటి సమాచారం లేదు' అని ప్రకటించారు. ఈ విషయంలో స్పష్టత ఇవ్వాల్సిన మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మౌనం వహిస్తున్నారు. దీనిని మనం భారత ప్రజలు ఏలా అర్థం చేసుకోవాలి? ఇక మన కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు మోదీ ఈ ఒప్పందం ద్వారా ఘనకార్యం చేసినట్లు సన్మానం చేశారు. అసలు ఇంత వరకు పూర్తి వాణిజ్య ఒప్పందం కుదరలేదు,చర్చలు జరుగుతున్నాయి అని పీయూష్ గోయల్ ప్రకటన చేస్తారు. అంతా గందరగోళంగా ఉంది. గతంలో యుపిఎ హయాంలో 2.93 శాతం ఉన్న టారిఫ్ ఇప్పుడు 18 శాతానికి ఒప్పుకుంటే...ఇది మన భారత ప్రధానమంత్రి సాధించిన ఘన విజయమా!? దీనికి మోదీని సన్మానించటమా?

ఇది ఒక విదేశీ శక్తి (అమెరికా) మన దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన భద్రతా విధానాన్ని నేరుగా ప్రభావితం చేస్తుందని సూచిస్తుంటం లేదా? దీనికి మన గోదీ మీడియా మోదీ ఘనకార్యం చేశారని చంకలు గుద్దు కోవటం ఏంటి? తమ మీడియా ఛానళ్ళలో తప్పుడు కథనాలు వండి వార్చటం ఏంటి?

ఇరాన్, వెనిజులాతో ఇదే విధమైన ఒత్తిళ్లు గతంలో జరిగాయనే విషయం ఇందుకు పునాది. మన పాలకులు ఇరాన్‌పై అమెరికా పునఃప్రతిబంధకాలను 'అన్యాయం', 'ఏకపక్షం' అని గట్టిగా విమర్శించారు. కానీ ఇప్పుడు, అదే తరహా ఒత్తిళ్లకు లొంగడం, విదేశాంగ విధాన సార్వభౌమత్వానికి చేసిన మోసం అని ఈ 'బీజేపీ దేశ భక్తులు', 'గోదీ మీడియా' గుర్తించటం లేదా అని సందేహాలు కలుగుతున్నాయి.

అంతర్జాతీయ మాధ్యమాలు అలాగే విశ్లేషకులు కూడా ఈ అంశంపై తీవ్ర ప్రశ్నలు వేస్తున్నారు. 'ది ఎకనామిస్ట్' మరియు 'ఫైనాన్షియల్ టైమ్స్' వంటి ప్రముఖ పత్రికలు ఈ ఒప్పందం భారతదేశం యొక్క 'రాజకీయ స్వయంప్రతిపత్తి'కి ధిక్కారంగా ఉండవచ్చని వ్యాఖ్యానించాయి. ఇంటర్నల్ మరియు ఎక్స్‌టర్నల్ రెండు రకాల విమర్శలు ఉన్నాయి. భారతదేశంలోని ఆర్థిక నిపుణులు, సమృద్ధ భారత్ ఫౌండేషన్ డైరెక్టర్ పుష్పరాజ్ దేశ్‌పాండే వంటి వారు, ఈ ఒప్పందం భారత ఆర్థిక, భౌగోళిక రాజకీయ విధానాలపై అమెరికా జోక్యం ప్రకటనలను ఏలా అనుసరించడం? అని ప్రశ్నలతో హెచ్చరించారు.

**పార్లమెంటరీ ప్రక్రియకు ధిక్కారం:**

మరొక వివాదాస్పద అంశం ఈ ఒప్పందం చేసుకునే విధానం. పార్లమెంట్ సెషన్ జరుగుతున్న సమయంలోనే సోషల్ మీడియా ద్వారా ఈ ప్రధాన నిర్ణయం ప్రకటించబడింది. ఇది పార్లమెంటరీ ప్రాతినిధ్యం మరియు పారదర్శకత యొక్క సూత్రాలకు విరుద్ధంగా ఉంది. ప్రధాని మోడీ తాము పార్లమెంట్‌ను 'అత్యున్నత దేవాలయం'గా పిలుస్తారు.

కానీ ఈ సందర్భంలో ఆ సంస్థను విస్మరించడం, ప్రజాస్వామ్య ప్రక్రియలపై తీవ్ర అప్రమత్తత రావాల్సిన అవసరాన్ని సూచిస్తుంది.

దీర్ఘకాలిక ఆర్థిక ప్రభావాలు: వాణిజ్య లోటు మరియు 'మేక్ ఇన్ ఇండియా' : ఒప్పందం ప్రకారం, భారత్ ఐదేళ్లలో $500 బిలియన్ల విలువైన అమెరికన్ వస్తువులు మరియు ఇంధన ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటుంది. ఇది భారత వార్షిక వాణిజ్య లోటును ప్రస్తుత $20 బిలియన్ల నుండి $36 40 బిలియన్లకు పెంచుతుందని అంచనా. అంటే, మన డాలర్ నిల్వలపై ఒత్తిడి పెరుగుతుంది. అలాగే మన రూపాయి విలువ మరింత దెబ్బతినే అవకాశం ఉంది.

ఇంకా మరో గంభీరమైన ఆందోళన ఏమిటంటే, ఇది 'మేక్ ఇన్ ఇండియా' పథకం యొక్క ఆశయాలకు,లక్ష్యాలకు పూర్తి విరుద్ధంగా ఉంది. భారత దేశం తన దేశీయ తయారీ ఉత్పత్తులకు ఎగుమతులను ప్రోత్సహించాలనే లక్ష్యానికి బదులుగా, ఈ ఒప్పందం విదేశీ ఉత్పత్తులపై మన దేశం పూర్తిగా ఆధారపడే టట్లు చేస్తుంది. మన దేశ ఎగుమతులు అమెరికా 'జీరో టారిఫ్' తో కొంటుంది. అమెరికా ఎగుమతులకు (అల్యూమినియం, ప్లాస్టిక్స్, మెకానికల్ ఉపకరణాలు మరియు ఇంజనీరింగ్ వస్తువుల వంటి )రంగాలలో మనం 18 శాతం టారిఫ్‌లతో దిగుమతులు పెరిగే అవకాశం ఉంది, ఇది స్థానిక పరిశ్రమలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తులు (బాదం, ఆపిల్, వైన్) తదితర దిగుమతి చేయడం మన వ్యవసాయానికి, పాల ఉత్పత్తులకు ముప్పు తెచ్చే అవకాశం ఉంది.

**భవిష్యత్తుకు మన ఆర్థిక నిపుణుల సూచనలు:**
**మన ప్రభుత్వం చేపట్టవలసిన చర్యలు:**

1.పారదర్శకత: ఒప్పందం యొక్క పూర్తి వివరాలను పార్లమెంటుకు ముందు ఉంచాలి. విస్తృతమైన చర్చను ప్రోత్సహించాలి. ప్రజలు తమకు ప్రయోజనం చేకూర్చే నిబంధనలు ఏవిటో తెలుసుకోవడానికి హక్కు ఉంది.

2. ప్రత్యామ్నాయ మార్కెట్లను బలోపేతం చేయాలి: అమెరికాపై పూర్తిగా మనం ఆధార పడటాన్ని తగ్గించాలి. యూరోపియన్ దేశాలు, అరబ్, ఆగ్నేయాసియా, ఆఫ్రికా మరియు లాటిన్ అమెరికా దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలను వేగవంతం చేయాలి.

3. స్థానిక పరిశ్రమలకు రక్షణ: అమెరికా నుండి దిగుమతుల వల్ల ప్రతికూలంగా ప్రభావితమయ్యే రంగాలలో స్థానిక తయారీదారులకు ఆదాయం కోల్పోకుండా రక్షించడానికి సహాయం చేయాలి. వారికి ఆధునికీకరణ మరియు పోటీ సామర్థ్యం కోసం ప్రోత్సాహకాలు అందించాలి.

4. ఇంధన భద్రతా వ్యూహాల పునఃపరిశీలన: రష్యా నుండి చమురు దిగుమతి తగ్గించడం వలన కలిగే ప్రభావాన్ని తట్టుకోవడానికి, ఇతర దేశాల నుండి దిగుమతులను వైవిధ్య పరచడం, పునరుత్పాదక శక్తి వైపు మరింత దృష్టి పెట్టడం, అలాగే స్థానిక శోధనలను ప్రోత్సహించడం జరగాలి.

5. దీర్ఘకాలిక వ్యూహం రూపకల్పన: భారతదేశం తన వాణిజ్య విధానాలను జాతీయ ప్రయోజనాల ఆధారంగా రూపొందించుకోవాలి, బాహ్య ఒత్తిళ్ల ఆధారంగా కాదు. విదేశాంగ విధానం ప్రధాన లక్ష్యం దేశ ప్రయోజనాలను సాధించడం అయి ఉండాలి.

చివరిగా, భారత అమెరికా వాణిజ్య ఒప్పందం భారత దేశం యొక్క ఆర్థిక, రాజకీయ స్వయంప్రతిపత్తికి సంబంధించిన ప్రశ్నలను ఎత్తిపట్టింది. వాణిజ్య లావాదేవీలు రెండు దేశాలకు ప్రయోజనకరంగా ఉండాలి, కానీ అవి దేశం యొక్క సార్వభౌమ నిర్ణయాలను ప్రభావితం చేయకూడదు. ప్రభుత్వం తప్పనిసరిగా ఈ విషయంలో ప్రజల ఆందోళనలను అర్థం చేసుకోసుకోవాలి. పారదర్శకతను నిర్ధారించుకోవాలి. ఈ ఒప్పందం భారతీయుల భవిష్యత్తు ప్రయోజనాలకు ఎలా సహాయపడుతుందో స్పష్టంగా వివరించాలి. లేకపోతే, ఈ ఒప్పందం భారత ఆర్థిక వ్యవస్థపై అమెరికా ప్రభుత్వం ప్రభావాన్ని పెంచే ఒక పెద్ద దశగా మారే ప్రమాదం ఉంది. ఇది దీర్ఘకాలంలో జాతీయ ప్రయోజనాలకు హాని కలిగించవచ్చు.

## మెజారిటీ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తుంది: ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/చొప్పదండి:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆద్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో మెజారిటీ మున్సిపాలిటీలో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మున్సిపల్ ఎన్నికల సంధర్భంగా బుధవారం చొప్పదండి పట్టణంలోని 10వ వార్డులో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే చొప్పదండి మున్సిపాలిటీని అధిక మెజార్టీతో కైవసం చేసుకోబోతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పథకాలతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని చెప్పారు. చొప్పదండి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు కుమ్మక్కై పనిచేస్తున్నాయని విమర్శించారు. ప్రజలు ఆ పార్టీలను నమ్మే పరిస్థితి లేదని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాద్యమన్న నమ్మకంతో ఓటు వేయడానికి సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో కార్పోరేషన్లు, మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని పేర్కొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో. అలాగే 20 వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. వేములవాడ లోని సినారె కళామందిరంలో రిసెప్షన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గాంధీ నగర్ లోని గ్రీన్ పోలింగ్ కేంద్రంలో పరిశీలించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్ ,తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్, టీపీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి/గోదావరిఖని :** పెద్దపల్లి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం ఎన్నికల నేపథ్యంలో రామగుండం నగరపాలక పరిధిలోని ఎన్‌టిపిసి జడ్పీహెచ్ఎస్, పిటిఎస్ ఎన్‌టిపిసి సెయింట్ క్లెయిర్స్, గౌతమినగర్ లోని ప్రగతి పాఠశాల, రాంనగర్‌లోని హోట్ హైస్కూల్, అమరావతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు 1,01,470 మంది ఓటర్లు 56.49 శాతం తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఉదయం 9 గంటలకు 9.5 శాతం, 11 గంటలకు 24.31 శాతం, ఒంటి గంట వరకు 42.12 శాతం పోలింగ్ నమోదైందని, 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు టోకెన్ అందించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సలను పటిష్ట భద్రతతో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ వెంట రామగుండం తహసీల్దారు శ్రీపాద ఈశ్వర్, పలువురు అధికారులు ఉన్నారు.

**మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం:** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రామగుండం కార్పొరేషన్ పరిధిలో జ్యోతి నగర్ టిటిఎస్ జడ్.పి.హెచ్.ఎస్, పిటిఎస్ ఎన్టిపిసి ఎస్.టి క్లెయిర్స్,గౌతమ్ నగర్ లోని ప్రగతి పాఠశాల,రాంనగర్ లోని హోట్ హై స్కూల్, అమరావతి హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల వరకు లక్షా 01 వేయి 470 మంది (56.49) శాతం తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ఉదయం 9 గంటల వరకు 9.5%, 11 గంటలకు 24.31%, 1 గంట వరకు 42.12% పోలింగ్ నమోదైందని, 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్న ఓటర్లకు టోకెన్ అందించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని అన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లను పటిష్ఠ భద్రతతో స్ట్రాంగ్ రూం కు తరలించే విధంగా ఏర్పాటు చేశామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట రామగుండం తహసిల్దార్ ఈశ్వర్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల బందోబస్తును పర్యవేక్షించిన సిపి



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్‌ను రామగుండం సి.పి. అంబర్ కిషోర్ ఝూ పరిశీలించారు. ఎన్‌టిపిసిలోని ప్రభుత్వ హైస్కూల్, మంచిర్యాల పట్టణంలోని ఆర్‌బిహెచ్‌వి, క్రిస్ట్ స్కూల్ తదితర పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ బందొబస్తు, భద్రతా చర్యలు, క్యూలైన్ల నిర్వహణ, వృద్ధులు, దివ్యాంగుల కోసం కల్పించిన ప్రత్యేక సదుపాయాలను సి.పి. పరిశీలించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే వరకు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, శాంతియుతంగా కొనసాగుతుందా అనే అంశంపై ప్రత్యక్షంగా ఆరా తీసి, పోలింగ్ అధికారులతో మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. ఓటర్లతో కూడ మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీస్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఎన్నికల శాంతి భద్రతల కోసం పూర్తిస్థాయి పోలీస్ బందొబస్తు ఏర్పాట్లు చేసినట్లు, ఓటర్లు భయభ్రాంతులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు సి.పి. తెలిపారు. సి.పి. వెంట మంచిర్యాల డిసిపి ఎ.భాస్కర్, ఎసిపి ఆర్.ప్రకాష్, ఇన్స్‌పెక్టర్ ప్రమోద్‌రావు, ఎన్‌టిపిసి ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌లు ఉన్నారు.

# కరీంనగర్ కార్పొరేషన్‌లో 62.98 శాతం

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్
వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ పర్యవేక్షణ
కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్, హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీలకు బుధవారం జరిగిన ఎన్నికలలో చెదురుమొదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో 66 డివిజన్‌లలో 3,40,580, ఓటర్లలో మహిళా ఓటర్లు170858, పురుష ఓటర్లు 169679, ఇతరులు 43 మంది ఉన్నారు. బుదవారం జరిగిన పోలింగ్‌లో 2,14486 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 108888 మంది మహిళలు కాగా 105579 మంది పురుషులు ఉన్నారు. కార్పోరేషన్ పరిధిలోని 477 పోలింగ్ స్టేషన్ల లో 62.98 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కరీంనగర్ కార్పోరేషన్ పరిధిలోని 58,28 డివిజన్‌లలో కొంత ఉద్రిక్తత కొలకొన్నప్పటికీ పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి పోటింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. **పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్:** జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసినసిసి కెమెరాల ద్వారా ఎన్నికల సరళిని పర్యవేక్షించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టరేట్ నుండి ఎన్నికల తీరును పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు అదేశాలు జారీ చేశారు. సాయంత్రం 5గంటలలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు.

**కౌంటింగ్ కేంద్రం పరిశీలన:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సజావుగా ముగియడంతో ఈ నెల 13న జరిగే కౌంటింగ్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ తో కలిసి పరిశీలించారు. ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఓట్ల లెక్కింపు వివరాలను ని ర్ది ష్ట పార్మాట్లలో నమోదు చేయాలన్నారు. కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు.

**పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన సిపి..** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్టమైన భద్రత ర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. బుధవారం పలు పోలింగ్ కేంద్రాలను ఆయన క్షేత్ర స్థాయిలో సందర్శించి భద్రత తీరును స్వయంగా పర్యవేక్షించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సిపి అక్కడ ఏర్పాటు చేసిన అదనపు బలగాల మోహరింపును తనిఖీ చేశారు. ఏవైనాఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. విధుల్లో ఉన్న పోలీసులు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలతో మర్యాదగా ప్రవరిస్తూనే, శాంతి భద్రతల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. సిపి వెంట ట్రైనీ ఐపిఎస్ సోహం, పలువు పోలీసు అధికారులున్నారు.

## బల్దియా ఎన్నికలను పరిశీలించిన జె.డి.



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మున్సిపల్ ఎన్నికల పర్యవేక్షణాధికారి, పురపాలక పరిపాలనాశాఖ జాయింట్ డైరక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సందర్శించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు రామగుండం నగరపాలక సంస్థ చేసిన ఏర్పాట్లను జె.డి.కి రామగుండం ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీ వివరించారు. ఎలక్షన్ మెటిరియల్ రిసెప్షన్ కౌంటర్‌తోపాటు ఎన్‌టిపిసి సెయింట్‌క్లేర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రమైన గోదావరిఖని డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. జె.డి. వెంట, పివి రామన్, ఎసిపి శ్రీహరి, నవీన్‌లు ఉన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు





**ప్రజాపక్షం/కరీంనగర్:** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కరీంనగర్ లోని ప్రముఖులు, నాయకులు, వివిధ పార్టీల అధ్యక్షులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రోడ్లు భవనాల శాఖ ఎస్ ఈ కార్యాలయంలోని పోలింగ్ స్టేషన్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 50వ డివిజన్‌లోని జ్యోతినగర్ ఎస్సార్ హైస్కూల్ లోని 361 పోలింగ్ బూత్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులు ఓటు హక్కును వినియోగించుకోగా, స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ 52వ డివిజన్ పరిధిలోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. క్రిస్టియన్ కాలనీలోని పోలింగ్ కేంద్రంలో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. 59వ డివిజన్ ముకరాంపుర కే.కే హై స్కూల్ పోలింగ్ భూత్ లో నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆయన సతీమణి శ్వేత దేశాయ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 52 డివిజన్ లోని పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అల్ఫోర్స్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు.





## ధర్మపురిలో 75.16 శాతం పోలింగ్



**ప్రజాపక్షం/ధర్మపురి :** రాష్ట్రంలో జరుగుతున్న రెండవ సాదారణ మున్సిపల్ ఎన్నికలలో బుధవారం జరిగిన పోలింగ్ ధర్మపురి పురపాలక లో ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ ముగింపు సమయమైన సాయంత్రం 5 వరకు 75.16 శాతం పోలింగ్ అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ధర్మపురి మున్సిపల్ పరిధిలో మొత్తం 14,035 మంది ఓటర్లు ఉండగా పురుషులు 4827, మహిళా ఓటర్లు 5721,ఇతరులు 1 మొత్తం 10,549 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.పోలింగ్ కోసం మొత్తం 29 కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు ఒకరోజు ముందే ఆయా పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో సిబ్బందిని తరలించారు. ఓటింగ్ బుధవారం ఉదయం 7 గంటలనుండి సాయంత్రం ఐదింటి వరకూ జరగ్గా ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని ప్రత్యక్షంగా పరిశీలించారు.విధులు నిర్వర్తిస్తున్న పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. **ప్రలోభాలతో ఎర :** మున్సిపల్ ఎన్నికల్లో ధర్మపురిలోని 15 వార్డుల్లో బరిలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నానా రకాలుగా ప్రలోభాలకు గురిచేసారని దానిలో భాగంగా ఒక్క ఓటుకు 2 వేల నుండి 5 వేల దాకా నగదు, ఫుల్ బాటిల్ మద్యం, చీరెలు, వెండి గిన్నెలు, బియ్యం బస్తాలు ఇలా పలురకాలుగా అందించి ఓటరును తమ వైపుకు తిప్పుకున్నట్లు పట్టణంలో ముచ్చటించుకుంటున్నారు. ఈసారి ఎన్నికలు చాలా కాస్లీగా ఉన్నాయని మున్ముందు సామాన్యులు ఎన్నికల్లో పోటీపడే పరిస్థితి ఉండదేమోనని చర్చ జరుగుతోంది.

## 13న కౌంటింగ్ ప్రారంభం: కలెక్టర్



**ప్రజాపక్షం/సిద్దిపేట:** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హైమావతి తెలిపారు. జిల్లాలోని చేర్యాలహ, హుస్నాబాద్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్, దుబ్బాక మున్సిపాల్టీల్లో ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగుకుండ పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ వెల్లడించారు.

**13న కౌంటింగ్ ఉదయం 8గంటలకు ప్రారంభం**
ఈనెల 13న శుక్రవారం ఉదయం 8గంటల నుండి అయా మున్సిపాల్టీలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు జరుగుతుందని అందుకు అవసరమగు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ హైమావతి తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించినట్లు తెలిపారు.

**కౌంటింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు సిపి రశ్మీ పేరుమాల్**
మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలోని కమిషనరేట్ పరిధిలోని నాలుగు కేంద్రాలు చేర్యాల,హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ ఎస్ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ రశ్మీపేరుమాల్ తెలిపారు. ఐదు కంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడటం, ఏలాంటి ఊరేగింపులు నిర్వహించటం నిషిద్ధమన్నారు. ఈ నిబంధనలు ఈనెల 13 ఉదయం 6గంటల నుండి ఓట్ల లెక్కింపు ముగిసేవరకు అమలులో ఉంటుందన్నారు. ఈనిబంధనలు ఉల్లంగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లుతెలిపారు. శాంతియుత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసేలా ప్రజలందరు సహకరించాలని కోరారు.

## సిద్దిపేట జిల్లాలో నాలుగు మున్సిపాల్టీలో 82.03 శాతం నమోదు

అధికంగా దుబ్బాక 85.05శాతం
అత్యల్పంగా గజ్వేల్ 79.35 శాతం
పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీలు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. బుధవారం సాయంత్రం వరకు 82.03 నమోదైంది. 72 వార్డులకు 176 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాలుగు మున్సిపాల్టీల పరిధిలో 101085 ఓట్లకు 82921 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 40380 పురుషులు, 42536 మహిళలు, ఇతరులు 5గురు ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేర్యాల మున్సిపాల్టీలో 12 వార్డుల్లో 13777 ఓట్లకు 11491 ఓటు హక్కును వినియోగించుకున్నారు. 83.41 శాతం పోలింగ్ నమోదైంది. దుబ్బాకలో 20 వార్డులకు 21341 ఓట్లకు 18150 ఓటు హక్కును వినియోగించుకున్నారు. 85.05 శాతం పోలింగ్ నమోదైంది. గజ్వేల్ మున్సిపాల్టీలో 20 వార్డులకు 46740 ఓట్లకు 37.088 ఓటు హక్కు వినియోగించుకోగా, 79.35 శాతం పోలింగ్ న మోదైంది. హుస్నాబాద్‌లో 20 వార్డుల్లో మున్సిపాల్టీలకు 19227 ఓటర్లకు 16192 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా, 84.21 శాతం పో లింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ హైమావతి పరిశీలించారు. జిల్లాలో ఉదయం మందకొడిగా పోలింగ్ ప్రారంభమైనప్పటికి మొ దటి రెండు గంటల తర్వాత పోలింగ్ పుంజుకుం ది. సాయంత్రం అన్ని మున్సిపాల్టీల్లో 80 శాతంకు పైగా పోలింగ్ నమోదు కావటం విశేషం.

## అంగన్వాడీ టీచర్ అకారణంగా బాలునిపై దండన



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** అభం శుభం తెలియని బాలునిపై ఓ అంగన్వాడి టీచర్ దండించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పసి పిల్లలకు అక్షరాలు దిద్దించడం, పిల్లలకు జ్ఞానోదయాన్ని నేర్పించే అంగన్వాడి ఉపాద్యాయురాలు తనప్రతాపాన్ని చూపడం తల్లితండ్రులు తీవ్ర ఆగ్రహం చేశారు. వివరాల్లోకి వెళితే స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెంకటాపుర్ గ్రామానికి చెందిన కొంపల్లి లక్ష్మి విజయ్‌కుమార్ దంపతుల కుమారుడు విద్వాన్స్(3) సంవత్సరాల బాలుడిని ఎప్పటిలానే మంగళవారం పంపించారు. అంగన్వాడి టీచర్ సల్వానిరాణి బాలుడిని అకారణంగా కొట్టి గాయపరిచిందని కంటిభాగం వద్ద కమిలిపోయిన గాయాలు ఉన్నాయని, ఎల్లారెడ్డిపేటలో బుదవారం ఠాణాలో తల్లి తండ్రులు పిద్యాదు చేయగా కేసునమోదు చేశారు. మరి పాలకవర్గం, ఉన్నతాధికారులు అంగన్వాడిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# యాసంగి పంటలకు రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు

పెండింగ్ పనులు పూర్తి చేయాలి
13న రంగనాయక్‌సాగర్ కుడికాలువ నీటిని విడుదల చేయాలని
ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి
మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట:** యాసంగి పంటకు రైతులకు ఇబ్బందులు కలుగకుండ అవసరమగు అన్ని చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. బుధవారం రంగనాయగ్‌సాగర్ ఇరిగేషన్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఇరిగేషన్ పెండింగ్ పనులపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలసి మాజీమంత్రి హరీష్ రావు సమీక్ష నిర్వహించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. రంగనాయక్ సాగర్ కుడికాలువ కెనాల్‌లో పేరుకపోయిన తుంగ గడ్డిని వెంటనే తొలగించాలన్నారు. ఈనెల 13న రంగనాయక్‌సాగర్ కుడికాలువ నీటి విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. మూడు నెలల్లో చంద్లాపూర్ లిఫ్ట్ పనులు పూర్తి చేసి లిఫ్ట్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇర్కోడ్ లిఫ్ట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నంగునూర్ మండలం ఘనపూర్ పంపుహౌస్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గోపులాపూర్, కస్తూరిపల్లి, గ్రామాల వద్ద నిర్మించే చెక్‌డ్యాం పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. నంగునూర్ మండలం ఊరచెరువు పాలమాకుల, బద్దిపడగ, లచ్చలయ చెరువు, జెపి తండా, దర్గా కుంట, దర్గాపల్లి గ్రామంలో నీళ్లు వచ్చేలా చూడాలన్నారు. సిద్దన్నపేట,ఇప్పలకుంట, పెద్దకుంట., నర్మెట్టకు నీళ్లు వెళ్లెలా చూడాలన్నారు.ఖానాపూర్, ఎల్‌డి 8 కాల్వ పూడిక తీత పనులు వెంటనే చేపట్టాలన్నారు. 600 ఎకరాలకు సాగునీరు అందించే గుర్రాలగొంది గ్రామంలోని చిన్నరాయిని చెరువులు నీళ్లు వెళ్లె గంగాపూర్ గ్రామం నుండి కాల్వ పనులు చేపట్టాలన్నారు. చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామం వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను మాజీ మంత్రి హరీష్‌రావు ఆదేశించారు. అల్లీపూర్ గ్రామంలోని కర్ణాలకుంటకు నీల్లు రావటానికి ఫారెస్టు నుండి అనుమతి ఇవ్వక గత ఐదు సంవత్సరాల నుండి నీళ్లు రావటం లేదని అల్లీపూర్ రైతులు హరీష్‌రావుకు విన్నవించారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుండి అల్లీపూర్ కర్నాలకుంట వరకు నీళ్లు వచ్చేలా లిఫ్ట్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. అందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని ఇరిగేషన్‌ను అధికారులకు సూచించారు. ఇబ్రహింనగర్ వెంకటయచెరువు నుండి మల్లారం సికింద్లాపూర్ గ్రామాలకు రైతులు పంటపోలాలకు నీరువచ్చేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఎల్లాయిపల్లి గ్రామంలోని గండి చెరువు తూము నుండి కాల్వ చేసి ఎల్లాయిపల్లి , మైలారం రైతులకు నీరు అందించాలన్నారు. శంకరాయకుంట గోనేపల్లికి రాజ్‌గోపాల్‌పేట చెరువు శివారు నుండి ఎల్‌డి 4, ఎల్ఎం 5 కాలువ పూర్తి చేసి శంకరాయకుంటకు నీళ్లు అందించాలన్నారు. మాచాపూర్, రంగాయపల్లి రైతుల కోసం తాత్కలికంగా కాల్వ తవ్వి నీల్లు ఇవ్వాలన్నారు. రామంచ గ్రామంలో మైసమ్మ చెరువుమెట్ల నిర్మాణం చేపట్టాలన్నారు. కస్తూరిపల్లి చెక్ డ్యాంకు ఆర్ఎం 2 కాల్వను అనుసందానం చేయాలన్నారు. బెల్లంకుంట, బిక్కబండకు అవసరమగు పైపులు, మిషన్స్ నా స్వంత ఖర్చుతో అందిస్తానని, వెంటనే పనులు చేపట్టాలన్నారు. అనంతసాగర్ గ్రామానికి నీల్లు అందించేందుకు ఎల్‌ఎస్ఎం 5 కాల్వ సర్వే చేపట్టి కాల్వ పెంచి గ్రామానికి నీళ్లు వచ్చేలా చూడాలన్నారు. ఈ చెరువుకు నీరువస్తే శేఖరావుపేట.మాటింద్ల.గోపులాపూర్, మల్యాల.గుర్రాలగొంది గ్రామాల చెరువులకు నీరు అందుతాయన్నారు. జక్కాపూర్,శనగకుంటకు నీళ్లు అందించేందుకు 26 ఎకరాల భూసేకరణకు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గుర్రాలగొంది గ్రామంలోని పెద్దరాయిని చెరువు మత్తడి పై బ్రీడ్జి నిర్మాణం పూర్తి చేసి, అదేవిధంగా బతుకమ్మ మెట్లు ఏర్పాటు చేయాలన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో సిపి తనిఖీలు



**ప్రజాపక్షం/మంచిర్యాల :** రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ బుధవారం పరిశీలించారు. మంచిర్యాల పట్టణంలోని ఆర్‌బిహెచ్ వి, క్రిస్ట్ స్కూల్ తదితర పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు, క్యూలైన్ల నిర్వహణ, వృద్ధులు, దివ్యాంగుల కోసం కల్పించిన ప్రత్యేక సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపి పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, శాంతియుతంగా కొనసాగేలా చూడాలని పోలింగ్ అధికారులకు తెలిపారు. ఓటర్లు భయ భ్రాంతులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీస్ సిబ్బందిని సంప్రదించాలని ఓటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఎ. భాస్కర్, ఏసిపి ఆర్.ప్రకాష్, పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ఎన్‌టిపిసి ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

## ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలి


జిల్లా ఎన్నికల అధికారి హరిత



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె. హరిత తెలిపారు. బుధవారం కాగజ్ నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ పాఠశాల, శిశు మందిర్, బాల భారతి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్, శిక్షణ ఐఎఫ్ఎస్ అధికారి భార్గవ్ కుమార్ లతో కలిసి ఆమె సందర్శించారు.పోలింగ్ సరళిని, నమోదైన పోలింగ్ శాతాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల కోసం త్రాగునీరు, నీడ వంటి వసతులు కచ్చితంగా ఉండాలని ఆదేశించారు. కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 30 వార్డులకు గాను 85 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోందని వెల్లడించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సాయంత్రం 5 గంటల లోపు క్యూలైన్లలో ఉన్న ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసిల్దార్ మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల గొంతుక 'ప్రజాపక్షం'

మాజీ సర్పంచ్ గడ్డం సుభాష్



**ప్రజాపక్షం/ముధోల్ :** ప్రతి అక్షరం ప్రజల కోసం అనే నినాదంతో ముందుకొచ్చిన ప్రజాపక్షం పత్రిక ప్రజల గొంతుకగా నిలిచి అందరి మన్ననలను పొందుతోందని ముధోల్ గ్రామ సర్పంచ్ గడ్డం సుభాష్ అన్నారు.బుధవారం మండల కేంద్రంలో ప్రజాపక్షం దినపత్రిక 2026 సంవత్సరపు క్యాలెండర్ ను ప్రాతికేయులు సునీల్ తో కలిసి ఆవిష్కరించారు.అదేవిధంగా మండల తహసీల్దార్ సైతం నూతన సంవత్సరపు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సమాచారం అందించడమే కాకుండా ప్రజల ప్రతికగా నిలుస్తోందని కొనియాడారు.తాము ప్రజలకు చేస్తున్న నిరంతరం ప్రజాపక్షంలో ప్రచురించి తమ సేవలను గుర్తిస్తున్న పత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యులు కృష్ణ,స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12వ తేదీ గురువారం జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని, ఈ సమ్మె సందర్భంగా కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల అన్ని సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని నిజామాబాద్ భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. పోరాడి సాధించిన కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆ దిశగా కార్యాచరణకు ఈ సమ్మె ఉంటుందని పిలుపునిచ్చారు.

## పాత పేర్లతో ఉపాధి పనులు : సంజీవ్

ఫోటో విధానాన్ని రద్దు చేయాలి

**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలోని నగరం తండా గ్రామంలో బుధవారం రోజున ఉపాధి హామీ పనులను డిబిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశం స్థానిక సర్పంచ్ ఉప సర్పంచ్ కార్యదర్శి తో పాటు కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్దేశాలను అదే విధంగా గత నెల రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరును మార్పు చేసి కొత్తగా ప్రవేశపెట్టిన వికాసిత్ భరత్ గ్రామీణ రోజుగారి యోజన పథకం అనే పేరు గురించి అవగాహన కల్పిస్తూ పాత పద్ధతులే పేరు ఉండాలని పనులు పాత పద్ధతుల్ని నడవాలని కూలీల హక్కులను విస్మరించకుండా అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. పనిచేసే కూలీలకు హాజరు ఉండాలి కానీ ఫోటోలు విధానాన్ని తీసివేయాలని ఎన్.ఎం.ఎం.ఎస్ వ్యవస్థను రద్దు చేయాలని పనికి తగ్గ వేతనం అందించాలని తెల్పడం జరిగింది. గ్రామ సర్పంచ్ అంతంపల్లి సుశీల సురేష్, ఉప సర్పంచ్ నజాం, కార్యదర్శి హరీఫ్ ఉషన్, ఫీల్డ్ అసిస్టెంట్ గోపి ఉపాధి హామీ కూలీలు మహిళలు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా మున్సిపల్.. ఎన్నికల పోలింగ్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/ మంచిర్యాల :** మంచిర్యాల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ బుధవారం ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలోని ఒక మున్సిపల్ కార్పొరేషన్, నాలుగు మున్సిపాలిటీలలో నిర్వహించిన ఓటింగ్ సరళిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించిన అనంతరం బెల్లంపల్లి, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల వివరాలను వెల్లడిస్తూ జిల్లాలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లోని 60 డివిజన్లకు గాను 265 పోలింగ్ కేంద్రాలు, బెల్లంపల్లిలో 68, చెన్నూర్ లో 36, క్యాతనపల్లిలో 45, లక్షెట్టిపేటలో 30 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం జోనల్, నోడల్ అధికారులు, పిఒలు, ఎపిఒలు, వీడియో బృందాలను నియమించి తగిన శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించామని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి భద్రతా ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నిర్మల్ మున్సిపల్ పోలింగ్ పర్యవేక్షణ..

## కౌంటింగ్ ఏర్పాట్లపై దిశానిర్దేశం

కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పర్వం అత్యంత ఉత్సాహంగా,ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది.బుధవారం నిర్వహించిన పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ క్షేత్రస్తాయిలో పర్యవేక్షించడంతో పాటు,ఈ నెల 13న జరగనున్న ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో కలిసి సమీక్షించారు.ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు స్వేచ్ఛగా పాల్గొనేలా చేయడం,లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయడంపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.ఉదయం నుంచే జిల్లా కేంద్రంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు.రవి హైస్కూల్,ప్రిన్స్ హైస్కూల్,టీఎన్జీఓ హాల్,ప్రభుత్వ బాలుర పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను తనిఖీ చేసిన ఆమె, ఓటర్ల వరుస క్రమాలను,పోలింగ్ సరళిని గమనించారు.ఓటర్ల రద్దీ ఎక్కువగా ఉన్న చోట ఓటింగ్ ప్రక్రియ ఆలస్యం కాకుండా అదనపు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ బాలుర పాఠశాలలోని మోడల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన వృద్దుల ను,తొలిసారి ఓటు హక్కు పొందిన యువతను కలెక్టర్ శాలువాలతో సన్మానించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. పోలింగ్ పరిశీలన అనంతరం జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి కలెక్టర్ పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించారు. ఈ నెల 13న నిర్వహించబోయే కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రం లోపల,వెలుపల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని,అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే లోపలికి అనుమతించాలని ఎస్పీకి సూచించారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,తహసిల్దార్ రాజు,పలువురు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు,పోలీస్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. నగరంలోని సన్‌ఫ్లవర్ హైస్కూల్‌లో టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ బుధవారం ఓటు హక్కును వినియోగించుకుని మాట్లాడారు. నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరబోతుందన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో బిజెపి మతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజలు అభివృద్ధికి కట్టం కడతారనిఆశాభావం వ్యక్తం చేశారు.



## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా కొనసాగింది. నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల పరిధిలో అన్ని చోట్ల పోలింగ్ మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమైంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు చేరుకోవటం ప్రారంభించారు. ఉదయం 9 గంటల సమయానికి సగటున 8.25 శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో 6.49 శాతం, ఆర్మూర్‌లో 11.05 శాతం బోధన్‌లో 14.24 శాతం భీమ్‌గల్‌లో 9.38 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 11 గంటల సమయానికి సగటు పోలింగ్ 22.54 శాతం జరగగా నిజామాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో 18.94 శాతం, ఆర్మూర్‌లో 29.60, బోధన్‌లో 32.35, భీమ్‌గల్‌లో 31.09 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం సగటున 39.68 శాతం కాగా నిజామాబాద్‌లో 35.49, ఆర్మూర్‌లో 47.93, బోధన్‌లో 50.69, భీమ్‌గల్‌లో 51.53 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 3 గంటల సమయానికి 48.55 శాతం ఓటింగ్ జరగగా నిజామాబాద్ కార్పోరేషన్‌లో 43.18, ఆర్మూర్‌లో 60.07, బోధన్‌లో 61.77, భీమ్‌గల్‌లో 6.65 శాతం పోలింగ్ నమోదైంది. నగరంలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నిర్ణీత సమయంలోగా క్యూ లైన్లలో నిలుచున్న వారికి కూడా ఎన్నికల సంఘం నిబంధనలకనుగుణంగా ఓటు వేసే అవకాశం కల్పించామన్నారు. ఈనెల 13న ఉదయం 8 గంటల నుండి కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టి ఫలితాలను వెల్లడించేలా విస్తృత చర్యలు చేపట్టామన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఏ చిన్న తప్పిదానికి సైతం తావు లేకుండా జాగ్రత్తగా ఓట్ల లెక్కింపు జరపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

కాగా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఎన్నికల సాధారణ పరిశీలకులు సత్యనారాయణరెడ్డి సైతం పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ ఓటింగ్ తీరుతెన్నులను పరిశీలన జరిపారు. ఓటింగ్ సందర్భంగా పో లింగ్ కేంద్రాల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను సీల్ చేసి పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు.

## మెదక్‌లో 81.09 శాతం పోలింగ్ నమోదు

జిల్లాలో 74 వార్డులు, 148 పోలింగ్ కేంద్రాలు

69,823 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు

**ప్రజాపక్షం మెదక్ :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో బుధవారం ఎన్నికలు జరిగాయి. జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మున్సిపల్ ఎన్నికల్లో జిల్లాలో 81.09 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా రామయంపేట్ మున్సిపల్ లో 84.84 పోలింగ్ శాతం నమోదు కాగా, అత్యల్పంగా నార్సాపూర్ మున్సిపాలిటీ లో 73.61 శాతం నమోదైంది. తూప్రాన్‌లో 81.30 శాతం నమోదు కగా,మెదక్ మున్సిపాలిటీలో 80.75 శాతం పోలింగ్ నమోదైంది. మెదక్, రామయంపేట్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీలల్లో 74 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. నాలుగు మున్సిపాలిటీలో 286 మంది అభ్యర్డులు పోటీలో ఉన్నారు. మెదక్ మున్సిపాలిటీలో 31 వార్డులు, నర్సాపూర్ లో 15 వార్డులు, తూప్రాన్ లో 16 వార్డులు, రామయంపేటలో 12 వార్డులు ఉన్నాయి. 74 వార్డులకు 148 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 69823 మంది ఓటర్లు తమ ఓటు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 33806 మంది, మహిళలు 36015 మంది, ఇతరులు 02 తమ ఓటు హక్కును వినియోగించుకున్నా రు. ఈ ఎన్నికలకు 884 మంది పోలింగ్ అధికారులను నియమించారు. పోలింగ్ కేంద్రాల వ ద్ద ఎలాంటి అవాంఛనీయ సం ఘటనలు జరగకుండా పోలీసు లు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి 13 న కౌంటింగ్ ని ర్వహించి అదే రోజున ఫలితాలను వెల్లడించనున్నారు.మెదక్ జిల్లా మున్సిపల్ ఎన్నికల సరళిని కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ లు పర్యవేక్షించారు. శాంతి భద్రతకు విఘాతం కలగకుండా ప్రతిష్టమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు ఎన్నికల సమాచారాన్ని జిల్లా కలెక్టర్ కు తెలియజేశార్లు, కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.కేంద్రంలోని గాంధీనగర్ 18 వార్డులో పోలింగ్ స్టేషన్ నెంబర్ 35 వద్ద కలెక్టర్ దంపతులు సామాన్య ఓటరుల్లా వరుసలో నిలబడి ఓటు వేశారు. 5 వార్డు లో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్ తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నారు.



## యూరియా కొరత ఉండదు..

## యాప్‌పై అవగాహన

జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి



**ప్రజాపక్షం/దాహేగాం/ పెంచికల్‌పేట్ :** యూరియా సరఫరాలో రైతు లు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా కొరతను అధిగమించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి తెలిపారు. బుధవారం దాహేగాం మండల కేంద్రంలోని రైతు వేదికలో డీలర్లు, రైతులకు ఏర్పాటు చేసిన యాప్ అవగాహన ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎఇఒలు రైతుల మొబైల్ నంబర్లను యాప్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఈ యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఎఇఒలకు తెలిపి పంట నమోదు ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని స్పష్టం చేశారు. సాగుపై సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులను కలవాలని సూచించారు.వ్యవసాయ అధికారి రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## రెబ్బనలో ఆగని ఇసుక దోపిడీ

పట్టపగలే జిల్లాలు దాటుతున్న అక్రమ రవాణా

**ప్రజాపక్షం / రెబ్బన :** ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలంలో ఇసుక అక్రమ రవాణా మూ డు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. మండలంలోని నంబాల, నారాయణపూర్, కొమరవెల్లి గ్రామాల మీదుగా మంచిర్యాల జి ల్లాకు నిత్యం యథేచ్ఛగా ఇసుక తరలిపోతోంది. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన ఇసుక పాలసీని తీసుకువచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో అక్రమార్కులు ప్ర భుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. పట్టపగలే యంత్రాలతో ఇసుకను తోడుతూ ట్రాక్టర్లు, లారీల్లో సరిహద్దులు దాటిస్తున్నా అడ్డుకోవాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ సాగుతున్న ఈ దందాపై స్థానికులు అధికారులకు సమాచారం ఇస్తున్నా ఫలితం లే కుండా పోతోంది. అధికారుల మౌనం వెనక ఉన్న అసలు ఆంతర్యం ఏమిటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కులకు కొమ్ముకాస్తూ కొందరు అధికారులు తమ జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖజానాకు చేరాల్సిన ఆదాయం అక్రమార్కుల పాలవుతుంటే, పర్యవేక్షించాల్సిన శాఖలు మాత్రం కళ్లున్నా చూడలేని కబోదుల్లా మౌనంగా ఉండటం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెబ్బన మండలంలో సాగుతున్న ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్నికల పోలింగ్ సరళిని పర్యవేక్షించిన కాంగ్రెస్ నేతలు..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ పర్వం బుధవారం పట్టణవ్యాప్తంగా అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలు తమ ప్రజాస్వామ్య బాధ్యతను నెరవేర్చడమే కాకుండా,క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్నికల సరళిని నిశితంగా పరిశీలించారు.నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి అప్పల కావ్య గణేష్,కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ వేణుగోపాల చారి,నిర్మల్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జి కుచాడి శ్రీహరిరావు ఉదయాన్నే తమ తమ వార్డుల్లోని పోలింగ్ కేంద్రాలకు చేరుకుని సామాన్య ఓటర్లతో కలిసి వరుసలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసిన అనంతరం వారు మాట్లాడుతూ, పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని,ఇది కేవలం హక్కు మాత్రమే కాదని,బాధ్యత అని పిలుపునిచ్చారు. నేత ల ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ,నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు,ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నాయకత్వంలో కాంగ్రెస్ నేతల బృందం పట్టణంలోని పలు వార్డుల్లో సుడిగాలి పర్యటన చేపట్టింది.భాగ్యనగర్,బుధవారపేట, విశ్వనాథ్ పేట గాజులపేట,బర్కతపుర,వెంకటాపూర్,శాంతినగర్,శ్రీనగర్ కాలనీ, ది వ్యానగర్ వంటి ప్రాంతాల్లోని పోలింగ్ బూతులను సందర్శించింది. ప్రతీ బూత్ వద్ద ఓటింగ్ జరుగుతున్న తీరును,ఓటర్ల రాకను నేతల అడిగి తెలుసుకున్నా రు.తమ ఓటు వేసేలా చూడాలని అధికారులకు,పార్టీ కార్యకార్తలకు సూచించారు. ముఖ్య ంగా కాం గ్రెస్ అభ్యర్థులు అడప శ్రీకాంత్, ఇమ్రానుల్లా,జూవేరియా రఫీ తదితరులను నేతలు కలిసి వారి వార్డుల్లో ప్రజల స్పందన ఎలా ఉందో ఆరా తీశారు.పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని,ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని వారు దిశానిర్దేశం చేశారు.పట్టణ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని,కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై భారీగా తరలివస్తున్నారని నేతలుధీమా వ్యక్తం చేశారు.గత పదేళ్లలో పట్టణ అభివృద్ధి కుంటుపడిందని,కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీని కైవసం చేసుకుంటేనే నిర్మల్ పట్టణం ఆదర్శవంతంగా మారుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి,జిల్లా లైబ్రరీ మాజీ చైర్మన్ రాజేందర్,ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ స భ్యులు అతీక్,పార్టీ నాయకులు కొట్టె శేఖర్,జునైద్ మతిన్ వంటి ప్రముఖులతో పాటు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## బ్యాలెట్ బాక్స్‌లు స్ట్రాంగ్ రూమ్‌కు చేరే వరకూ అప్రమత్తం

ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాట్లపై జిల్లా ఎస్పిని ప్రశంసించిన డిఐజీ ఎల్.ఎస్ ,చౌహాన్

**ప్రజాపక్షం/ సంగారెడ్డి:** మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా చార్మినార్ జోన్ vi డిఐజి ఎల్ ఎస్ చౌహాన్ సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలలో కొనసాగుతున్న పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగ ఏలాంటి అలజడి లేకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను డిఐజీ పరిశీలించి ఈ విభాగం గురించి జిల్లా ఎ స్పీ వివరిస్తూ పోలింగ్ లోకేషన్లను , లాంగిట్యూడ్ , లాటీట్యూడ్ ఆధారంగా రూట్ వారిగా మ్యాపింగ్ చేసి రూట్ మొబైల్ స్టైకింగ్ ఫోర్స్ సెప్షల్ స్టైకింగ్ ఫోర్స్ సిబ్బంది లైవ్ లోకేషన్లను ,గూగుల్ మ్యాపింగ్ ద్వారా అనుసందానం చేసి రియల్ టైమ్ మానిటరింగ్ నిర్వహిస్తూ కంట్రోల్ రూమ్ ద్వారా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ పరిస్థితులను నిరంతరం కమ్యూనికేషన్ సాధనాలు ,వెబ్ కాస్టింగ్ ద్వారా మానిటరింగ్ చేస్తూ రూట్ మొబైల్ అదికారులు స్టైకింగ్ స్పెషల్ ఫోర్స్ ఏ ప్రాంతాల్లో ఎంత దూరంలో ఉన్నారో గుర్తించి ఎలాంటి సమస్య తలెత్తెనా అత్యంత సమీపంలో ఉన్న సంబందిత బలగాలను వెంటనే ఘటన స్థలానికి పంపించే విధంగా సమన్వయంలో చేస్తోందని తెలిపారు. ఈ ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్, ను జిల్లా టోక్నికల్ టీం. అబినందించారు. అనంతరం సంగారెడ్డి పట్టణంలోని కొన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ప్రత్యేక్షకంగా సందర్శించి అక్కడి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఐజీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని ఏలాంటి ఆవాంచనీయు సంఘటనకు తావు లేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టిందని వివరించారు. అలాగే బ్యాలెట్ బాక్స్‌లు ప్రక్రియా సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్, ,అదనపు ఎస్పీ రఘునందన్‌రావు ,సంగారెడ్డి డిఎస్పీ సత్యయ్యగౌడ్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఎలెక్షన్ సెల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, సదా నాగ రాజు ,ఎస్‌ఐలు హిమబిందు కావేరి తదితరులు పాల్గొన్నారు.




## సైబర్ మోసాలపై అవగాహన



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** సైబర్ నేరాల పట్ల ప్రజలు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఎన్‌డీసీసీ ఆధ్వర్యంలో కేవైసీ అప్‌డేట్, ఆన్‌లైన్ మోసాలపై బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ప్రభుత్వాల నుండి వచ్చే పథకాలకు పొందేందుకు బ్యాంకులలో కేవైసీ తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలన్నారు. ఫోన్లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటిఎం, గూగుల్‌పే, ఫోన్‌పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. బ్యాంకు సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అశోక్, గంగాజమున, అసిస్టెంట్ మేనేజర్ భార్గవ్, సభ్యులు జగదీష్, సురేష్ పాల్గొన్నారు.

టీ20 వరల్డ్‌కప్‌లో సూపర్ థ్రిల్లర్..

# రెండో సూపర్ ఓవర్‌లో నెగ్గిన దక్షిణాఫ్రికా

**అహ్మదాబాద్:** టీ20 వరల్డ్‌కప్‌లో ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన మ్యాచ్‌లో హైడ్రామా చోటుచేసుకున్నది. సూపర్ థ్రిల్లింగ్‌గా సాగిన ఈ మ్యాచ్‌లో రెండు సార్లు సూపర్ ఓవర్ వరకు వెళ్లింది. చివరకు దక్షిణాఫ్రికా రెండో సూపర్ ఓవర్‌లో 4 రన్స్ తేడాతో విక్టరీ నమోదు చేసింది. ఈ వరల్డ్‌కప్‌లో సూపర్ ఓవర్ వరకు వెళ్లిన తొలి మ్యాచ్ ఇదే. భారీ పవర్ హిట్టర్లు ఉన్న రెండు జట్లు.. మ్యాచ్‌పై చివరి వరకు తమ పట్టును కోల్పోలేదు. ఈ మ్యాచ్‌లో సిక్సర్ల వర్షం కురిసింది. ఫస్ట్ మ్యాచ్‌లో రెండు జట్లు కలిపి 20 సిక్సర్లు కొట్టాయి. ఇక సూపర్ ఓవర్స్‌లో మరో 10 సిక్సర్లు బాదాయి. అహ్మదాబాద్ స్టేడియం బౌండరీల మోతతో హోరెత్తింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 187 రన్స్ చేసింది. క్వింటెన్ డికాక్ 59, రికల్టన్ 61 రన్స్ చేశారు. అయితే చేజింగ్ మొదలుపెట్టిన ఆఫ్ఘనిస్తాన్‌కు గుర్బాజ్ మంచి స్టార్ట్ ఇచ్చాడు. అతను 42 బంతుల్లో 84



రన్స్ చేశాడు. అజ్మతుల్లా, రషీద్ ఖాన్ కూడా చెలరేగిపోయారు. దీంతో మ్యాచ్ ఆఫ్ఘన్ గెలుస్తుందనుకున్నారు. కానీ ఆఖరి ఓవర్లో 13 రన్స్ అవసరం కాగా .. మ్యాచ్ టై అయ్యింది. 19.4 ఓవర్లలో 187 రన్స్ చేసి ఆఫ్ఘనిస్తాన్ ఆలౌటైంది. మ్యాచ్ టై కావడంతో సూపర్ ఓవర్‌కు వెళ్లింది.ఇక ఫస్ట్ సూపర్ ఓవర్‌లో ముందుగా ఆఫ్ఘనిస్తాన్ బ్యాటింగ్ చేసింది. ఆ ఓవర్‌లో 17 రన్స్ చేసింది ఆఫ్ఘనిస్తాన్. అజ్మతుల్లా 5 బంతుల్లో 16 రన్స్ చేశాడు. అయితే ఆ టార్గెట్‌ను అనూహ్య రీతిలో ఛేజ్ చేసింది దక్షిణాఫ్రికా. ఆఖరి బంతికి భారీ సిక్సర్ కొట్టిన స్టబ్స్ ఫస్ట్ సూపర్ ఓవర్‌ను తమ ఖాతాలో వేసుకున్నాడు. రెండో సూపర్ ఓవర్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 23 రన్స్ చేసింది. స్టబ్స్ ఓ సిక్సర్ బాదగా, మిల్లర్ రెండు భారీ సిక్సర్లు కొట్టేశాడు. ఇక చేజింగ్‌లో గుర్బాజ్ వరుసగా మూడు సిక్సర్లు కొట్టి దక్షిణాఫ్రికాను వణికించాడు. కానీ ఆఖరి బంతికి క్యాచ్ అవుట్ కావడంతో 4 రన్స్ తేడాతో సఫారీలు విక్టరీ కొట్టారు.




ఐర్లాండ్‌పై

# ఆస్ట్రేలియా ఘన విజయం!

ఐసిసి టీ20 ప్రపంచకప్ 2026లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. గ్రూప్‌బీలో భాగంగా కొలంబో వేదికగా ఐర్లాండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 67 పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నాథన్ ఎల్లిస్(4/12) సంచలన బౌలింగ్‌తో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. మార్కస్ స్టోయినీస్(29 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 45), మ్యాట్ రేన్‌షా(33 బంతుల్లో 2 ఫోర్లతో 37), జోష్ ఇంగ్లీస్(17 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 37) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్(2/44) రెండు వికెట్లు తీయగా.. మాథ్యూ హంఫ్రేస్, జార్జ్ డాక్‌రెల్, హ్యారీ టెక్టర్ తలో వికెట్ తీసారు. అనంతరం ఐర్లాండ 16.5 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌటైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. డేంజరస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్6) రెండో ఓవర్‌లోనే రనౌటయ్యాడు. దాంతో క్రీజులోకి వచ్చిన కామెరూన్ గ్రీన్(21), జోష్ ఇంగ్లీస్(37) దూకుడుగా ఆడారు. కానీ భారీ షాట్ ఆడే ప్రయత్నంలో కామెరూన్ గ్రీన్ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో పవర్ ప్లేలో ఆసీస్ 2 వికెట్లకు 64 పరుగులు చేసింది. జోష్ ఇంగ్లీస్, మ్యాట్ రేన్‌షా కూడా వెనుదిరిగ్గా.. మార్కస్ స్టోయినీస్ దూకుడుగా ఆడాడు. హాఫ్ సెంచరీ ముంగిట అతను ఔట్ కావడంతో ఆసీస్ 182 పరుగులకే ఆలౌటైంది. అనంతరం ఐర్లాండ్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. జార్జ్ డాక్‌రెల్(41) ఒక్కటే ఒంటరి పోరాటం చేశాడు. అతను కూడా ఔటవ్వడంతో ఐర్లాండ్‌కు ఘోర పరాజయం తప్పలేదు. గ్రూప్‌బీలో రెండు మ్యాచ్‌లకు రెండు ఓడిన ఐర్లాండ. సూపర్ 8 అవకాశాలను చేజార్చుకుంది.

# ఆస్పత్రిలో అభిషేక్ శర్మ..

## నమీబియాతో మ్యాచ్‌లో ఆడేది డౌటే !

ముంబై : ఇండియన్ ఓపెనింగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఆస్పత్రి పాలయ్యారు. కడుపు ఇన్‌ఫెక్షన్ వల్ల అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో అతను టీ20 వరల్డ్ కప్‌లో నమీబియాతో జరిగే మ్యాచ్‌లో ఆడేది అనుమానంగా ఉన్నది. గ్రూప్ స్టేజ్‌లో గురువారం నమీబియాతో మ్యాచ్ జరగాల్సి ఉన్నది. అయితే అమెరికాతో మ్యాచ్ జరగడానికి ముందు కూడా అతని ఆరోగ్యం సరిగా లేదని తెలిసింది. మ్యాచ్ ఆడిన తర్వాత అభిషేక్ ఆరోగ్యం క్షీణించినట్లు తెలిసింది. అధిక ఉష్ణోగ్రతలతో అతను బాధపడ్డాడు. అమెరికాతో మ్యాచ్ ముందు అతనికి రిలీఫ్ మెడిసిన్ ఇచ్చారు.



# పురాతన జంతు చర్మం..

ఒరెగాన్ రాష్ట్రంలోని ఫోర్ట్ రాక్ బేసిన్ ప్రాంతంలో ఉన్న కూగర్ మౌంటెన్ కేవ్ అనే రాతి ఆశ్రయంలో పురావస్తు శాస్త్రవేత్తలు అత్యంత ప్రాముఖ్యమైన ఆధారాలను కనుగొన్నారు. ఇజ్రాయెల్ పత్రిక 'హారెట్జ్' నివేదిక ప్రకారం, తాడు (కోర్డు) ద్వారా కలిపిన రెండు చిన్న జంతు చర్మపు ముక్కలు అక్కడ లభించాయి. ఇవే ఇప్పటి వరకు గుర్తించిన అత్యంత పురాతనంగా జంతు చర్మానికి సంబంధించిన ఆధారాలుగా పరిశోధకులు భావిస్తున్నారు. ఈ చర్మపు ముక్కలు ఖచ్చితంగా ఏ ఉపయోగానికి వచ్చాయో తెలియకపోయినా, అవి కోటు భాగంగా, మొకాసిన్ (పాదరక్ష)గా లేదా గుడారానికి సంబంధించిన భాగంగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ అవశేషాలు సుమారు 12,900 నుంచి 11,700 సంవత్సరాల క్రితం నాటివి. ఆ



కాలంలో భూమిపై వాతావరణం ఒక్కసారిగా మారింది. ఉష్ణోగ్రతలు తగ్గి, ఉత్తరార్ధగోళం మరింత చల్లగా, పొడిగా మారింది. అటువంటి పరిస్థితుల్లో మనుషులు తమను చలిలో కాపాడుకోవడానికి వేడిమి ఇచ్చే వస్త్రాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. కూగర్ మౌంటెన్ కేవ్‌లో మొక్కల ఫైబర్‌తో తయారైన అనేక రకాల తాడులు కూడా లభించాయి. ఈ తాడులు వేర్వేరు మందాలు, నాణ్యతలు కలిగి ఉండటం వల్ల అవి వివిధ అవసరాల కోసం ఉపయోగించబడ్డాయని తెలుస్తోంది. ఇదే ప్రాంతానికి సమీపంలో ఉన్న పైస్లీ కేవ్‌లో, ఇంకా వెంట్రుకలు ఉన్న కుందేలు చర్మపు పట్టీని కూడా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇది ఇటీవలి కాలం వరకు ఒరెగాన్‌లో నివసించిన నార్తర్న్ పైయుట్ గిరిజనులు ఉపయోగించిన కుందేలు చర్మపు దుస్తులను పోలి ఉంది. ఈ పరిశోధన మానవ వస్త్రాల చరిత్రను, అలాగే ఉత్తర అమెరికాలో ప్రాచీన మానవుల జీవన విధానాన్ని అర్థం చేసుకోవడంలో ఒక కీలక మైలు రాయిగా నిలుస్తోంది.

# ఐరన్ ఏజ్ నివాసాలు..






ఉత్తర స్కాట్లాండ్‌లోని హైలాండ్స్ ప్రాంతంలో ఉన్న విండ్‌హిల్ వద్ద మురుగు వ్యవస్థ అభివృద్ధి పనుల కోసం సుమారు ఒక మైలు పొడవున తవ్వకాలు చేపట్టిన సమయంలో, పురావస్తు శాస్త్రవేత్తలు ఒక ముఖ్యమైన చారిత్రక ఆధారాలను కనుగొన్నారు. ఈ తవ్వకాల్లో ఇనుప యుగానికి చెందిన ఒక గ్రామ అవశేషాలు, సమాధులు వెలుగులోకి వచ్చాయి. ఇవి ప్రధానంగా క్రీ.శ. ఆరవ శతాబ్దానికి చెందినవిగా భావిస్తున్నారు. పురావస్తు పరిశోధక బృందం, వృత్తాకార నిర్మాణాలతో ఉండే రెండు ఇనుప యుగ (ఐరన్ ఏజ్) నివాసాలను గుర్తించింది. వీటిని రౌండ్‌హౌసెస్‌గా పిలుస్తారు. ఈ గృహాల సమీపంలోనే రెండు ఇనుప ఖనిజాన్ని కరిగించే కేంద్రాలు కూడా ఉన్నాయి. ఇది ఆ ప్రాంతంలో అప్పట్లో లోహ పనులు జరుగుతుండేవని స్పష్టంగా సూచిస్తోంది. ఈ లోహ తయారీ ఆధారాలు ఈ ప్రాంత పురావస్తు చరిత్రకు విలువైన సమాచారాన్ని జోడిస్తాయని వెస్ట్ కోస్ట్ ఆర్కియాలజికల్ సర్వీసెస్‌కు చెందిన పురావస్తు శాస్త్రవేత్త స్టీవెన్ బిర్చ్ అంటాడు. ఈ ప్రదేశంలో మట్టి పాత్రలు ఏవీ లభించకపోవడం కూడా ఒక విశేష అంశం. దీని ఆధారంగా, ఈ ప్రాంతంలో నివసించిన ఇనుప యుగ ప్రజలు మట్టి పాత్రలు ఉపయోగించకుండా, కలపతో తయారైన పాత్రలను వినియోగించి ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. అదనంగా, సుమారు 30 అడుగుల వ్యాసంతో ఉన్న మూడు వృత్తాకార సమాధులను కూడా గుర్తించారు. ఇవి ప్రాచీన స్కాట్లాండ ప్రజల జీవన విధానం, సంసృతి గురించి మరింత లోతైన అవగాహనను అందిస్తున్నాయి.




# వెలుగు చూసిన ప్రాచీన శిలా స్మారకం



తీవ్రమైన కరువు ప్రభావంతో స్పెయిన్‌లోని ఒక జలాశయంలో నీటి మట్టం గణనీయంగా పడిపోయిన సందర్భంలో, దశాబ్దాలుగా నీటిలో మునిగిపోయి ఉన్న ఒక అతి ప్రాచీన శిలా స్మారకం మళ్లీ వెలుగులోకి వచ్చింది. ఇది సుమారు 7,000 సంవత్సరాలకు పూర్వ నాటిదని పురావస్తు నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే ఇది ఈజిప్టు పిరమిడ్లు, బ్రిటన్‌లోని స్టోన్‌హెంజ్ వంటి ప్రసిద్ధ నిర్మాణాల కంటే కూడా పురాతనమైన కాలానికి చెందినదని అర్థం. ఈ విషయం ప్రపంచవ్యాప్తంగా చరిత్ర పరిశోధకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ప్రదేశంలో ఒక వరుసగా నిలబెట్టిన పెద్ద రాళ్లు ఒక నిర్దిష్ట క్రమంలో అమర్చబడి ఉండటం విశేషం. ఇది సహజంగా ఏర్పడిన రాతి నిర్మాణం కాదని, అప్పటి మానవులు ఉద్దేశపూర్వకంగా నిర్మించారని స్పష్టమవుతోంది. లిఖిత చరిత్ర లేని కాలంలోనే ఇంత సుసంపన్నమైన నిర్మాణాన్ని రూపొందించడం, ఆ సమాజంలో ఉన్న ఆలోచనా శక్తిని, సాంకేతిక అవగాహనను సూచిస్తుంది. ఇరవయ్యవ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని జలాశయంగా అభివృద్ధి చేసినప్పుడు, ఈ పురాతన స్మారకం పూర్తిగా నీటిలో మునిగిపోయింది. అప్పటి నుంచి అనేక దశాబ్దాల పాటు అది మన కంటికి కనిపించకుండా నీటిలోనే ఉండిపోయింది. ఇప్పుడు వాతావరణ మార్పులు, దీర్ఘకాలిక కరువు పరిస్థితుల కారణంగా నీరు తగ్గడంతో, ఇది మళ్లీ మన ముందు నిలిచింది.మనం ఉపయోగిస్తున్న ఆధునిక నిర్మాణాల కింద, జలాశయాల లోతుల్లో, భూమి పొరల మధ్య ఇంకా అనేక మానవ చరిత్ర రహస్యాలు దాగి ఉండొచ్చు. సరైన సమయం వచ్చినప్పుడు అవి వెలుగులోకి వచ్చి, ప్రాచీన నాగరికతలపై మన అవగాహనను మరింత లోతుగా, విస్తృతంగా మార్చగలవు.

## 26వ డివిజన్‌లో ఓటేసిన సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 26వ డివిజన్ పరిధిలో ఓటు ఉన్న ఆయన సింగరేణి స్కూల్లో తన ఓటు వేశారు. సిపిఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ అన్ని పోలింగ్ బూత్‌లసమీపంలో పార్టీ శ్రేణులకు ధైర్యాన్ని నింపుతూ ముందుకు సాగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ వ్యాప్తంగా 36కి పైగా స్థానాల్లో సిపిఐ విజయం సాధిస్తుందని ఆశాభావాన్నివ్యక్తం చేశారు. రామవరం ఏరియాలోని పోలింగ్ బూతుల వద్ద పోలీసులు అతి ఉత్సాహాన్ని ప్రదర్శించడంతో ఆయన అసహనాన్ని వ్యక్తం చేశారు. అతేగాక ఒకానొక దశలో సిపిఐ,కాంగ్రెస్ కార్యకర్తల మధ్య పెద్ద ఎత్తున వాగ్వాదం చోటు చేసుకోవడంతోఅది తీవ్ర రూపాం దాల్చగా ఆయన తనదైన శైలిలో వ్యవహరించారు.

**సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి ఫయాజ్**



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కొల్లాపూర్ మున్సిపాలిటి పదో వార్డులో యుపిఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన 20వపోలింగ్‌బూత్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తమ కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ప్రతి ఎన్నికల్లో ఓట్ల పోలింగ్‌శాతం పెరగాలని తెలియజేశారు.

## సార్వత్రిక సమ్మెకు మద్దతుఇవ్వండి

**ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి**

**ప్రజాపక్షం/హయత్ నగర్:** నేడు కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు మద్దతు ఇవ్వాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి కోరారు. బుధవారం ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం హయత్నగర్ మండల కమిటీ కార్మికుల అడ్డా కన్వీనర్ శీను అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమములో 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాన్ని ,గోడపత్రికను ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ 106 సంవత్సరాలుగా అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా చేసి కార్మికులను బానిసలుగా చేసే చట్టాలను రద్దు చేయాలని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని, ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి లో ప్రైవేటు భాగస్వామ్యాన్ని నిలిపివేయాలని న్యాయపరమైన డిమాండ్లతో నేడు జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రజా సంఘాలతో పాటు రైతులు, కాంట్రాక్టర్ రంగంలో పనిచేస్తున్నటువంటి కార్మికులు భారీగా పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హయత్ నగర్ మండల కార్యదర్శి ఎస్ శ్రీదేవి,సహాయ కార్యదర్శి మర్రి శోభన్,కార్యదర్శి కొప్పుల సరిత,డిహెచ్ పిఎస్ నియోజకవర్గ కార్యదర్శి పాల్వాయి సురేందర్, ఎఐటియుసి నాయకులు సోమయ్య గౌడ్,పుల్లయ్య, మల్లేష్‌తో పాటు ప్రజాసంఘాల నాయకులు,కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక వ్యతిరేకి మోదీ సర్కార్

**నేటి కార్మిక జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి**

**మాజీ చీఫ్ విప్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్**



**ప్రజాపక్షం/హనుమకొండ :** నేటి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఫిబ్రవరి 12 గురువారం దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం పిలుపునిచ్చిన సమ్మెకు మద్దతుగా అన్ని కార్మిక సంఘాలతో కలిపి బుధవారం రోజున వేయి స్తంభాల దేవాలయం నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద దాస్యం వినయ్ భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ నేటి జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అన్ని కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. వ్యాపార సముదాయాలు, ఫ్యాక్టరీలు, కార్మికులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా బంద్ పాటించి, సమ్మెలో పాల్గొనాలని కోరారు. కేంద్రంలోని బిజెపి మోదీ సర్కారు 12 ఏళ్లలో కార్మిక లోకానికి మేలు చేయకపోగా, పూర్తిగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు.29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాయాలని కేంద్రం యోచిస్తోందని తెలిపారు.కార్మికులకు పని తగ్గ వేతనం, వేతనం కోసం ఉద్యమం, ఉద్యమించేందుకు యూనియన్లు ఉండకుండా చేయాలనే కుట్రలను కేంద్రం నూతన కార్మిక చట్టాల రూపంలో తీసుకొచ్చిందని వివరించారు.

కార్మికులందరు హక్కులు సాధించుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, బిఆర్‌టియు హనుమకొండ జిల్లా కన్వీనర్ నాయిని రవి, నాయకులు కాటపూర్ రాజు, రఘు, అరుణ్ కుమార్, రవి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్, టి.ఉప్పలయ్య, బొట్ల చక్రపాణి, కారు ఉపేందర్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు రాజేందర్, ఎఐసిటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రావు, ఎంఎటిఎడియు అధ్యక్షులు ఈసంపెల్లి సంజీవ, శ్రీధర్ రెడ్డి, బాబు, జయరాం, పేయింటర్ సంఘం జిల్లా అధ్యక్షులు రాజారపు రాజు, చిరు వ్యాపారుల సంఘం ఎండీ ఇస్మాయిల్, టిబిఎస్ఆర్‌కెపి శివకుమార్, భిక్షపతి, రాజు, జిడబ్ల్యూఎంసి భిక్షపతి, ధర్మరాజు, రామ్మూర్తి, ప్రతాప రుద్ర ఆటో యూనియన్ నర్సింగ్, హోటల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బాబు రావు, తదితరులు పాల్గొన్నారు.




# సార్వత్రిక బంద్‌కు మద్దతుగా జీడిమెట్లలో కార్మిక సంఘాల బైక్ ర్యాలీ

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న నిర్వహించనున్న సార్వత్రిక బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ, బుధవారం జీడిమెట్ల పారిశ్రామికవాడలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వివిధ పరిశ్రమలకు చెందిన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు స్వామి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎఐటియుసి కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు హరినాథరావు, నాయకులు నర్సింహారెడ్డి, మహేందర్, కె.శ్రీనివాస్, నాగయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి అశోక్, ఆంజనేయులు, కె.శీను, స్వాతి, ఐఎఫ్‌టియు నాయకులు శివబాబు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

**సమ్మెను జయప్రదం : ఏసురత్నం పిలుపు**

నేడు నిర్వహించన్ను సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం పిలుపునిచ్చారు. బుధవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్‌స్టాప్ సమీపంలో జీహెచ్ఎంసి కార్మికులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ సమ్మెలో ప్రతీ ఒక్కరూ ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి కార్మికులు, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# సిపిఐ నేత దోటి పాండరికి అంతిమ వీడ్కోలు

**పాడెమోసిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి**



**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్) :** సిపిఐ మండల సహాయ కార్యదర్శి దోటి పాండరి అకాల మరణం జిల్లా కమ్యూనిస్టు శ్రేణుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఉద్యమానికి అంకితమైన నాయకుడిని కోల్పోయామని పార్టీ నేతలు, కార్యకర్తలు శోకసంద్రంలో మునిగిపోయారు. బుధవారం కురంపల్లి గ్రామంలో డప్పుల చప్పుళ్లు, ఆటపాటలతో పాండరి అంత్యక్రియలు నిర్వహించగా ఆయన పాడెను సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి మోసి అంతిమ సంస్కరణ కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించి అంతిమ వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి స త్యం పాండరితో తమకు ఉన్న సన్నిహిత సంబంధాలను,ఆయన ఉద్యమ జీవనాన్ని వారు గుర్తుచేసుకున్నారు. కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానంలో భాగంగా పాండరి అనేక కేసులను ఎదుర్కొని, శిక్షలు అనుభవించి, శత్రువుల దాడులను ధైర్యంగా అధిగమించారన్నారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మగ్దుంభవన్‌లో నివసిస్తూ, పార్టీ చేపట్టిన అనేక ఉద్యమ కార్యక్రమాల్లో వయసును లెక్కచేయకుండా చురుకుగా పాల్గొన్న అంకితభావి చాటరని గుర్తు చేశారు. మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అంత్యక్రియలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు,జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం, బుల్గారి నరసింహ, టి,వెంకటేశ్వర్లు,నల్పరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి సత్యనారాయణ,శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య గుర్రం వెంకట్ రెడ్డి, జలసాధన సమితి నాయకులు సత్యనారాయణ, రమేష్,గిరి రమ,కురంపల్లి సర్పంచ్, కస్తాల సర్పంచ్ పార్టీ శ్రేణులు ఉన్నారు.



## వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలన

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు కొత్త మున్సిపాలిటీ ఎన్నికల సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు జిల్లా మున్సిపాలిటీకి మొదటి సరిగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని పోలింగ్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీ) సంపత్‌రావు, ఈడిఎం దేవేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పోలింగ్ పరిశీలించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 30 వార్డులల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు ఇతర ముఖ్య నేతలతో కలిసి పరిశీలిస్తూ, ఓటర్లకు అందిస్తున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, మరియు ఎన్నికల నిర్వహణ తీరుపై అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భూపాలపల్లి పట్టణ ప్రజలు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొనడం సంతోషించ దగ్గ విషయమన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే విచ్చలవిడిగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేశారన్నారు.

## కౌంటింగ్ సిబ్బంది విధిగా శిక్షణ తరగతులకు హాజరు కావాలి

జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు నియమితులైన కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. కౌంటింగ్ విధులకు నియమించబడిన సిబ్బందిని వారి సంబంధిత అధికారులు రెండు రోజులపాటు విధుల నుండి విడుదల చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ శిక్షణ తరగతి 12.02.2026 తేదీన ఉదయం 10:30 గంటలకు అంబేద్కర్ స్టేడియంలోని మినీ ఫంక్షన్ హాల్, భూపాలపల్లిలో నిర్వహించబడుతుందని తెలిపారు. నియమితులైన సిబ్బంది అందరూ సమయానికి హాజరై శిక్షణలో పాల్గొనాలని సూచించారు. అలాగే, కౌంటింగ్ విధులు 13 02.2026 తేదీన ఉదయం 7:00 గంటలకు అదే ప్రాంగణంలో ప్రారంభమవుతాయని, అందరూ తప్పనిసరిగా హాజరై తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

## ఓటర్లకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం



జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/వరంగల్ :** మున్సిపల్ ఎన్నికలను ప్రజాస్వామ్యానికి పచ్చని పండుగగా మార్చాలనే లక్ష్యంతో వరంగల్ జిల్లా పరిపాలన వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటిల పరిధిలో పోలింగ్ శాతాన్ని పెంచడంతో పాటు, ఓటర్లలో పర్యావరణ చైతన్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన హరిత, పర్యావరణహిత పోలింగ్ స్టేషన్లను బుధవారం కలెక్టర్ స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు చేరువ చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించేందుకు హరిత పోలింగ్ కేంద్రాలు, ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానం, సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్, శానిటేషన్ అంశాలతో ప్రత్యేక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్ధన్నపేట పట్టణంలోని ఫిరంగిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హరిత పోలింగ్ కేంద్రం పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణహిత అలంకరణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నర్సంపేట పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హరిత పోలింగ్ స్టేషన్, బొందబడి ప్రభుత్వ పాఠశాలలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రత్యేక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, ఆర్డీవోలు సుమా, ఉమారాణి, జిల్లా నోడల్ అధికారులు భాగ్యలక్ష్మి, పుష్పలత, తహసీల్దార్లు విజయ్, రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత సేవల మహామనిషి ''జూలూరు జీవితం''



**ప్రజాపక్షం/గూడూరు:** ఏజెన్సీ ప్రాంతంలో చిన్న దుకాణంతో తన వ్యాపార జీవితాన్ని ప్రారంభించి, నర్సంపేట గూడూరు ప్రాంతాల్లో ఉన్నతమైన సేవలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన వ్యక్తి జూలూరు లక్ష్మినారాయణ కష్టపడి పనిచేస్తే గౌరవం నమ్మకం స్వయంగా వస్తాయనే మాటను తన జీవితంతో నిరూపించిన వ్యక్తిగా ఆయన అందరికీ గుర్తుండిపోతారు. ప్రారంభ దశలో ఎన్నో కష్టాలు సవాళ్లు ఎదురైనా వెనకడుగు వేయకేండా ముందుకు సాగారు. వ్యాపారం అంటే లాభం మాత్రమే కాదు వినియోగదారులకు నిజాయితీగా సేవ చేయడమే అసలైన మూలధనం అన్న సిద్ధాంతాన్ని పాటిస్తూ ఆయన దుకాణాన్ని అభివృద్ధి చేశారు. అందుకే ఆయన వద్దకు వచ్చిన ప్రతి కస్టమర్ ఒకసారి వచ్చిన తర్వాత మళ్లీ మళ్లీ రావడం అలవాటుగా మారింది. నర్సంపేట గూడూరు పరిసర ప్రాంతాల్లో నాణ్యత విశ్వసనీయతకు చిరునామాగా జూలూరు లక్ష్మినారాయణ పేరు నిలిచిపోయింది. వ్యాపారంతో పాటు సామాజిక భాధ్యతను కూడా గుర్తించిన వ్యక్తిగా స్థానికులు అభిమానాన్ని చూరగొన్నారు.

# పరకాలలో పోలింగ్ 80.16 శాతం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్

**ప్రజాపక్షం/హనుమకొండ:** హనుమకొండ జిల్లాలోని పరకాల మున్సిపాలిటీ లో 22 వార్డు స్థానాలకు గాను బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పరకాల మున్సిపాలిటీ పరిధిలో 44 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ కేంద్రాలలో ఉదయం 7 నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ సాగింది. ఆయా వార్డుల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డు స్థానాలకు గాను 44 పోలింగ్ కేంద్రాలలో నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా సాగినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. పోలింగ్ 80.16 శాతం నమోదయినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ 13 వార్డులను సమస్యాత్మకంగా గుర్తించామని, వీటి పరిధిలో 26 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలో సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ 80.16 శాతంగా నమోదయింది. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. వెలమవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో (మూడో వార్డు) ఆరో పోలింగ్ కేంద్రాన్ని.. మోడల్ పోలింగ్ కేంద్రంగా అధికారులు ఏర్పాటు చేయగా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ ఎన్.రవి పరిశీలించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరకాల మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్‌తో పాటు పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, పరకాల మున్సిపాలిటీ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపిడీవో రవీందర్, ఇతర అధికారులు ఉన్నారు. రెండో సాధారణ మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా పరకాలలో పోలింగ్ ప్రక్రియను జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు కె.శివకుమార్ నాయుడు పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని పరకాలలోని గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు తరలించారు. 22 వార్డుల సంబంధించి 44 పోలింగ్ కేంద్రాల వారీగా బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రితో ఎన్నికల సిబ్బంది స్ట్రాంగ్ రూమ్‌నకు చేరుకున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు.

## స్వతంత్ర అభ్యర్థి ఇంటిపై మద్యం సీసాలతో దాడి



**ప్రజాపక్షం/ ములుగు :** ములుగు మున్సిపాలిటీ పరిధిలో మూడవ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న పినిగాని జ్యోతి రఘువీర్ ఇంటిపై మంగళవారం అర్థరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సీసాలతో దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న అభ్యర్థి మమ్మల్ని పోటీ నుండి విరమించుకోవాలని పలుమార్లు బెదిరించాడని తాము వినకుండా బరిలో నిలిచినందుకు భయభ్రాంతులకు గురి చేసేందుకు ఆయనే మద్య సీసాలతో దాడి చేయించి ఉంటానని రఘువీర్ అనుమానం వ్యక్తం చేశారు.

## మేమూ ఓటర్లమే.. మాకేదీ డబ్బు?

బిఆర్ఎస్ అభ్యర్థిని మహిళల నిలదీత



**ప్రజాపక్షం/జనగామ :** ఓటర్లకు డబ్బులు ఇవ్వలేదని మహిళలు ఆందోళన చేసిన సంఘటన జనగామ పట్టణంలోని 23వ వార్డులో జరిగింది. ఈ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అయితే కొందరికి డబ్బులు ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడంతో వారంతా సరస్వతి స్కూల్ పోలింగ్ సెంటర్ వద్ద ఆందోళన చేశారు. రెండు పర్యాయాలు ఓట్లు వేసి గెలిపించామని ఒక్క రోడ్డు వేయని ఆయన మళ్లీ ఇప్పుడు పోటీ చేస్తూ కొందరికి మాత్రమే డబ్బులు ఇచ్చి మరికొందరికి ఇవ్వలేదని మండిపడ్డారు. చేతగాని వ్యక్తి ఎందుకు పోటీ చేయాలంటు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సోషల్ మీడియా ద్వారా వ్యాపించడం చర్చనీయాంశంగా మారింది.

# పేద ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

రూ.1.59 కోట్ల విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/హనుమకొండ :** పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా కొండంత అండగా నిలుస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ గోకుల్ నగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం హనుమకొండ, కాజీపేట మండలాలకు సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మొత్తం 159 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 1,59,18,444 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆడబిడ్డల వివాహాల కోసం తల్లిదండ్రులు అప్పుల పాలు కాకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన ఆశయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యం నాణ్యతపై కేంద్రాన్ని నిలదీసిన ఎంపి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తెలంగాణలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా పంపిణీ అవుతున్న బియ్యం నాణ్యతపై లోక్‌సభలో వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత మూడేళ్లుగా పిడిఎస్ బియ్యం నాణ్యతపై ఫిర్యాదుల పరిస్థితి ఏమిటి? కేంద్ర సంస్థలు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) నిర్వహించిన తనిఖీల వివరాలేమిటి? నాణ్యతలో లోపాలు తలెత్తితే తీసుకున్న చర్యలేమిటి? సరఫరా వ్యవస్థ పర్యవేక్షణ, పారదర్శకత కోసం చేపట్టిన చర్యలేమిటి? అంటూ కేంద్రం ప్రభుత్వాన్ని ఎంపి డాక్టర్ కడియం కావ్య సమగ్రంగా వివరణ కోరారు. ఈ ప్రశ్నకు స్పందించిన కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషి తెలంగాణలో పిడిఎస్ బియ్యం నాణ్యతపై గత మూడేళ్లు, ప్రస్తుత సంవత్సరంలో ఒక్క ఫిర్యాదూ అందలేదని లోక్‌సభలో స్పష్టం చేశారు. తెలంగాణ డిసిపి రాష్ట్రం కావడంతో, రాష్ట్ర ప్రభుత్వమే 100 శాతం నాణ్యత తనిఖీలు నిర్వహించి ధాన్యాలను కొనుగోలు చేసి, నిల్వ చేసి, కేంద్ర ప్రమాణాల ప్రకారం పిడిఎస్ ద్వారా పంపిణీ చేస్తోందని కేంద్ర మంత్రి వివరించారు. ఎఫ్‌సీఐ–రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త బృందాలు నిల్వ కేంద్రాల్లో నిర్వహించిన తనిఖీల్లో 2022–23లో 542, 2023–24లో 380, 2024–25లో 482, 2025–26లో (జనవరి వరకు) 268 తనిఖీలు జరిగాయని తెలిపారు. ఏ దశలోనూ మానవ వినియోగానికి అనర్హమైన ధాన్యం గుర్తించలేదన్నారు. పిడిఎస్ వ్యవస్థలో నాణ్యత, పారదర్శకత పెంచేందుకు విజిలెన్స్ కమిటీలు, ఈ–పాస్ యంత్రాలు, ఆధార్ ఆధారిత పంపిణీ, ఆన్‌లైన్ ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ, 'మేరా రేషన్' యాప్ అమల్లో ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య లేవనెత్తిన ప్రశ్నతో పిడిఎస్ వ్యవస్థపై పార్లమెంట్ దృష్టి కేంద్రీకృతమైందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

## 22వ వార్డులో డబ్బుల కలకలం

పట్టుబడ్డ బిఆర్ఎస్ అభ్యర్థి,రూ.1,20,000నగదు స్వాదీనం

ఒకరిపై కేసు నమోదు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిదిలోని 22 వార్డులో పోలింగ్ స్టేషన్ మాస్టర్ మైండ్ పాఠశాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బుర్ర రమాదేవి సదానందం అనుచరులు ఓటర్లకు డబ్బులు పంచుతూ ప్రలోభాలకు గురి చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నమునూరి హేమలత రజిని కాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాగిర్తి పేటకు చెందిన బిఆర్ఎస్ నాయకుడు ఓటర్లకు నగదు 5వేలు కట్టలు పంచుతున్నట్లు గుర్తించారు. 22 వార్డులో అతన్ని అదుపులోకి తీసుకొనే ప్రయత్నంలో డబ్బులను అక్కడే వదిలేసి పారిపోయాడు పోలీసులు అక్కడికి చేరుకొని డబ్బులను పట్టుకున్నట్లు తెలిసింది. వారి వద్ద నుంచి సుమారు లక్ష ఇరవై వేల నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. సంబంధిత అభ్యర్థిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

## గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం

సర్పంచ్ అనిత నర్సింగారావు



**ప్రజాపక్షం/వేలేరు :** ఐక్యంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని పీచర గ్రామసర్పంచ్ మరిజె అనిత నర్సింగారావు అన్నారు.బుధవారం వేలేరు మండలంలోని పీచర గ్రామపంచాయితీ కార్యాలయంలో గ్రామసభ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అనిత మాట్లాతూ గ్రామంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మంజూరైన వారు ఆర్థిక పరిస్థితుల కారణంగా నిర్మాణం చేపట్టనటువంటి వారికి ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఓ సొసైటీ ద్వారా వారే నిర్మించే కార్యక్రమం ఉంది కనుక అలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతంగా పూర్తి చేసుకోవాలని, అలాగే గ్రామంలోని పలుకాలనీలలో విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేయడంతో పాటు వీధిలైట్ల వేయడం, వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీరు సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనితనర్సింగారావు, ఉపసర్పంచ్ గుడికందుల ప్రశాంత్, డా.వైశాలి, హౌజింగ్ ఎఇ జాన్సి, గ్రామపంచాయితీ కార్యదర్శి రాజిరెడ్డి, వైద్యసిబ్బంది శ్యామల, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు, గ్రామపంచాయితీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## హన్మకొండ జడ్‌పి మాజీ వైస్ చైర్మన్‌పై ఇసుక మాఫియా దాడి

ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్‌కు నలుగురు మాజీ ఎమ్మెల్యేలు ఫిర్యాదు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామ శివారులోని అకెరు వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ అక్రమ ఇసుక రవాణాపై వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి ఎస్.అంకిత్ కుమార్‌కు ఫిర్యాదు చేసినందుకు ఇసుక మాఫియాను నడిపిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బుర్ర రాజకుమార్ తన ప్రైవేట్ గుండాలతో బెదిరిస్తూ దాడికి పాల్పడిన సంఘటన నందనం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం, స్థానిక ఎమ్మెల్యే అండదండలతో, ఐనవోలు ఎస్ఐ కనుసన్నల్లోనే యథేచ్ఛగా ఈ అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. యథేచ్ఛగా అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్న మాఫియాపై మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అత్వాలే) తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరికంటి సంజీవ రావు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు, సోషల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఇండియా యూనియన్ మినిస్టర్ డాక్టర్ రాందాస్ అత్వాల్‌కు దేశ రాజధాని ఢిల్లీలో ఫిర్యాదు చేశారు. దీంతో కేంద్రమంత్రి అత్వాల్ విచారణకు ఆదేశించారు. కాగా వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ ఎస్.అంకిత్ కుమార్ విచారణ నిమిత్తం సోమవారం ఆకేరు వాగు సందర్శించారు. ఆ సమయంలో స్థానిక ఎస్సై అక్రమ ఇసుక దందా ఏది కొనసాగడం లేదని డీసీపీ అంకిత్‌ను తప్పుదోవ పట్టిస్తున్న క్రమంలో హన్మకొండ జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గజ్జెళ్ళి శ్రీరాములు దగ్గర ఉండి ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి తీసుకెళ్లి చూపించారు. దీంతో ఇసుక మాఫియా నడిపిస్తున్న బుర్ర రాజ్ కుమార్ ఆగ్రహానికి గురై ప్రైవేటు గుండాలతో దారి అడ్డగించి గజ్జెళ్ళి శ్రీరాములుపై దాడికి దిగారు. కాగా పరిస్థితి చివరకు హింసాత్మక దశకు చేరుకుంది. అక్రమ ఇసుక రవాణాకు వ్యతిరేకంగా ప్రశ్నించినందుకు హనుమకొండ జెడ్పీ మాజీ వైస్ చైర్మన్, బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకుడు గజ్జెల్లి శ్రీరాములుపై దాడి జరగడం విచారకరమని పలువురు పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణాపై తక్షణమే ఉన్నతస్థాయి విచారణ చేపట్టి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీకి చెందిన నలుగురు మాజీ ఎమ్మెల్యేలు తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, వన్నాల శ్రీరాములు, ఒంటేరు జయపాల్, కొండేటి శ్రీధర్‌లు వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీకి పిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా ఇల్లందులో చట్టం పనిచేస్తుందా? లేక ఇసుక మాఫియా రాజ్యమేలుతుందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు నందనం గ్రామంలో మార్మోగుతున్నాయి.

# జనగామలో పోలింగ్ ప్రశాంతం

స్టేషన్‌ఘనపూర్‌లో అత్యధికంగా పోలింగ్

ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్, ఎమ్మెల్యే పల్లా



**ప్రజాపక్షం/జనగామ :** జనగామలో మున్సిపల్ ఎన్నిల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. చెదురు ముదురు సంఘటలను మినహా జిల్లాలోని రెండు మున్సిపాల్టీల్లో ఎలాంటి సంఘటనలు జరగలేదు. దీనితో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో పోలిస్తే పోలింగ్ శాతం కూడా పెరిగింది. ఉదయం నుండే ఓటర్లు భారులు తీరి ఓటు వేశారు. ఉదయం 9 గంటలకు జనగామ మున్సిపాల్టీలో 10.09 శాతం, స్టేషన్‌ఘనపూర్ మున్సిపాల్టీలో 11.53 శాతం పోలింగ్ జరగగా మధ్యాహ్నం 1 గంటలకు జనగామలో 46.65 శాతం, స్టేషన్‌ఘనపూర్‌లో 56.38 శాతం ఓలింగ్ జరిగింది. 3 గంటలకు జనగామలో 65.10 శాతం పోలింగ్ జరగగా, స్టేషన్‌ఘనపూర్‌లో 74.13 శాతం పోలింగ్ జరిగింది. ఓటర్లు ఉదయం భారులు తీరి ఓటు వేయగా మధ్యాహ్నం నుండి మందకొడిగా జరిగింది. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులకు ఓట్ల లెక్కింపు జరిగే హైదరాబాద్ రోడ్డులోని ఏకశీల బిఇడి కళాశాలకు తరలించి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**చెదురుముదురు సంఘటనలు**

పోలింగ్ సందర్భంగా చెదురుముదురు సంఘటనలు జరిగాయి. 22వ వార్డు పోలింగ్ ఏకశీల పబ్లిక్ స్కూల్‌లో జరగగా బిఆర్ఎస్‌కు చెందిన ఎజెంట్ నిత్యం బయటకు వెళ్లి వస్తుంటే పోలీసులు మందలించారు. ఆ విషయం తెలుసుకొని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అక్కడకు చేరుకోగా పోలీసులు నచ్చజెప్పి పంపించారు. నాలుగో వార్డు పోలింగ్ జరిగే సెయింట్ మేరీస్ హైస్కూల్‌కు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెళ్లి పోలింగ్ సరళి పరిశీలిస్తున్న సందర్భంలో కాంగ్రెస్ అభ్యర్థి భర్త మంత్రి శ్రీశైలం ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు మీ పార్టీలో ఉంటే నాశనం చేశారు. ఇప్పుడు పార్టీ మారి మంచిగా ఉందామంటే ఎందుకు వచ్చారని మండిపడ్డారు. దీనితో పోలీసులు జోక్యం చేసుకొని ఎమ్మెల్యేలను అక్కడి నుండి పంపించారు. ఇలా అక్కడక్కడ చెదురు ముదురు సంఘటనలు మినహా జనగామ, స్టేషన్‌ఘనపూర్‌లోనూ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

**పోలింగ్ సరళి పరిశీలన**

పోలింగ్ సరళిని అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ నాయకులతో పాటు జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంఛార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, టిపిసిసి సభ్యులు డాక్టర్ లక్ష్మినారాయణ నాయక్, వేముళ్ల సత్యనారాయణరెడ్డి, కంచె రాములతో పాటు పలువురు పరిశీలించారు. బిఆర్ఎస్ నుండి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు సిద్ధిలింగం, గద్దల నర్సింగరావు తదితరులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ సెయింట్ మేరీస్, ఎబివి హైస్కూల్, జూనియర్ కళాశాల, ధర్మకంచ జిల్లా పరిషత్ స్కూల్‌లో పరిశీలించారు. ఎన్నికల జనరల్ అబ్జర్వర్ నర్సింహారెడ్డి, ఆర్‌డిఓ గోపిరాం, మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్‌రెడ్డిలు, అదనపు కలెక్టర్ పింకేషన్‌కుమార్ స్టేషన్‌ఘనపూర్‌లో స్వయంగా, వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించారు.

**ఓటు వేసిన కలెక్టర్, ఎమ్మెల్యే దంపతులు**

జనగామలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ దంపతులకు 3వ వార్డులో ఓటు ఉండగా సెయింట్ మేరీస్ పాఠశాలలో వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి 5వ వార్డులో ఓటు ఉండగా బాలికల పాఠశాలలో ఓటు వేశారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి 26 వార్డుల్లో గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు.

## పరకాలలో అంతుచిక్కని ఓటరు నాడి




**ప్రజాపక్షం/పరకాల :** మున్సిపల్ ఎన్నికల వేళ పరకాల పట్టణ ఓటర్ నాడి అంతు చిక్కకుండా పోయింది. దీంతో వివిధ రాజకీయ పార్టీల చెంది న అభ్యర్థులు పడుతున్నారు. దీని కారణంగా పరకాలలోని ఓటర్ నాడీని రాజకీయ పరిశీలకు సైతం అంత చెక్కకుండా పోయాయి. పరకాల మున్సిపాలిటీ రాజకీయాలు రాజకీయం రసవత్తరంగా మారింది. గెలుపు గుర్రా లు ఎవరనేది పట్టణ ఓటరు నాడి పసికట్టడం సమస్యగా మారిందని పార్టీలకు చెందిన నాయకులు అనుకుంటున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఓటరు ఎటు మొగ్గు చూపుతున్నాడో తెలియక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ముఖ్యంగా ప్రధాన వార్డుల్లో నెలకొన్న సమీకరణలు గెలుపోటములను ప్రభావితం చేసేలా ఉన్నాయి. బిఆర్ఎస్ పార్టీ 1, 6, 10, 13, 14, 18, 19 వార్డులపై గట్టి ఆశలు పెట్టుకోగా, కాంగ్రెస్ పార్టీ 1, 3, 5, 8, 11, 16, 17, 20 వార్డుల్లో పట్టు నిలుపుకోవాలని చూస్తోంది. అయితే, అత్యధిక వార్డుల్లో త్రిముఖ పోటీ (ట్రైయాంగిల్ ఫైట్) నెలకొనడం సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది. 4, 9, 12, 21, 22 వార్డుల్లో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి మధ్య పోరు హోరాహోరీగా సాగుతోంది. మరికొన్ని చోట్ల ముఖాముఖి పోరు కనిపిస్తోంది. 15వ వార్డులో బిఆర్ఎస్ వర్సెస్ బిజెపి తలపడుతుండగా, 7, 21, 22 వార్డుల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఓటరు తీర్పు ఎవరికి అనుకూలంగా ఉంటుందో తెలియాలంటే ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

## పోలింగ్ కేంద్రాలు.. బందోబస్తును పరిశీలించిన సిపి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లాలోని ఐదు మున్సిపాల్టీలలో బుధవారం జరిగిన ఎన్నికల సరళిని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ పరిశీలించారు. ఏదులాపురం, కల్లూరు, సత్తుపల్లి, వైరా, మధిరలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బంది, పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. అడిషనల్ డిసిపిలు ప్రసాద్‌రావు, రామానుజం, కల్లూరు ఏసిపి వసుంధరయాదవ్‌తో చర్చించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు పటిష్ఠమైన శ్రద్ధ ఏర్పాటు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా తగుచర్యలు తీసుకోవాలని వారికి సూచించారు.

## సమ్మెతో కార్మిక ఐక్యత సత్తా చాటాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక,కర్షక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, సత్తాచాటేందుకు నేడు జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని అఖిలపక్షాల నాయకులు అన్నారు. ఈ మేరకు స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడారు. ప్రాణాలు అర్పించి సాధించుకున్న హక్కులను పాలకులు కాలరాస్తున్నారని , మోదీ సర్కార్‌కు బుద్ధి రావాలంటే అన్ని కార్మిక సంఘాలు ఒక్కతాటిపైకి వచ్చి ఉద్యమించాలన్నారు. స్థానిక ఏపిఏిఐ కార్యాలయం నుండి ఉ.9 గం. నుండి కార్మిక ప్రజా ప్రదర్శన ప్రారంభం అవుతుందని, ఈ మహాప్రదర్శనలో పెద్ద ఎత్తున కార్మికులు,కర్షకులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు నాయకులు ఎంబి నర్సారెడ్డి, నకిరికంటి నాగరాజు, వైవి రామారావు, రమేష్, రత్నం,ఎఐటియుసి నాయకులు సారపాక సతీష్, ఏడుకొండలు, ప్రజాపంథ మాస్ లైన్ నాయకులు కన్నెం కల్యాన్, మునిగెల శివప్రసాద్, బిఆర్‌ఎస్ కార్మిక విభాగం నాయకులు ప్రేమ్ కుమార్, ఐఎన్‌టియుసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి విరాళం



**ప్రజాపక్షం/అశ్వాపురం :** అమ్మగారి గ్రామ పంచాయతీలో బుధవారం గ్రామ సర్పంచ్ ఇర్ప కవిత అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మన గ్రామం మనమే అభివృద్ధి చేసుకోవాలని ఉత్తమ గ్రామ పంచాయితీగా తీర్చిదిద్దుకునే విధంగా పాలకవర్గానికి ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి 3గుంటల భూమిని విరాళంగా ఏలూరి శ్రీనివాసరావు ఇవ్వగా, వారికి గ్రామ ప్రజలు, పాలకవర్గం తరఫున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాను భాదర్, వార్డు మెంబర్లు, మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ నేలట్ల సుధాకర్‌రెడ్డి, జాను శ్రీను, ఎన్‌కే అబ్బల్, తదితరులు పాల్గొన్నారు.

## ఖాతాదారులకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఖాతాదారులంతా బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకుని ఆర్థిక క్రమశిక్షణతో సురక్షితమైన లావాదేవీలు నిర్వహించుకోవాలని జమలాపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ డి.వినోద్‌కుమార్ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్బిఐ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారంలోభాగంగా బుధవారం జమలాపురం గ్రామంలో ఖాతాదారులకు ప్రజలకు ప్రత్యేక అవగాహన సదస్సు బ్యాంక్ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని, బ్యాంకులో రైతులు, మహిళా సంఘాలు, చిరు వ్యాపారులు, సీనియర్ సిటిజనులకు, విద్యార్థులకు అందిస్తున్న పలు రకాల సేవలను ఆయన వివరించారు. బ్యాంకింగ్ సేవల్లో మార్పులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తమ వ్యక్తిగత వివరాలను ఎవరికి తెలుపకూడదని సూచించారు. ప్రతిఒక్కరూ నగదు రహిత లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంక్ లావాదేవీలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ కేవైసి వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది శరత్ చంద్ర, కె.ముకేష్, నాగార్జున, ఎల్ రవికుమార్, బాలకృష్ణ, వాసు, పల్లవి ఖాతాదారులు లక్కిరెడ్డి, నారాయణరెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరావు, బాజిరెడ్డి, గ్రామస్తులు తదితరులు

## కరాటే పోటీల్లో

## ‘రెజొనెన్స్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముంబాయిలో జరిగిన డబ్ల్యూఎఫ్‌ఎస్‌కెఐ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ఖమ్మం నగరం శ్రీనగర్ కాలనీలో గల స్టేట్‌సిలబస్ రెజొనెన్స్ విద్యార్థులు ట్రోఫీని గెలుపొందారని పాఠశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు తెలిపారు. ముంబాయిలో జరిగిన ఆసియా ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో అండర్ 14 కుమితె బాలుర విభాగంలో ఎస్‌కె అర్సలాన్ బంగారు పతకం, కటా విభాగంలో సిల్వర్ పతకం సాధించారు. అండర్ 12 కుమితె బాలికల విభాగంలో రెడ్డిబోయిన సోనాక్షి సిల్వర్ పతకాన్ని కటా విభాగంలో బ్రౌంజ్ పతకాన్ని సాధించారు. దుబాయ్‌లో ఏప్రిల్ 26న జరిగే ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించినట్లు డైరెక్టర్ శ్రీధర్‌రావు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శనతో ఛాంపియన్ షిప్ ట్రోఫీ, అవార్డులు సాధించారన్నారు. పాఠశాలలో జరిగిన అభినందన సభలో డైరెక్టర్లు కె. శ్రీధర్‌రావు, కృష్ణవేణిలు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించి తమ పాఠశాలకు, జిల్లాకు మంచి గుర్తింపు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విలియం మురళి మోహన్, కోచ్ ఎస్‌కె ఖాసీం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెకు సబ్బండ వర్గాల మద్దతు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక రైతు సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. గురువారం జరిగే సమ్మెకు అన్ని కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ రైతు సంఘాలు సహా సబ్బండ వర్గాలు మద్దతు ఇచ్చి గెలిపించాలని ఆయా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. గడిచిన రెండు మాసాలుగా సమ్మె జయప్రదం కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. సభలు, సమావేశాలు, పోస్టర్లు, కరపత్రాలతో సమ్మె ఆవశ్యకతను వివరించి ప్రజలను సమ్మెకు కార్యోన్ముఖులను చేశారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాల స్థానే తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేబర్ కోడ్‌ల కారణంగా నాటి బ్రిటీష్ ప్రభుత్వం నుంచి ఇటీవల వరకు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దవుతున్నాయని కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కనీస వేతనం, కార్మిక సంఘాల ఏర్పాటు, హక్కులకు రక్షణ లేకుండాపోతుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. లేబర్ కోడ్‌ల అమలుపై వెనక్కి తగ్గినట్లే తగ్గినా ప్రభుత్వం తిరిగి అమలుకు పూనుకోవడం వెనక కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇదే సమయంలో రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సమ్మె జయప్రదం కోరుతూ రైతు సంఘాలు విస్తృత ప్రచారం నిర్వహించాయి. మోదీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, మోదీ చేసుకున్న వాణిజ్య ఒప్పందాల కారణంగా వ్యవసాయ రంగం మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని, మోదీ రైతాంగ వ్యతిరేక విధానాలకు మద్దతుగా సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు చేసి పథకాన్ని సవరించి విబిజిరాంజి ప్రవేశపెట్టడం ద్వారా గ్రామీణ ప్రాంత కూలీలకు ఉపాధి కరువవుతుందని వ్యవసాయ కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. వామపక్షాలు పోరాడి సాధించుకున్న పథకం రద్దు వెనక బిజెపి కుట్ర దాగి ఉందని ఆరోపిస్తున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో నేడు జరిగే సార్వత్రిక సమ్మెకు సబ్బండ వర్గాల మద్దతునివ్వనున్నాయి.



**సమ్మెకు సిపిఐ మద్దతు :**
కార్మిక, రైతు సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘాలు, పార్టీ కార్యకర్తలు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ విజ్ఞప్తి చేశారు. మోదీ విధానాలు దేశ మనుగడకు ప్రమాదకరంగా మారాయని ఆయన తెలిపారు. మోదీ విధానాలను నిరసించకపోతే భవిష్యత్తులో దేశంలో ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుందని, సార్వత్రిక సమ్మెతో మోదీ విధానాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా సార్వత్రిక సమ్మెకు సిపిఎం, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ సహా వామ పక్ష పార్టీలు సంపూర్ణ మద్దతును ప్రకటించాయి.

**తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మద్దతు :**
సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేసింది. మోదీ అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలతో దేశంలో వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోనుందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు తెలిపారు. బుధవారం సమ్మె జయప్రదం కోరుతూ వివిధ ప్రాంతాలలో రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఇటీవల మోదీ ప్రభుత్వం చేసుకున్న వాణిజ్య ఒప్పందాలతో పలు విదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడంతో భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, నాయకులు పగడాల మల్లేష్, కూచిపూడి రవి, శాఖమూరి శ్రీనివాసరావు, రామకృష్ణ, రమేష్, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# నూతన విద్యా విధానం రద్దుకు ఉద్యమించాలి

### దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఎఐఎస్‌ఎఫ్ సంపూర్ణ మద్దతు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నూతన జాతీయ విద్యా విధానం రద్దుకు ఉద్యమించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఎఐఎస్‌ఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఆయన తెలిపారు. బుధవారం ఎఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. విశ్వ విద్యాలయంలో, పరిశోధనా సంస్థల్లో స్వయం ప్రతిపత్తిని తొలగించి విద్యార్థుల, ఉపాధ్యాయుల, అధ్యాపకుల ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘన కొనసాగిస్తుందన్నారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ శిక్షా అభిష్టాన్ బిల్లును అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ బిల్లు సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య స్వయం ప్రతిపత్తిని భారతదేశం ఉన్నత విద్య వ్యవస్థ యొక్క లౌకిక, శాస్త్రీయ స్వభావాలపై ప్రత్యక్ష దాడి చేస్తుందన్నారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ తో సహా ప్రస్తుతం ఉన్న రెగ్యులేటరీ ఆర్కిటెక్చర్‌ను రద్దు చేయాలని విబిఎస్‌ఎ బిల్లు ప్రతిపాదిస్తుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై ఉద్యమించాలన్నారు. నేడు జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఎఐఎస్‌ఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోహిత్, గోపి, లింగరాజు, దిలీప్, శ్రీను, ఉమామహేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వైరాలో 83.64శాతం పోలింగ్

### ఓటు హక్కు వినియోగించుకున్న 20,639 మంది



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల్లో 20,639 మంది వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం మీద 83.64శాతం ఓట్లు నమోదయ్యాయి. ఈ ఎన్నికల్లో 10,866 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోగా, 9,773 మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 99 సంవత్సరాల వృద్ధురాలు లోకా శ్రీలక్ష్మి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు మధ్య పోలీసులు బ్యాలెట్ బాక్సులను వైరాలోని పశుగణాభివృద్ధి కార్యాలయం వద్దకు చేర్చారు. ఎంతోఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

# ప్రశాంతంగా పోలింగ్

### ఖమ్మం జిల్లాలో 82.3 శాతం
### భద్రాద్రి కొత్తగూడెంలో 73.33 శాతం పోలింగ్
### చెదురుమదురు ఘటనలు మినహా అంతా ప్రశాంతం





**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం ఐదు గంటలకు ముగిశాయి. ఖమ్మంజిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, కొత్తగూడెం కార్పొరేషన్‌లో ఎన్నికలు జరిగాయి. ఉదయం ఏడు గంటల నుంచి ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేశారు. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా కల్లూరు మున్సిపాలిటీలో 86.97 శాతం పోలింగ్ నమోదు కాగా అతి తక్కువగా సత్తుపల్లి మున్సిపాలిటీలో 77.44 శాతం పోలింగ్ నమోదైంది. ఏదులాపురంలో 43, 811 మంది ఓటర్లకు గాను 37,391 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 85.35 శాతం పోలింగ్ నమోదైంది. ఈ మున్సిపాలిటీ పరిధిలో 15వ వార్డు ఏకగ్రీవమైన విషయం విధితమే. వైరా మున్సిపాలిటీలో 20 వార్డులకు 24,689 మంది ఓటర్లకు గాను 20,639 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 83.6 శాతం ఓటింగ్ నమోదైంది. సత్తుపల్లిలో 28,830 మంది ఓటర్లకు గాను 22,326 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ జిల్లాలోనే అతి స్వ ల్పంగా 77.44 శాతం పోలింగ్ నమోదైంది. కల్లూరులో అత్యధికంగా పోలింగ్ నమోదు కాగా ఇక్కడ పోలింగ్ శాతం 86.97 శాతంగా నమోదైంది. 18,866 మందికి గాను 16,408 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధిరలో 22 వార్డులకు గాను సగటున 77.88 శాతం పోలింగ్ నమోదైంది. 25,679 మందికి గాను 20 వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం కార్పొరేషన్‌లో 74.19 శాతం పోలింగ్ నమోదైంది. 1,34,775 ఓట్లకు గాను 99,992 ఓట్లు నమోదయ్యాయి. ఇల్లందు మున్సిపాలిటీలో 24 వార్డులకు గాను 33,723 ఓట్లు ఉండగా 19,515 ఓట్లు నమోదయ్యాయి. 68.44 కనిష్ఠ పోలింగ్ శాతం నమోదైంది. అశ్వారావుపేటలో 22 వార్డులకు గాను 16,854 ఓట్లు ఉండగా 12,839 ఓట్లు నమోదయ్యాయి. ఇక్కడ 76.20 శాతం పోలింగ్ నమోదైంది. ఎక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగలేదు. మధిరలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సత్తుపల్లిలో శాసన సభ్యురాలు మట్టా రాగమయి, కొత్తగూడెంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, ఏదులాపురం మున్సిపాలిటీలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, సత్తుపల్లిలో మాజీ ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య ఓటు హక్కును వినియోగించుకున్నారు. వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**కొన్ని చోట్ల పోలీసుల అత్యుత్సాహం :**
ఉమ్మడి ఖమ్మంజిల్లాలో కొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కొత్తగూడెంలో 19వ పోలింగ్ బూత్ వద్దకు ఎర్ర చొక్కా వేసుకుని వచ్చారని ఓ పోలీస్ అధికారి చొక్కా విప్పించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్యే కూనంనేని జోక్యం చేసుకుని పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర ప్రాంతాల వారు ప్రచారం నిర్వహించినా పట్టించుకోని పోలీసులు సిపిఐకి సంబంధించిన స్థానికులు కనపడితే హడావుడి చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీలో జలగం నగర్‌లో పోలీసులు కాంగ్రెస్ పార్టీకి సహకరిస్తున్నారని బిఆర్‌ఎస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మధిర, కల్లూరు, సత్తుపల్లి, అశ్వారావుపేట, ఇల్లందు మున్సిపాలిటీల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మున్సిపాలిటీలో విలీనమైన రూరల్ ప్రాంతాల్లో ఓటింగ్ ఎక్కువగా జరిగింది. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో ఒక బూత్‌లో 96 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణ ఓటర్లు ఎప్పటి మాదిరిగానే ఓటు వేయడంలో కాస్త నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన కమిషనర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. బుధవారం కమిషనర్ అభిషేక్ అగస్త్య పలు ప్రాంతాలలో పర్యటించారు. వెలుగుమట్ల పార్కు ప్రధాన రహదారి వెంబడి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రహదారుల నిర్మాణం, డివైడర్ల సుందరీకరణ, మొక్కల పెంపకంపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో జరుగుతున్న సివిల్ పనులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఖమ్మం నగరంలో కొనసాగుతున్న అన్ని పనులు నిర్ణీత సమయంలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో అలసత్వం వహించకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని పంగిడి గ్రామంలో అంగన్‌వాడీ విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ భూక్యా స్వాతి, ఉప సర్పంచ్ బోడా రాజా చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఉచితంగా యూనిఫాం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు భూక్యా హరిసింగ్, తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బారులు తీరిన ఓటర్లు

### కోలాహలంగా పోలింగ్ కేంద్రాలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పాల్వంచ 27 డివిజన్‌లో బుధవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సుమారు మూడు దశాబ్దాల తరువాత మున్సిపల్ ఎన్నికలు జరుగుతుండటంతో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు. కొమ్ముగూడెంలోని 38, 45 డివిజన్‌లలో పోటీ పడుతున్న సిపిఐ, బిఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు గౌతమి క్రిష్ణ, నరేష్, రాజుగౌడ్, చెరుకూరి శేఖర్‌బాబు, చింతా నాగరాజులు రాజకీయాలు వేరు స్నేహం వేరు అంటూ స్పోర్టివ్‌నెస్‌ను ప్రదర్శించారు. ఒకరికొకరు సరదాగా గడుపుతూ ఓ సరికొత్త వాతావరణాన్ని సృష్టించారు. 6వ డివిజన్‌లో అధికార పార్టీకి చెందిన కొందరు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. దీనితో కొంతసేపు గందరగోళానికి దారితీసింది. పాల్వంచ 46వ డివిజన్ పోలింగ్ కేంద్రానికి ఓటు వేయటానికి వచ్చిన ఓ వ్యక్తిని ఓటేయాడానికి నిరాకరించారు. ఇది మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్‌పి రోహిత్‌రాజు ఆదేశాలతో డిఎస్‌పి సతీష్ నేతృత్వంలో పాల్వంచ పట్టణంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు.


### ‘తటస్థత’కే మొగ్గు చూపిన ఓటర్..

# కడవరకు పంపిణీ పనిలో అభ్యర్థులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఓటు వేసేందుకు ఉత్సాహం చూపిన ఓటర్లు ఏ అభ్యర్థికి ఓటు వేస్తున్నామనే విషయంలో మాత్రం అత్యంత గుంబనంగా వ్యవహరించారు. చివరి వరకు తాము తటస్థులమేనన్న భావన కలిగించేలా వ్యవహరించారు. ఏ పార్టీకి ఓటు వేస్తున్నామో కూడా తెలియనంతగా ఓటర్లు మసులుకున్నారు. వివిధ పార్టీలలో నిరంతరం పనిచేసే కార్యకర్తలు మినహా సామాన్య ఓటర్లు ఎవరు ఈ దఫా ఎన్నికల్లో, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనలేదు. అందుకే రాజకీయ పార్టీలు ఎక్కువగా కూలీలపై ఆధారపడ్డారు. ఇదే పరిస్థితి పోలింగ్ రోజు కూడా కనిపించింది. ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేసిన ఓటర్లు తమ అంతరంగాన్ని మాత్రం ఎక్కడ బహిర్గతం చేయలేదు. బరిలో నిలిచిన అభ్యర్థు లు మాత్రం కడవరకు ప్రలోభాల పర్వాన్ని కొనసాగించారు. మూడు రోజులుగా దఫదఫాలుగా నగదు పంపిణీ చేసిన పార్టీల అభ్యర్థులు మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు పంపిణీ చేసే పనిలో ఉన్నారు. కొన్ని చోట్ల ఓటు ధర రూ. 5వేల నుంచి రూ.10వేల వరకు పలికింది. ఏజెన్సీ ప్రాంతమైన అశ్వారావుపేటలో ఓటర్లకు ఏడువేల చొప్పున కొందరు అభ్యర్థులు పంపిణీ చేశారు. వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీలలో ఓటు ధర ఎక్కువగా పలికినట్లు సమాచారం. కొత్తగూడెం కార్పొరేషన్‌లో అధికార కాంగ్రెస్ విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేసింది. అదే పరిస్థితి ఏదులాపురం మున్సిపాలిటీలోనూ నెలకొంది. పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చిన తర్వాత కూడా కొందరు ఓటర్లకు నగదు పంపిణీ చేయడం గమనార్హం. కొందరు చీరెసారె, మద్యాన్ని పంపిణీ చేశారు. గతంలో కేవలం తటస్థ ఓటర్లకు మాత్రమే డబ్బులు పంపిణీ చేసేవారు. ఇప్పుడు బరిలో నిలిచిన అభ్యర్థులు మినహా మిగిలిన వారందరికీ నగదు పంచగా 99 శాతం మంది అన్ని పార్టీలు పంచిన నగదును, ఇతర నజరానాలను స్వీకరించారు. అందుకే ఒకరికి ఓటు వేసినట్లు బహిర్గతమైతే మరొకరికి తెలిస్తే ఇబ్బంది అవుతుందని ఓటర్లు గుంబనంగా వ్యవహరించారు. కుటుంబ సభ్యుల్లో సైతం ఒకరికి తెలియకుండా ఒకరు ఓట్లు వేసినట్లు కొందరు వ్యాఖ్యానించడం విశేషం. మొత్తానికి ఓటరు తీర్పు బ్యాలెట్ బాక్స్‌లో నిక్షిప్తమైంది. శుక్రవారం జరిగే లెక్కింపులో ఖమ్మం జిల్లాలోని 414 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 529 మంది భవితవ్యం తేలనుంది.

**ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన సిపిఐ**
మున్సిపల్‌ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులకు ఓట్లు వేసిన ఓటర్లకు సిపిఐ జిల్లా సమితి కృతజ్ఞతలు తెలిపింది. బుధవారం సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యర్థులు ఎన్ని ప్రలోభాలకు గురి చేసిన ఓటర్లు కమ్యూనిస్టు పార్టీ వైపు మొగ్గుచూపి సిపిఐ అభ్యర్థులకు అండగా నిలిచారని సురేష్ తెలిపారు. భవిష్యత్తులో సైతం ఇదేవిధంగా కమ్యూనిస్టు పార్టీకి సంపూర్ణ మద్దతు నివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆర్‌టిఐ అమలు తీరును పరిశీలించిన రాష్ట్ర కమిషనర్: పి.శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమాచార హక్కు చట్టం ఆర్టిఐ అమలు తీరును రాష్ట్ర కమిషనర్ పివి శ్రీనివాసరావు పరిశీలించారు. బుధవారం ఖమ్మంలో ప్రభుత్వ కార్యాలయాలను రాష్ట్ర కమిషనర్ పివి శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నెస్పి క్యాంపులో ఉన్న సర్కిల్ 3 ఇరిగేషన్ కార్యాలయం, ఆర్డివో కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్టిఐ రికార్డులను పరిశీలించారు. ఆర్టిఐ చట్టం ప్రకారం ఇరిగేషన్ కార్యాలయంలో 4(1)బి క్రింద 17 అంశాలతో కూడిన సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టివో కార్యాలయంలో సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్టిఐ చట్టం ప్రకారం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు కార్యాలయాల్లో సిటిజన్ చార్ట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
గురువారం
12-02-2026
www.prajapaksham.in

తెలుగు సినిమాలో యూనిక్ ఫిల్మ్ మేకర్‌గా, నటుడిగా ముద్రవేసిన రవిబాబు తాజాగా 'రేజర్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్ ప్రొడ్యూసర్ సురేష్ బాబు ప్రెజెంట్ చేయగా, ఫ్లయింగ్ ఫ్రాగ్స్ నిర్మిస్తోంది. రవిబాబు–సురేష్ బాబు కాంబినేషన్‌లో మరోసారి వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి.

రీల్

# టైటిల్ మార్చమన్నారు



డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని

సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కోప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా 'వాలెంటైన్స్ డే' సందర్భంగా తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాను ప్యాషనేట్ ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఎపి, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ధీరజ్ మొగిలినేని మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. పదిహేను రోజుల క్రితం 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా చూశాను. మూవీ బాగా నచ్చింది. ప్రమోద్ అన్నకు వంశీ అన్నకు కాల్ చేసి ఈ సినిమా నేను డిస్ట్రిబ్యూట్ చేయాలని అనుకుంటున్నా అని అడిగాను. వారు ఓకే చెప్పడంతో ఈ ప్రాజెక్ట్ చేశాను. ఇది చెన్నై బ్యాక్ డ్రాప్‌లో సాగే మంచి లవ్ స్టోరీ మూవీ ఇది. టైటిల్ చూసి ఇదోదే ఓన్లీ యూత్ చూడాల్సిన సినిమా అనుకుంటున్నారు. ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి. శివ, మిత్ర అనే రెండు క్యారెక్టర్స్ జర్నీ చూస్తారు. కపుల్ ఫ్రెండ్లీ' మూవీలో లివ్ ఇన్ రిలేషన్ షిప్ గురించి కేవలం 15 నిమిషాలు మాత్రమే సీన్స్ ఉంటాయి. మిగతా అంతా మిత్ర, శివ అనే జంట ఒకరికొకరు పరిచయం అయ్యాక వారి జీవితాలు ఎలా మారాయి. వీళ్లు ఒకరి కొకరు ఎలా సపోర్ట్ చేసుకున్నారు అనేదే చూపిస్తున్నాం. సినిమా టైటిల్ విషయంలో సెన్సార్ అభ్యంతరం చెప్పారు. టైటిల్ మార్చమన్నారు. కానీ మేము ఇప్పుడు టైటిల్ విషయంలో ఎలాంటి మార్పులు చేయలేమని చెప్పాం. టైటిల్ రిజిస్ట్రేషన్ విషయంలో మొదటి నుంచే సెన్సార్ వారి అనుమతి ఇచ్చేలా ఒక కొత్త పద్ధతి రావాల్సిన అవసరం ఉంది. మాకే కాదు ఈ మధ్య చాయ్ వాలా అనే సినిమాకు కూడా సెన్సార్ వారు అభ్యంతరం తెలిపారు. ఈ సినిమా కోసం చెన్నై నగరంలో షూటింగ్ చేశారు. చెన్నైలో షూటింగ్ చేయడం చాలా కష్టం. పర్మిషన్స్ ఇవ్వరు. తమిళ చిత్రాలకు కూడా పర్మిషన్స్ ఉండవు. కానీ ఈ సినిమా టీమ్ మాత్రం గెరిల్లా పద్ధతిలో షూటింగ్ చేశారు. ఇటీవల మేము చెన్నై లవ్ స్టోరీ సినిమా కోసం చెన్నైలో ఇలాగే షూటింగ్ చేయాల్సివచ్చింది.

# 13న 'ఎ బ్యూటీఫుల్ బ్రేకప్'



తక్ష్, మటిల్డా హీరో–హీరోయిన్లుగా నటించిన ఇంగ్లీష్ ఫీచర్ ఫిల్మ్ 'ఎ బ్యూటీఫుల్ బ్రేకప్' ఇది. రొమాంటిక్ హారర్ థ్రిల్లర్. ఈ చిత్రాన్ని దర్శకుడు అజిత్ వాసన్ ఉగ్గిన రచన, దర్శకత్వంలో తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని 5 నేచర్స్ మూవీస్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించగా, ముద్రగడ రంగారావు, ఉగ్గిన సత్యనారాయణరావు సమర్పిస్తున్నారు. పూర్తిగా ఇంగ్లీష్‌లో, గ్లోబల్ ఆడియెన్స్‌ను లక్ష్యంగా రూపొందించిన 'ఎ బ్యూటీఫుల్ బ్రేకప్ ఈ నెల 13న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దీనికి ముందుగా 12న దుబాయ్‌లో ఎక్స్‌క్లూజివ్ ప్రీమియర్ నిర్వహించనున్నారు. ఇంగ్లీష్ విడుదల అనంతరం ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో డబ్ చేసి విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు అజిత్ వాసన్ ఉగ్గిన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను చేరుకోవాలనే ఉద్దేశంతో 'ఎ బ్యూటీఫుల్ బ్రేకప్' చిత్రాన్ని పూర్తిగా ఇంగ్లీష్‌లో రూపొందించాం. లెజెండరీ సంగీత దర్శకుడు మాస్ట్రో ఇళయరాజా మా చిత్రానికి సంగీతం అందించడం మా అదృష్టం అన్నారు. హీరో తక్ష్ మాట్లాడుతూ.. ఎ బ్యూటీఫుల్ బ్రేకప్ సినిమా షూటింగ్‌లో ప్రధాన భాగం భారతదేశంలో, కర్ణాటకలోని చిక్కమగళూరు అరణ్య ప్రాంతంలో, ఓ అద్భుతమైన, ప్రశాంతమైన ఎస్టేట్‌లో జరిగింది. మబ్బులతో నిండిన ఆ సహజ వాతావరణం సినిమాకు ఒక భయానకమైనా అందమైన అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాలో సినిమాటోగ్రఫీ పెద్ద హైలైట్. మా డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ గుణశేఖరన్ విజువల్స్‌ను అంత అందంగా తీర్చిదిద్దారు సినిమా చూసిన పాశ్చాత్య ప్రేక్షకులు కూడా 'వావ్' అని స్పందించారు. ఈ కథలో సంగీతం కీలక పాత్ర పోషిస్తుంది.

# అందరూ మెచ్చేలా ఫంకీ



'చిట్ చాట్'లో కె.వి.అనుదీప్

'జాతిరత్నాలు'తో హాస్య చిత్రాలలో కొత్త పంథాను సృష్టించిన దర్శకుడు కె.వి.అనుదీప్, ఇప్పుడు 'ఫంకీ'తో మరోసారి థియేటర్లలో నవ్వుల వర్షం కురిపించడానికి వస్తున్నారు. విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాలో కయాదు లోహర్ కథానాయిక. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఈ నెల 13న విడుదలవుతున్న 'ఫంకీ' చిత్రం విడుదల అవుతున్న నేపథ్యంలో దర్శకుడు కె.వి.అనుదీప్ మీడియాతో 'చిట్ చాట్ నిర్వహించారు. 'ఫంకీ' టైటిల్ వినడానికి క్యాచీగా ఉంటుంది. అలాగే ఈ తరం అభిరుచులకు తగ్గట్టుగా ఉంటుందని ఈ టైటిల్‌ను ఎంచుకోవడం జరిగింది. హీరో పాత్రకు కూడా ఈ టైటిల్ సరిగ్గా సరిపోతుంది. విశ్వక్ సేన్ ఇందులో ఒక సినిమా దర్శకుడి పాత్రలో కనిపిస్తారు. ఈ పాత్రను రాసుకున్నప్పుడే విశ్వక్ అయితే బాగుంటారు అనిపించింది. 'ఈ నగరానికి ఏమైంది' సినిమాలో ఆయన కామెడీ టైమింగ్ బాగుంటుంది. 'జాతిరత్నాలు'తో పోలిస్తే 'ఫంకీ' చిత్రం పూర్తి కొత్తగా ఉంటుంది. ఇది అవుట్ అండ్ అవుట్ రొమాంటిక్ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఇందులో దర్శకుల జీవితాల్లో జరిగే కొన్ని సంఘటనలను సాధారణ ప్రేక్షకులకు కూడా అర్థమయ్యేలా సరదాగా చూపించడం జరిగింది. అలాగే ప్రేమ కథతో పాటు కుటుంబానికి సంబంధించిన మంచి భావోద్వేగ సన్నివేశాలు కూడా ఉంటాయి. నిజ జీవితంలో ప్రేక్షకులను కనెక్ట్ అయ్యే సీన్స్ ఉంటాయి. సినిమాలో లాజిక్ ఉంటుంది. నా సినిమాల్లో కామెడీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి, లాజిక్ ఉండదని మీకు అనిపించవచ్చు. కానీ అన్ని సినిమాల్లో లాజిక్ ఉంటుంది. 'ఫంకీ'లో నేను అతిథి పాత్రలో కనిపిస్తాను. నాకు నటుడిగా కంటే దర్శకుడిగా సినిమాలు చేయడమే ఆసక్తి. పూర్తిస్థాయి నటుడిగా మారే ఆలోచన లేదు. చెప్పాల్సిన కథలు చాలా ఉన్నాయి. దర్శకుడిగానే మరిన్ని సినిమా చేయాలని ఉంది. ఈ సినిమాలో దర్శకులు హరీష్ శంకర్, కళ్యాణ్ శంకర్, నిర్మాతలు దిల్ రాజు, నాగవంశీ అతిథి పాత్రల్లో కనిపిస్తారు. అయితే ఆ పాత్రలు కథలో భాగంగానే వస్తాయి. ఆ పాత్రలతో కూడా సహజమైన సంభాషణలతో హాస్యాన్ని పుట్టించే ప్రయత్నం చేశాము. జయాపజయాలు సహజం. అయితే 'ప్రిన్స్' స్క్రిప్ట్ సిద్ధం చేయడానికి అప్పుడు తగిన సమయం లేదు. ఇప్పుడు 'ఫంకీ'కి తగిన సమయం తీసుకొని, మంచి స్క్రిప్ట్‌ని సిద్ధం చేశాము. నరేష్ పాత్ర చాలా బాగుంటుంది. ఆ పాత్ర రాసుకునేటప్పుడే ఆయనైతే బాగుంటుంది అనిపించింది. నాకు చిన్నప్పటి నుంచి నరేష్ అభిమానం. 'జాతిరత్నాలు' కోసం ఆయనతో కలిసి పనిచేశాను. ఇప్పుడు మరోసారి కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. మూడు నిర్మాణ సంస్థలలో సినిమాలు చేయాల్సి ఉంది. ఒక ఫిమేల్ ఓరియెంటెడ్ కథ రాస్తున్నాను. అలాగే, వెంకటేష్ కోసం ఒక కథ సిద్ధం చేస్తున్నాను.

# బంధాల విలువలను చాటి చెప్పే 'సీతా పయనం'



యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా దర్శకత్వంలో నిరంజన్, ఐశ్వర్య అర్జున్ జంటగా తెరకెక్కించిన చిత్రం 'సీతా పయనం'. శ్రీరామ్ ఫిలమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ మీద అర్జున్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ మూవీతో ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా ప్రధాన పాత్రను పోషించారు. ఈ చిత్రాన్ని 14న రిలీజ్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు పద్మశ్రీ డా.బ్రహ్మానందం ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రియల్ హీరోలైన పర్యావరణ వేత్త, సామాజిక వేత్త డా.ప్రకాష్ ఆమ్టే, డా.మందాకిని ఆమ్టే, ట్యాంక్‌బండ్ శివ, పర్యావరణ వేత్త దుశ్చర్ల సత్యనారాయణలను 'సీతా పయనం' టీం సత్కరించి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా డా.బ్రహ్మానందం మాట్లాడుతూ మంచి మనిషి, రియల్ జెంటిల్‌మెన్ అర్జున్ గురించి ఈ ఈవెంట్‌కు వచ్చాను. రియల్ హీరోల్ని సత్కరిస్తున్నాను అని అర్జున్ చెప్పినప్పుడు ఎంతో సంతోషించాను. ఇలాంటి గొప్ప వారిని సత్కరించే అవకాశం అందరికీ లభించదు. అర్జున్ దర్శకత్వం వహించిన 'జై హింద్ 2' చిత్రంలో నేను నటించాను. అర్జున్ ఎప్పుడూ ఎవ్వరినీ డిమాండ్ చేయరు. ఎప్పుడూ సౌమ్యుడిగానే ఉంటారు. ఈ చిత్రంతో ఐశ్వర్యకు మంచి పేరు రావాలి, అర్జున్ పేరు నిలబెట్టాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దర్శక, నిర్మాత అర్జున్ సర్జా మాట్లాడుతూ 'సీతా పయనం' అనేది ఒక్కరి ప్రయాణం కాదు. నా కూతురిని ఓ మంచి కథతో, పాజిటివిటీ ఉన్న సినిమాతో పరిచయం చేయాలని అనుకున్నాను. ఇదొక డిఫరెంట్ జానర్ కథ. నా కూతురికి ఓ బహుమతిలా ఈ సినిమాని ఇవ్వాలని అనుకున్నాను. జనాలకు ఓ మంచి చిత్రాన్ని ఇవ్వాలనే బాధ్యతతో ఈ చిత్రాన్ని తీశాను. ఎంతో నిజాయితీతో ఈ మూవీని తీశాను. ఉపేంద్ర అన్న కొడుకు నిరంజన్ చాలా టాలెంటెడ్ పర్సన్ అన్నారు. హీరోయిన్ ఐశ్వర్యా అర్జున్ మాట్లాడుతూ 'సీతా పయనం' నాకు కేవలం ఓ సినిమా మాత్రమే కాదు. ఇది నాకొక ఎమోషన్. ప్రేమ గురించి, కుటుంబం గురించి, విలువల గురించి చెప్పే చిత్రమిది. నాకు ఇంత గొప్ప అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాత.. నేను గర్వంగా చెప్పుకునే నా తండ్రి అర్జున్ కి థాంక్స్. ఆయన పేరు నిలబెట్టేందుకు ప్రయత్నిస్తాను 14న సినిమా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో నిరంజన్, సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, నటుడు సత్య రాజ్ , నటుడు, నిర్మాత అశోక్ కుమార్ , నిర్మాత ప్రసన్న కుమార్, డైలాగ్ రైటర్ సాయి మాధవ్ పాల్గొన్నారు.

# 28న 'అతడు' రీ-రిలీజ్



మహేష్ బాబు ఐకానిక్ క్లాసిక్ 'అతడు' మరో సారి గ్రాండ్‌గా వెండి తెర పైకి రాబోతోంది. ప్రేక్షకుల మనసులో చెరగని ముద్రవేసిన ఈ టైమ్‌లెస్ క్లాసిక్ ఫిబ్రవరి 28న ఫోర్ కే ఫార్మాట్‌లో థియేటర్లలో రీ–రిలీజ్ కానుంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటించారు. వెటరన్ నటుడు–నిర్మాత మురళీ మోహన్ జయభేరి ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మించారు. ఇప్పుడు సూపర్ ఫోర్లో కే డాల్బీ ఆడియోతో మరోసారి థియేటర్లలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

# 'నవాబ్ కేఫ్'గా మారిన 'చాయ్ వాలా'



శివ కందుకూరి, రాజీవ్ కనకాల, తేజు అశ్విని ప్రధాన పాత్రలో హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్ మీద రాధా విపపుడిప్పు నిర్మించిన చిత్రం 'నవాబ్ కేఫ్'. ఈ మూవీకి ప్రమోద్ హర్ష దర్శకత్వం వహించారు. ఈ సినిమాని 20న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో హీరో శివ కందుకూరి మాట్లాడుతూ 'చాయ్ వాలా' అంటూ మా జర్నీని ప్రారంభించాం. 'చాయ్ వాలా'ని జనాల్లోకి తీసుకు వెళ్లేందుకు చాలా కష్టపడ్డాం. సెన్సార్ రూల్స్, గైడ్ లైన్స్‌ను గౌరవిస్తూ మేం మా టైటిల్‌ను 'నవాబ్ కేఫ్'గా మార్చాం. ప్రమోద్ ముందుగా నాకు ఈ కథను చెప్పినప్పుడు 'నవాబ్ కేఫ్' అని టైటిల్ అనుకున్నాం. ఇప్పుడు విధి చివరకు 'నవాబ్ కేఫ్' టైటిల్‌ను పెట్టేలా చేసింది. 'నవాబ్ కేఫ్' టైటిల్ మా సినిమాలోని స్టోరీని, ఆత్మని తెలియజేస్తుంది. టైటిల్ చేంజ్ అయినా, సెన్సార్ సమస్యలు వచ్చినా మా నిర్మాత వెంకట్ ఎక్కడా వెనక్కి తగ్గకుండా, కాంప్రమైజ్ కాకుండా నిలబడ్డారు. 'నవాబ్ కేఫ్' అనే కొత్త టైటిల్‌తోనే మళ్లీ ప్రమోట్ చేద్దామని టీం అంతా ముందుకు వచ్చాం అని చెప్పారు. ఈ ప్రెస్ మీట్ లో దర్శకుడు ప్రమోద్ హర్ష, హీరోయిన్ తేజు అశ్విని మాట్లాడారు.

## సర్కారు మెడలు వంచుదాం

(మొదటి పేజీ తరువాయి)

చట్టాన్ని సర్కారు రద్దు చేయడాన్ని ఆక్షేపించారు. ఉద్యోగాలు, వేతనాలు, సామాజిక భద్రత, గౌరవమైన పనికి హాని కలించే ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ల ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తూ కార్మికులు, కర్షకులను అభద్రతా అనే అగాధంలోకి నెట్టివేయడానికి బీజేపీ ప్రభుత్వం పూనుకున్నదని, దీనిని ప్రతిఘటించాలని డి.రాజా సూచించారు. సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొని, దానిని విజయవంతం చేయాలంటూ కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, గిగ్ వర్కర్లు, స్కీమ్ వర్కర్లు, ఉద్యోగులతో పాటు అన్ని ప్రజాస్వామిక శక్తులకు సీపీఐ తరపున పిలుపునిచ్చారు. ఐక్యతాను, ప్రతిఘటనను, గౌరవమైన పని హక్కును తిరిగి సాధించే సంకల్పాన్ని చాటే విధంగా ఈ సమ్మె జరగాలని డి.రాజా వెల్లడించారు. సమ్మె జయప్రదానికి పిలుపునిచ్చారు.

## దిశానిర్దేశ ఎన్నికలు నేడే

(మొదటి పేజీ తరువాయి)

(బిఎన్‌పి)–జమాత్–ఎ–ఇస్లామీ పార్టీలు ప్రధానంగా ఎన్నికల బరిలో నిలిచాయి. మొత్తం 51 పార్టీలకు చెందిన వేలాదిమంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో యువకులదే నిర్ణయాత్మక ఓటు. ఎవరు అధికారాన్ని తీసుకుంటారనే విషయాన్ని యువతరమే నిర్దేశించనున్నారు. ఎన్నికల ప్రక్రియలో 44 శాతం ఓటర్లు అందరూ 37 ఏళ్ళు లోపు వయసుగలవారే కావడం ప్రత్యేక విశేషం. ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకూ బంగ్లాదేశ్‌లో నాలుగు రోజులు సెలవు దినాలు ప్రకటించారు. పోలింగ్ సందర్భంగా గురువారం దేశంలో వీధుల్లో రాకపోకల సమయాలపై కూడా ఆంక్షలు విధించారు. మొబైల్ ఫైనాన్స్ సర్వీసులపై కూడా బ్యాంకింగ్ వ్యవస్థ ఈనెల తొమ్మిదో తేదీ నుండి మూడు రోజులపాటు ఆంక్షలు విధించింది.

**పోలింగ్ దేశ భవితకు మార్గనిర్దేశం : యూనుస్**

ఈ ఎన్నికలు ఎప్పుడూ జరిగే ఒక రాజకీయ ప్రక్రియ మాత్రమే కాదని, బంగ్లాదేశ్ ప్రజలందరూ ఉమ్మడిగా తమ భవిష్యత్తును, విధిరాతను నిర్దేశించుకోవడానికి ఉద్దేశించిన పోలింగ్ ప్రక్రియ అని తాత్కాలిక ప్రభుత్వ అధినేత, ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ వ్యాఖ్యానించారు. రాబోయే కొత్త ప్రభుత్వానికి అధికారాన్ని బదలాయించేందుకు తానెంతో ఉత్సుకతతో ఉవ్విళ్ళూరుతున్నానన్నారు. జాతీయ టెలివిజన్‌లో ఆయన ప్రజలు ఉద్దేశించి ప్రసంగించారు.

**స్థిరత్వం–సర్వసమానత్వం కావాలి : తారిఖ్ రెహ్మాన్**

'బంగ్లాదేశ్‌కు స్థిరత్వం కావాలి, దేశానికి సర్వసమానత్వం కావాలి, ప్రతీకార రాజకీయాలు దేశాన్ని నాశనం చేస్తాయి' అని బంగ్లాదేశ్ నేషనలిస్టుపార్టీ (బిఎన్‌పి) ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ (60) ప్రజలకు పిలుపు ఇచ్చారు. తమపార్టీకి ఓటు వేస్తే శాంతిని కాపాడి, ప్రజలకు భద్రత తీసుకువస్తామని భరోసా ఇస్తున్నారు. అన్నివర్గాల ప్రజలకు సమాన ప్రాతిపదికపై రక్షణలు ఇస్తామని చెప్పారు. తమకు సవాలు విసురుతున్న జమాత్–ఎ–ఇస్లామీ పార్టీ ఒక మంచి ప్రతిపక్షంగా బాధ్యతలు నిర్వహిస్తుందని విశ్వాసంతో ఉన్నానని అన్నారు.

**అంతా సమానం : రెహమాన్**

మెజారిటీ–మైనారిటీ అనే భేదాలు లేవని, ప్రజలు అందరూ సమానమేనని జమాత్–ఎ–ఇస్లామ్ అధ్యక్షుడు షఫీకుర్ రెహమాన్ (68) అన్నారు. ఎన్నికలు సమీపించిన తరుణంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు దేశానికి కొత్తగా అనిపించాయి. జమాత్ పార్టీపై మతఛాందస ముద్ర ఉన్న తరుణంలో మెజారిటీ, మైనారిటీ తేడా లేదని, అందరూ సమానమేనని చేసిన వ్యాఖ్యలు ఒక కొత్త మార్గానికి తెరతీశాయి.

**మరో మైనారిటీ వ్యాపారి హత్య**

బంగ్లాదేశ్‌లో మరికొద్ది గంటల్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో మైనారిటీ వర్గానికి చెందిన మరో వ్యాపారి హత్యకు గురయ్యాడు. హిందూ వ్యాపారి సుసేన్ చంద్ర సర్కార్ (62)ను మైమన్‌సింగ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు నరికి చంపారు. ఆయన బియ్యం వ్యాపారం చేస్తారు. ఆయనను రాత్రి దుకాణంలో ఉండగా దుండగులు నరికిచంపి షట్టర్లు దించి పారిపోయారు. బంధువులు వచ్చి చూసేసరికి అప్పటికే ఆయన మరణించారు. బంగ్లాదేశ్‌లో ఇప్పటికే ఏడుగురు హిందూ మైనారిటీ వ్యాపారులు, యువకులు హత్యలకు గురయ్యారు. దీపూ చంద్ర దాస్, ఖోకోన్ చంద్ర దాస్, బజేంద్ర బిశ్వాస్, అమృత మండల్ సహా అనేకమంది హత్యలకు గురయ్యారు.

## వందేమాతరం తప్పనిసరి..

(మొదటి పేజీ తరువాయి)

వందేమాతరం కూడా పాడాలని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఉదయం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం వందేమాతరం ఆలపించేటప్పుడు అందరూ తప్పనిసరిగా నిలబడాలి. గేయంలోని ఆరు చరణాల్ని ఆలపించాల్సిందే. వీటిలో కాంగ్రెస్ 1937లో తొలగించిన నాలుగు చరణాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా ఆలపించాలి. గతంలో నెహ్రూ ఆధ్వర్యంలో సెక్యులర్ అంశాలను సాకుగా చూపి, ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు గేయంలోని నాలుగు చరణాలను తొలగించారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం వాటిని కూడా తిరిగి చేర్చింది. ఈ అంశంపై గత ఏడాది కాంగ్రెస్, బిజెపి మధ్య మాటల యుద్ధం నడిచింది. తాజా మార్గదర్శకాల ప్రకారం సినిమా హాళ్లలో వందేమాతరం ప్లే చేయాల్సిన అవసరం లేదు. అలాగే థియేటర్లలో లేదా న్యూస్ రీల్స్‌లో ఈ గేయం ప్లే అవుతుంటే నిలబడాల్సిన అవసరం లేదు. ఇలాంటి చోట్ల ఎక్కువ మంది నిలబడటం వల్ల కార్యక్రమానికి ఆటంకం కలగడం, అలాగే శాంతి భద్రతల సమస్యను దృష్టిలో ఉంచుకుని తాజా ఆదేశాలిచ్చింది. 'వందేమాతరం' ఆలపించడానికి మూడు నిమిషాల 10 సెకండ్ల సమయం పడుతుందని కేంద్రం వెల్లడించింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు అయినటువంటి రాష్ట్ర వేడుకలు, పౌర సన్మానాలు, రాష్ట్రపతి పర్యటన, గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు, మంత్రులు పాల్గొనే వేడుకలు, జాతీయ పతాకావిష్కరణ వంటి కార్యక్రమాల సందర్భంగా ఇకపై వందేమాతరం ఆలపించాలి. ఇప్పటికే పద్మ వంటి కేంద్ర అవార్డులు ప్రదానం చేసే వేడుకల్లో ఈ గేయాన్ని ఆలపిస్తున్నారు. ఈ నిబంధనలు అతిక్రమించి జాతీయ గేయాన్ని అవమానిస్తే వారికి గరిష్టంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. 'వందేమాతరం' గేయాన్ని 1875లో బంకిం చంద్ర ఛటర్జీ రచించారు. తర్వాత దీన్ని ఆయనే తన ఆనంద్ మఠ్ అనే నవలలో భాగం చేశారు. ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగానే తాజా ఆదేశాలిచ్చింది.

# మహా శివరాత్రికి 43 శైవ క్షేత్రాలకు 2,243 ప్రత్యేక బస్సులు

**శ్రీశైలం 781, వేములవాడ 416, ఏడుపాయలకు 249 స్పెషల్ సర్వీసులు**





ప్రజాపక్షం/హైదరాబాద్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 43 ప్రసిద్ధ శైవక్షేత్రాలకు ఆర్‌టిసి 2,243 ప్రత్యేక బస్సులను నడపనుంది. ఈ నెల 15న మహా శివరాత్రి పురస్కరించుకుని, 14 నుంచి 16వ తేది వరకు స్పెషల్ సర్వీసులను నడపనుంది. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71తో పాటు రాష్ట్రంలోని కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజిబిఎస్, జెబిఎస్, సిబిఎస్, ఐఎస్ సదన్, కె.పి.హెచ్.బి, బిహెచ్‌ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉండనున్నాయి.భక్తులకు ఏలాంటి అసౌకర్యం కల్గకుండ ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్లు, తాగునీరుతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ఈ నెల 14 నుంచి 16 వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సాధారణం కంటే అదనంగా 1.5 రెట్లు చార్జీలు వసూళ్లు చేయనున్నారు. రెగ్యులర్ సర్వీస్‌లో టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని అధికారులు వెల్లడించారు. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15 నుంచి 17 వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయని సంస్థ ప్రకటించింది. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డ్‌లను సంస్థ ఏర్పాటు చేస్తుంది. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు రాష్ట్రంలో ప్రయాణానికి ఉచిత బస్సు రవాణా సదుపాయం యధావిధిగా అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని సూచించారు. 'శివరాత్రికి ప్రత్యేక బస్సుల ఏర్పాట్లపై ఆర్‌టిసి విసి ఎండి వై.నాగిరెడ్డి ఉన్నతాధికారులతో ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్ర స్థాయి అధికారులకు ఎండి అదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలంకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించారు. టికెట్ల బుకింగ్ ను www.tgsrtcbus.in వెబ్ సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని, మరింత సమాచారం కోసం ఆర్‌టిసి కాల్ సెంటర్ నంబర్లు 04069440000, 040 23450033ల ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

# నేడే సార్వత్రిక సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు కోడ్‌లు తెచ్చి ఉద్యోగ భద్రత లేకుండా చేస్తామంటే ఊరుకునేది లేదని కేంద్ర కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. యాజమాన్యాల దయకు కార్మికులు/ఉద్యోగులను వదిలేసే చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), అఖిలభారత కిసాన్ సభ (ఎఐకెఎస్) సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. వామపక్షాలు, బ్యాంకుల సంఘాలు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాలు సైతం మద్దతిచ్చాయి. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగానికి సర్కారు ద్రోహమని ఎస్‌కేఎం ఆగ్రహం వ్యక్తంచేసింది. చౌకగా అమెరికా వ్యవసాయ ఉత్పత్తులతో దేశీయ మార్కెట్లు నింపి దేశ రైతాంగాన్ని అగాధంలోకి నెట్టివేసేలా ఈ ఒప్పందం ఉన్నదని దుయ్యబట్టింది. వాణిజ్య ఒప్పందం ద్వారా అమెరికాకు భారత వ్యవసాయాన్ని దాసోహం చేసినట్లు సర్కారును ఏఐకేఎస్ దుయ్యబట్టింది. భారతీయ విపణిను అమెరికా పాల ఉత్పత్తులు, సోయాబీన్ నూనె, పశు దాణా, ఇతర వ్యవసాయ దిగుమతులతో నింపితే ఇక్కడ రైతులకు తీరని హాని జరుగుతుందని హెచ్చరించింది. దీనికి వ్యతిరేకంగా నిరసన గళం వినిపించేందుకు సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపింది. బ్రిటన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్‌తో చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాల్లో డెయిరీ ఉత్పత్తులు మినహాయించినట్లు అబద్ధాలు చెప్పి రైతాంగాన్ని వాస్తవాల నుంచి దారి మళ్లించేందుకు ప్రయత్నించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. దేశీయ వ్యవసాయ రంగం, పాడి పరిశ్రమపై ఈ ఒప్పందాలు దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని ఏఐకేఎస్ హెచ్చరించింది. అమెరికా, యూరప్ ఆర్థికంగా ప్రయోజనాలు పొందే విధంగా భారత్‌తో ఒప్పందాలు జరిగాయని పేర్కొంది. ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసి సహా 10కేంద్ర కార్మిక సంఘాల పిలుపునకు బ్యాంకుల సంఘాలు మద్దతిచ్చాయి. ప్రైవేటీకరణ, వేతనాల ప్రతిష్ఠంభన, సామాజిక భద్రతకు విఘాతం వంటి అంశాలపై ఆందోళన వ్యక్తంచేశాయి. ఇదిలావుంటే, కార్మికులకు, రైతులకు, ఉద్యోగులకు వ్యతిరేకంగా ప్రతిపాదించిన బిల్లుల ఉపసంహరణకు డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది. గ్రామీణ ఉపాధి పథకాల కింద ఉద్యోగాల భద్రతకు హామీకి డిమాండ్ ఉంది. ముసాయిదా విత్తనాల బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు, శాంతి చట్టం రద్దునకు కార్మికులు, రైతులు డిమాండ్ చేశారు. వీజీ జీ రామ్ జీ చట్టం రద్దు చేసి ఎంజీఎన్ఆర్ఈజీఏను తిరిగి అమల్లోకి తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎఐబిఇఎ, బిఇఎఫ్ఐ వంటి బ్యాంకుల సంఘాలు సైతం సమ్మెకు మద్దతు ఇవ్వడంతో బ్యాంకింగ్ కార్యకలాపాలకు విఘాతం కలగనుంది. సమ్మె కారణంగా కేరళ, కర్నాటక, ఒడిశా తదితర రాష్ట్రాల్లో విద్యా సంస్థలు మూసివేయనున్నారు. దేశమంతటా రవాణా కూడా స్తంభించబోతోంది. కాగా, సమ్మెలో సుమారు 30 కోట్ల మంది కార్మికులు భాగస్వాములు కాబోతున్నారని, దేశంలోని 600 జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు జరగనున్నాయని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ తెలిపిన విషయం విదితమే. ప్రభుత్వ ఆర్థిక, వ్యవసాయ, కార్మిక విధానాలు నష్టం కలిగిస్తున్నాయనే కార్మికులు, రైతులు, ఉద్యోగులు సమ్మె బాట పట్టినట్లు కార్మికరైతు నాయకులు స్పష్టం చేశారు.

నిర్యాణం
స్వస్తిశ్రీ విశ్వావసు నామ సం॥ర మాఘ మాస బ॥ చతుర్దశి
తేది : 31-01-2026 శనివారం రా॥ గం॥ 7-30 ని॥లకు మా తండ్రి గారైన
శ్రీ జూలూరు లక్ష్మీ నారాయణ గారు
స్వర్గస్థులైనారని తెలుపుటకు చింతించుచున్నాము.
తేది:08-02-2026 ఆదివారం కర్మఆరంభం.
తేది:10-02-2026 మంగళవారం దశాహం. ధర్మోదకములు.
తేది : 11-02-2026 బుధవారం తిలోదకములు శిలోద్వాసన.
అందికాలు. సోడశం.వృషోత్సర్జనం సపిండీకరణం
తేది : 12-02-2026 గురువారం గణపతిపూజ పుణ్యహావచనం ఆశీర్వచనం జరుపబడును.కావున
తామెల్లరు విచ్చేసి. మా తండ్రి గారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని ప్రార్థన.

కార్యస్థలం : గ్రా॥ దామరవంచ మం॥గూడూరు, జి॥మహబూబాబాద్.
సెల్ : 9866767359,9948005270
సహపంక్తి భోజనం : తేది : 12-02-2026 గురువారం మ॥ 12-00 గం॥లకు..
ఇట్లు
భార్య: జూలూరు భాగ్యలక్ష్మీ
కుమారులు-కోడల్లు:
జూలూరు శ్రీనివాస్-పావని
జూలూరు సంతోష్-సంధ్య
కూతురు-అల్లుడు
తమ్మిశెట్టి విజయలక్ష్మీ-రవికుమార్
మనుమలు మరియు మనుమరాల్లు

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com